ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

రాజమహేంద్రవరం : fb.com/vaartha Digital

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

13-7-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 163 పేజీలు: 8+4 వెల: 6.50



మహాగాయని జానకికి కన్నీటి వీడ్కోలు 2లో

హర్ముజ్ జలసంధి మళ్లీ మూసివేత 5లో


## సిఆర్‌డిఎ నిర్వాసితుల జీవన భృతి 10 వేలకు పెంపు

### లాండ్ పూలింగ్ రైతులకు రుణమాఫీ అమలు: ప్రభుత్వం



**విజయవాడ,జులై12,ప్రభాతవార్తప్రతినిధి:** సిఆర్‌డిఎ ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు ప్రభుత్వం ఊరట కల్పించింది. ట్రంకు రోడ్ల నిర్మాణంలో నివాసాలను కోల్పోయిన నిర్వాసిత కుటుంబాల జీవన భృతి రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచాలని నిర్ణయించింది. ఇటీవల సిఎం అధ్యక్షతన జరిగిన కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా ప్రభుత్వం 12 నెలల పాటు నెలకు రూ.10 వేల జీవన భృతి అందించనుంది. ఇంటి అద్దెతో కలిపి జీవన భృతి చెల్లింపునకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఎపిసిఆర్‌డిఎ చర్చల విధానంలో సవరణలు చేసింది. జులై 7వ తేదీన జరిగిన 63వ ఎపిసిఆర్‌డిఎ అథారిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకుంది. సవరించిన జీవన భృతి అమలు చేయాలని ఎంసిఆర్‌డిఎ కమిషనర్‌కు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ల్యాండ్ పూలింగ్ రైతులకు రుణమాఫీ అమలు చేయాలని ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాజధానిలో రెండో దశలో ల్యాండ్ పూలింగ్ రైతులకు ఎపి సర్కార్ యాన్యుటీ పెంచింది. మెట్ట భూములకు ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.40 వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. జరీబు భూములకు ఎకరాకు రూ.50 వేల >>2

# ప్రకృతి సేద్యాన్ని పెంచండి

### ఎల్‌నినో ప్రభావానికి తగినట్లుగా ప్రాంతాలవారీగా పంటల సాగు

### మైక్రో న్యూట్రియంట్ల వినియోగం కూడా పెంచాలి

### సీమను ఉద్యాన హబ్‌గా మార్చేందుకు రూ. 40 వేల కోట్లతో పూర్వోదయ పథకం : సిఎం చంద్రబాబు

**విజయవాడ, జులై12,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంపై ఎల్ నినో చూపుతున్న ప్రభావాలను అంచనా వేస్తూ ప్రాంతాల వారీగా పంటల సాగు అంచనా జరగాలని, దానికి అనుగుణంగానే చర్యలు ఉండాలని సిఎం నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు.ఆ మేరకు ఆయన వివిధ హోదాల్లో అధికార యంత్రాంగానికి కీలకాదేశాలు జారీచేసారు. సమాచార, పౌరసంబంధాలశాఖ సమాచారాన్ని అనుసరించి వివిధ ప్రాంతాల్లో ప్రకృతిసేద్యాన్ని ప్రోత్సహించేందుకు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో పిఎండిఎస్ హాఫ్ మూన్ విధానాల్లో సేద్యం చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎల్ నినో కారణంగా ప్రతికూల వాతావరణ పరిస్థితుల ప్రభావం ఉన్నప్పటికీ రాష్ట్రంలోని రైతులు నష్టపోకుండా పంటలకు కనీస మద్దతు ధర లభించేలా చూడాలని సిఎం దిశానిర్దేశం చేశారు. ఈ విషయంలో కేంద్ర సహకారంకూడా తీసుకుని ఎపిలో చేపడుతున్న ప్రకృతి సేద్యానికి మరింత ప్రోత్సాహం కల్పించాలని సిఎం స్పష్టం చేశారు. ఇప్పటికే ఈ సాగుతో విజయవంతమైన రైతుల సేవల్ని కూడా వినియోగించుకోవాలని సిఎం సూచించారు.రైతులు పండించిన ఉత్పత్తులు నేరుగా వినియోగదారుల ఇళ్లకుచేర్చేలా ఫార్మ్ టూ హోమ్ విధానం అమలు చేసేలా కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు >>2



ముంబయిలో శస్త్రచికిత్స చేయించుకున్న డి.సిఎం పవన్ కల్యాణ్‌ను ఆదివారం పరామర్శిస్తున్న సిఎం చంద్రబాబు - 2లో

### సెప్టెంబరు, అక్టోబరులో స్థానిక ఎన్నికలు

ఓటరు జాబితాల సమగ్ర ప్రత్యేక సవరణ ప్రక్రియ పూర్తయిన వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. సెప్టెంబరు నెలాఖరులో లేదా అక్టోబరులో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయన్నారు. కూటమి పార్టీల మధ్య అన్ని >>2



మంటలను అదుపు చేస్తున్న అగ్ని మాపక సిబ్బంది

## 7 బస్సులు దగ్ధం

### విజయవాడ ఆటోనగర్‌లో భారీ అగ్నిప్రమాదం

**విజయవాడ,జులై12,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడలోని ఆటోనగర్‌లో ఆదివారం భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. 7 బస్సులు దగ్ధమయ్యాయి. మరమ్మతుల కోసం ఉంచినబస్సులో మంటలు చెలరేగటంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సంఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. ఆటోనగర్ లోని ఓ మెకానిక్ షెడ్డులో మరమ్మతుల కోసం బస్సులను నిలిపి ఉంచారు. ఆదివారం ఉదయం 11.30గంటల ప్రాంతంలో మరమ్మతుల కోసం ఉంచిన ఓ బస్సులో మంటలు చెలరేగాయి. ఆ మంటలు కొద్దిసేపటికి మిగిలిన బస్సులకు వ్యాపించాయి. ఒక్కసారిగా దట్టమైన పొగలు వ్యాపించాయి. ఆ ప్రాంతమంతా నల్లటి పొగతో నిండిపోయింది.

పక్కనే మరికొన్ని బస్సులు పార్కింగ్ చేసి ఉండటంతో మంటలు మరింత వేగంగా వ్యాపించాయి. ఇది గమనించిన స్థానికులు వెంటనే అప్రమత్తమయ్యారు. అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు.ప్రమాద సమయంలో షెడ్డు నిండా బస్సులు ఉన్నాయి. అవి ఏవీ కూడా స్టార్టింగ్ కండిషన్‌లో లేవు. మంటలు మరింతగా వ్యాపించకుండా స్థానికులు సాహసంచేశారు. క్రేన్లసహాయంతో బస్సులను పక్కకు లాగే ప్రయత్నం >>2

### అదుపుతప్పిన కారు


### ఎఆర్ కానిస్టేబుల్ దుర్మరణం

**ఒంగోలు క్రైమ్, జులై 12, ప్రభాతవార్త:** ఒంగోలు నగరం మంగమూరు రోడ్డులోని పద్మ టవర్స్ ఎదుట ఆదివారం ఉదయం మహిళా వైద్యులు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి బీభత్సం సృష్టించింది. డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోవడంతో ముందుగా చెత్త ఆటో, ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. అనంతరం సైకిల్‌పై పోలీస్ పరేడ్ గ్రౌండ్‌కు విధులకు వెళ్తున్న ఎఆర్ కానిస్టేబుల్ మరియదాసు (36)ను బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు ఆయన రోడ్డుకు అవతల ఉన్న సర్వీస్ రోడ్డుపై పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందారు. కారు వేగంగా ముందుకు దూసుకెళ్లడంతో >>2

## ఉద్యమ బాటలో ఆర్టీసి జెఎసి

### రేపటి నుంచి దశలవారీగా ఆందోళనలకు పిలుపు

**విజయవాడ.జులై12,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ప్రైవేటు ఆపరేటర్లుతో విద్యుత్ బస్సుల నిర్వహణ, మూసివేసిన డిపోల పునరుద్ధరణపై స్పష్టత లేకపోవడంతో ఉద్యమం కొనసాగిస్తామని ఆర్టీసీ ఉద్యోగుల జెఎసి ఆదివారం ఓ ప్రకటన చేసింది. జూలై 14 నుంచి 19 వరకు ప్రజాప్రతినిధులను కలిసి మద్దతు కోరుతూ వినతిపత్రాల సమర్పణ ఉంటుందని, ఈ నెల 20 నుండి ఆర్టీసీ ఉద్యోగులందరి సంతకాల సేకరణ చేస్తామని జెఎసి నేతలు తెలిపారు.జులై 30న విజయవాడలో ఆర్టీసీ ఉద్యోగ సంఘాల జెఎసి రాష్ట్ర సమావేశం ఉంటుందని, ఆ రోజు మూడో దశ ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని జెఎసి నేతలు వెల్లడించారు. విద్యుత్ బస్సులను ప్రైవేట్ ఆపరేటర్ల ద్వారా నడపొద్దని జెఎసి ఈ సందర్భంగా డిమాండ్ చేసింది. మూసివేసిన నాలుగు ఆర్టీసీ డిపోలను వెంటనే పునరుద్ధరించాలని జెఎసి డిమాండ్ చేసింది. మొత్తం 30 డిమాండ్లతో గత నెల 11న యాజమాన్యానికి వినతిపత్రం జెఎసి సమర్పించింది.జూలై 6, 7, 9 తేదీల్లో అధికారులు జెఎసి మధ్య పలుమార్లు చర్చలు కూడా జరిపింది. డ్రాఫ్ట్ మినిట్స్‌లో స్పష్టమైన హామీలు లేకపోవడంతో రెండో దశ ఉద్యమం కొనసాగించాలని జెఎసి నిర్ణయించింది. ఇవాళ మరోమారు గూగుల్ మీట్‌లో జరిగిన జేఏసీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఉద్యమం కొనసాగింపుపై ఏకగ్రీవ నిర్ణయం తీసుకున్నారు. ఉద్యోగులు, ఆర్టీసీ, ప్రయాణికుల ప్రయోజనాల పరిరక్షణే జెఎసి లక్ష్యమని తెలిపారు.



ఆదివారం మైసూరులోని మహారాజా కాలేజ్ గ్రౌండ్స్‌లో జానకి భౌతిక కాయంవద్ద నివాళులర్పిస్తున్న అభిమానులు

# మహాగాయని జానకికి కన్నీటి వీడ్కోలు

## ప్రభుత్వ లాంఛనాలతో మైసూరులో అంత్యక్రియలు

### ఆమె వ్యవసాయ క్షేత్రంలోనే అంతిమ సంస్కారం జరిపిన కుటుంబ సభ్యులు

**మైసూరు,జులై 12:** ప్రముఖ గాయని, గాన కోకిల ఎస్. జానకి అంతిమ యాత్ర ముగిసింది. ఆదివారం ఆమె అంత్యక్రియలు కర్ణాటక ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో జరిగాయి. మైసూరు జిల్లా హెచ్‌డీ కోటె తాలూకాలోని ఆమె వ్యవసాయ క్షేత్రంలో కుటుంబ సభ్యులు, అభిమానుల అశ్రునయనాల మధ్య తుది సంస్కారాలు నిర్వహించారు. జానకమ్మ మనవరాలు అప్సర వైద్యుల తుది కర్మలు జరిపించారు. ఆమె అంతిమయాత్రలో పెద్ద సంఖ్యలో ప్రజలు, అభిమానులు పాల్గొన్నారు. జానకి కోరిక మేరకు కణియనహుండి లోని ఆమె ఫామ్‌హౌస్‌లో కుటుంబ సభ్యులు దహన సంస్కారాలు జరిపించారు. తెలుగు బ్రాహ్మణ సంప్రదాయాల ప్రకారం జానకి అంత్యక్రియలు నిర్వహించారు. ఆమె మనవరాలు చితికి నిప్పంటించారు. అంతకుముందు, జానకమ్మ పార్థివదేహాన్ని ప్రజల సందర్శనార్థం మైసూరులోని మహారాజా కాలేజీ గ్రౌండ్స్‌లో ఉంచారు. తమ అభిమాన గాయనిని కడసారి చూసేందుకు అభిమానులు, సినీ, రాజకీయ ప్రముఖులు వేలాదిగా తరలివచ్చారు. భారతీయ సంగీతానికి ఆమె చేసిన సేవలను గౌరవిస్తూ, పూర్తి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కర్ణాటక ముఖ్యమంత్రి డికె శివకుమార్ ప్రకటించారు. వయో సంబంధిత అనారోగ్యంతో బాధపడుతున్న 88 యేళ్ల జానకి, శనివారం మైసూరులోని అపోలో ఆసుపత్రిలో గుండెపోటుతో తుదిశ్వాస విడిచిన సంగతి తెలిసిందే. ఆరు దశాబ్దాలకు పైగా సాగిన తన అద్భుత ప్రస్థానంలో తెలుగు, తమిళం, కన్నడ సహా 20కి పైగా భాషల్లో 48వేలకు పైగా పాటలు పాడి ఆమె చరిత్ర సృష్టించారు. ఆమె విశిష్ట గాత్రానికి నాలుగు జాతీయ పురస్కారాలు కూడా లభించాయి. జానకి మృతి పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, సంగీత దర్శకుడు ఇళయరాజా సహా దేశవ్యాప్తంగా పలువురు ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆమె భౌతికంగా దూరమైనా, తన గాత్రంతో ఎప్పటికీ జీవించే ఉంటారని అభిమానులు భావోద్వేగానికి గురయ్యారు. జానకి అంతిమయాత్రలో సినీ, రాజకీయ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు. బాధాతప్త హృదయాలతో ఆమెకు కన్నీటి వీడ్కోలు పలికారు.

# రేపు విశాఖకు జగన్

**విజయవాడ,జూలై12 ప్రభాతవార్తప్రతినిధి:** వైసీపీ అధినేత జగన్ విశాఖపట్నంలో పర్యటించనున్నారు. ఇటీవల సముద్రంలో జరిగిన పడవ ప్రమాదంలో గల్లంతైన ఆరుగురు మత్స్యకారుల కుటుంబాలను ఆయన పరామర్శించనున్నారు. ఈ నెల 14వ తేదీన జగన్ పర్యటన ఖరారైంది. ఈ పర్యటన వివరాలను వైసీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు ఆదివారం వెల్లడించారు. జూలై 14న ఉదయం 10:30 గంటలకు జగన్ విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకుంటారని, అక్కడి నుంచి నేరుగా దక్షిణ నియోజకవర్గంలోని జబ్బరుపేటకు వెళ్లి గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలను ఓదార్చుతారని తెలిపారు. ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన కరి చిన్నాతో పాటు అతని కుటుంబ సభ్యులతోనూ జగన్ మాట్లాడతారని చెప్పారు. ఈ సందర్భంగా కేకే రాజు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తీరానికి కేవలం 8 నాటికల్ మైళ్ల దూరంలో ప్రమాదం జరిగినా, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరడానికి 20 గంటల సమయం పట్టిందని ఆరోపించారు. కోస్ట్ గార్డ్, నేవీ, మెరైన్ పోలీసు, మత్స్య, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయ లోపం కారణంగానే ఆరుగురు మత్స్యకారులు గల్లంతయ్యారని అన్నారు. గల్లంతైన వారి ఆచూకీ లభించకముందే రెస్క్యూ ఆపరేషన్‌ను నిలిపివేయడాన్ని ఆయన తప్పుబట్టారు. జిల్లాకు చెందిన హోం మంత్రి అనిత బాధితులను పరామర్శించకపోవడం దారుణమన్నారు. సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, మంత్రులు లోకేష్, అచ్చెన్నాయుడు ఈ విషాదంపై మౌనంగా ఉన్నారంటూ విమర్శించారు.

## జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

**దేవరపల్లి, జులై 12 (ప్రభాతవార్త ):** తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలంలోని యర్నగూడెం జాతీయ రహదారిపై ఆర్.కన్వెన్షన్ సమీపంలో ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు వ్యక్తులు మృతి చెందారు. దేవరపల్లి నుండి నల్లజర్ల వైపు పుల్లలు లోడ్ చేసుకుందునేందుకు వెళ్తున్న ట్రాక్టర్ ట్రక్కు వెనుక బాగాన్ని వేగంగా వచ్చిన లారీ బలంగా ఢీకొట్టింది.ట్రాక్టర్ ట్రక్కుకు సైడ్ డోర్లు లేకపోవడంతో వెనుక నుంచి వాహనం ఢీకొన్న ప్రభావానికి ట్రక్కులో ప్రయాణిస్తున్న ముగ్గురిలో ఇద్దరు వ్యక్తులు ఎగిరి రోడ్డుపై పడిపోవడం జరిగింది.ఈ ప్రమాదంలో రోడ్డు తాకిడికి తలలకు తీవ్ర గాయాలు కావడంతో సంఘటనా స్థలంలోనే సదరు ఇద్దరు వ్యక్తులు మృతి చెందడం జరిగింది.అదృష్టవశాత్తు ట్రక్కులోని మరో వ్యక్తి,ట్రాక్టర్ డ్రైవర్ ఈ ప్రమాదం నుండి సురక్షి తంగా బయటపడ్డారు.మృతులు దేవరపల్లి గ్రామానికి చెందిన కుక్కల శ్రీను (40) కళ్ళే రాజు (40)గా పోలీసులు గుర్తించారు.సమాచారం అందుకున్న హైవే మొబైల్ పార్టీ, దేవరపల్లి పోలీసు సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి,ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం కలగకుండా రక్షణ చర్యలు చేపట్టారు.

# అదుపుతప్పిన కారు

>> ఘటనాస్థలిలో ఒక్కసారిగా భయాందోళనలు నెలకొన్నాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులకు సహాయం అందించడంతో పాటు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ ప్రమాదంలో చెత్త ఆటో, ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో మరో ముగ్గురు స్వల్ప గాయాలపాలయ్యారు. వారిని సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదంకారణంగా కొంతసేపు మంగమూరు రోడ్డుపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని ట్రాఫిక్‌ను నియంత్రించి పరిస్థితిని సాధారణ స్థితికి తీసుకువచ్చారు. ఘటనాస్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి సంబంధించిన ఆధారాలను సేకరించారు. ప్రమాదానికి గురైన కారు, ఇతర వాహనాలను స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నారు. కారులోఉన్న మహిళా వైద్యులు సురక్షితంగా బయటపడినట్లు అధికారులు తెలిపారు. కారులో ప్రయాణిస్తున్న వారు ఒంగోలులో జరుగుతున్న గైనకాలజిస్టుల రాష్ట్ర సదస్సుకు హాజరైన మహిళా వైద్యులుగా పోలీసులు గుర్తించారు. ఆదివారం ఉదయం కాఫీ షాప్‌కు వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ప్రమాద సమాచారంఅందుకున్న జిల్లాఎస్పీ వి. హర్షవర్ధన్‌రాజు ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. తాలూకా సిఐ టి. విజయ్ కృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమా లేదా ఇతర సాంకేతిక కారణాలున్నాయా అనే కోణంలో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విధులకు హాజరవుతున్న సమయంలో ఎఆర్ కానిస్టేబుల్ మరియదాసు మృతి చెందడంపై విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పందించారు. బాధిత కుటుంబానికి సత్వర న్యాయం అందించాలని జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజుకు సూచించారు. అలాగే మృతుడి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం, తగిన సహాయం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది.

# పవన్‌ను పరామర్శించిన సిఎం చంద్రబాబు

**విజయవాడ, జులై12,ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ముంబైలోని ఒక ప్రముఖ ఆస్పత్రిలో తన కుడి భుజానికి శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు సిఎం చంద్రబాబు నాయుడు ఆదివారం ముంబైలోని ఆ ఆస్పత్రికి వెళ్లి పవన్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్‌తో సమావేశమై ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ముంబైలో తన కుడి భుజానికి నిన్న శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఆయన సర్జరీ విజయవంతం అయినట్లు వైద్యులు ప్రకటించారు.ఈ క్రమంలో ఆయన ఆరోగ్య స్దితిని తెలుసుకునేందుకు సిఎం చంద్రబాబు ముంబాయి చేరుకున్నారు.పవన్ ఉన్న ఆస్పత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు.ఈ సందర్భంగా ఇద్దరు నేతల మధ్య రాష్ట్ర అభివృద్ధి, ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రస్తుత రాజకీయ పరిస్థితులు వంటి అంశాలపై కూడా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. పవన్ కల్యాణ్ ఆరోగ్యంపై జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు నిరంతరం సమాచారం తెలుసుకుంటూ ఉండగా, ముఖ్యమంత్రి స్వయంగా వెళ్లి పరామర్శించడం ప్రాధాన్యం సంతరించుకుంది. మంత్రి నారాయణ కూడా పవన్ కల్యాణ్‌ను పరామర్శించారు.

**పవన్ కల్యాణ్‌కు శస్త్రచికిత్స విజయవంతం : సిఎం చంద్రబాబు**

పవన్ కల్యాణ్‌కు శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తయిందని సిఎం చంద్రబాబు అన్నారు. పవన్‌ను పరామర్శించిన అనంతరం ఆయన 'ఎక్స్'లో చేసిన పోస్టులో ఈ విషయం తెలిపారు. సుమారు మూడున్నర గంటలపాటు వైద్యులు ఈ ఆపరేషన్ చేశారన్నారు. ఆయన రెండో చేతికి కూడా స్వల్ప సమస్య ఉందని, ప్రస్తుతానికి ఫిజియోథెరపీ చేస్తామని డాక్టర్లు చెప్పారన్నారు. ఒకవేళ అవసరమైతే ఆ చేతికి కూడా ఆపరేషన్ చేస్తామన్నారు. పవన్ కనీసం మూడు వారాల పాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించినట్లు సీఎం చంద్రబాబు వెల్లడించారు. ఆయనకు ఎక్కువ విశ్రాంతి అవసరమని, పవన్ త్వరగా కోలుకోవాలని తాను ఆకాంక్షిస్తున్నట్లు చంద్రబాబు తెలిపారు.

## జానకికి సిఎం, డి.సిఎం, లోకేష్ నివాళులు

**విజయవాడ,జూలై12,ప్రభాతవార్తప్రతినిధి:** తుది శ్వాస విడిచిన గాన కోకిల, ప్రముఖ నేపథ్య గాయని ఎస్. జానకమ్మకు సిఎం చంద్రబాబు నివాళుల అర్పించారు. క్యాంప్ కార్యాలయంలో జానకమ్మ చిత్రపటానికి పూలమాల వేసి భారతీయ సంగీత రంగానికి ఆమె అందించిన విశిష్ట సేవలను స్మరించుకున్నారు. తెలుగు నేలపై జన్మించిన జానకమ్మ ఆరు దశాబ్దాలకు పైగా తన అపూర్వగానంతో కోట్లాది సంగీతాభిమానుల హృదయాలను గెలుచుకున్నారని కొనియాడారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ని ప్రార్థించారు.

**తెలుగు గాయనీమణుల్లో ఆణిముత్యం: డి.సిఎం పవన్**

గాయని జానకి మృతి పట్ల ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "ప్రఖ్యాత గాయని జానకి మరణం అత్యంత విచారకరం. తెలుగు గాయనీమణుల్లో ఆమె ఒక ఆణిముత్యం. జానకమ్మ పాడిన అజరామరమైన గీతాలు తెలుగువారి మదిలో ఎప్పటికీ మెదులుతూనే ఉంటాయి. జానకి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను" అని పవన్ తన సంతాప సందేశంలో వెల్లడించారు.

**ఎస్.జానకి మృతిపట్ల మంత్రి నారా లోకేశ్ సంతాపం**

ప్రముఖ గాయని ఎస్.జానకి మృతిపట్ల మంత్రి నారా లోకేష్ సంతాపం వ్యక్తం చేశారు. "సంగీత ప్రియుల హృదయాల్లో జానకి చెరగని ముద్రవేశారు. ఎస్.జానకి తెలుగునేలపై జన్మించడం మనందరికీ గర్వకారణం" అని లోకేశ్ అన్నారు.

# ప్రకృతి సేద్యాన్ని పెంచండి

>> నాయుడు ఆదేశించారు. ప్రత్యేకించి కూరగాయలు, పండ్ల ఉత్పత్తులు నేరుగా వినియోగదారుకు చేర్చేలా ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్ల ద్వారా ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు. వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ సహా తక్కువ వ్యయంతో ఇంటి వద్దకే చేరేలా ఈ కొత్త వ్యూహం ఉపయోగపడుతుందని అన్నారు. కరవు ప్రాంతాలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా వేర్వేరు చోట్ల పశువుల దాణా పండించేలా చూడాలన్నారు. వ్యవసాయ యాంత్రీకరణతో పాటు ఆధునీకరణ చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. భూసార పరీక్షలు చేసి ఏ పంటకు భూములు అనువుగా ఉన్నాయన్నది రైతులకు తెలియచేయాలన్నారు. భూసార పరీక్షలు చేసి వాటి వివరాలను రైతులు పొందేలా ఆన్‌లైన్‌లోనూ అందుబాటులో ఉంచాలని తెలిపారు. కృష్ణా, గోదావరి డెల్టా సహా వివిధ ప్రాంతాల్లో పంటలకు సాగునీటిపై దృష్టి పెట్టాలని సిఎం సూచించారు. పంట తెగుళ్లను నియంత్రించేలా పురుగుమందుల వినియోగం ఏమేరకు రాష్ట్రంలో తగ్గించగలిగామో అంచనా వేయాలని సిఎం స్పష్టం చేశారు. రసాయన ఎరువుల వినియోగం తగ్గించి మైక్రో న్యూట్రియంట్లను పెంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. యుద్ధ ప్రభావం నేపథ్యంలో రసాయన ఎరువుల లభ్యత పై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని.. ఈ నేపథ్యంలో ప్రకృతి సేద్యం వైపుగా రైతుల్ని ప్రోత్సహించాలన్నారు. నేచురల్ ఫార్మింగ్‌పై వ్యవసాయ విశ్వవిద్యాలయాలకు చెందిన ప్రొఫెసర్లు, విద్యార్థులు కూడా క్షేత్రస్థాయికి వెళ్లి అధ్యయనం చేసేలా యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని అధికారులకు సిఎం నిర్దేశించారు. వ్యవసాయ యాంత్రీకరణపై క్లస్టర్ల వారీగా ప్రణాళికలు చేపట్టటంతో పాటు రైతు సాధికార సంస్థ ద్వారా హార్వెస్టర్లు, విత్తన యంత్రాలు, ఇతర పరికరాలు ఇచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. ఫార్మర్ యాప్ ద్వారా అన్ని అంశాలనూ ఇంటిగ్రేట్ చేయాలని డ్రోన్లు, ఫార్మింగ్ యంత్రాల వినియోగం మరింత పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాయలసీమ ప్రాంతాన్ని ఉద్యాన హబ్‌గా మార్చేందుకు రూ.40 వేల కోట్లతో పూర్వోదయ పథకం అమలులో భాగంగా సాగునీటి ప్రాజెక్టులు, రహదారుల కనెక్టివిటీ, గోదాములు సహా మౌలిక సదుపాయాల నిర్మాణంతో పాటు రూ.60 వేల కోట్ల ప్రైవేటు పెట్టుబడులతో అభివృద్ధి చేయనున్నట్టు సిఎం వివరించారు. తూర్పుగోదావరి జిల్లా దేవరాపల్లి సమీపంలో యడవోలు వద్ద కోకో సిటీ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు. జూలై నాటికి మదనపల్లెలో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు శంకుస్థాపన చేయనున్నట్టు సిఎం వెల్లడించారు. పశు దాణాతో పాటు సైలేజ్‌ను తక్కువ వ్యయానికే అందుబాటులోకి తేవటంతో పాటు తీవ్ర ఉష్ణోగ్రత కారణంగా పౌల్ట్రీలో కోళ్లు చనిపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రాయలసీమలో అరటికి కోల్డ్ స్టోరేజి సౌకర్యం కల్పించాలని సిఎం అధికారులను ఆదేశించారు.రైతు బజార్లు, ప్రైవేటు మార్కెట్లలో ప్రకృతి సేద్యం ద్వారా పండిన ఉత్పత్తులకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పులివెందులలో సెంట్రల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబొరేటరీని పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. దీనికి అవసరమైన రూ.3కోట్లను తక్షణమే విడుదల చేసి కార్యకలాపాలు ప్రారంభించాలని సిఎం నిర్దేశించారు. ఆక్వా జోన్లలో ఆక్వా సాగు చేసే రైతులకు ఇచ్చే విద్యుత్ సబ్సిడీ అంశంపైనా సిఎం కీలకమైన ఆదేశాలు జారీచేశారు. ప్రస్తుతం ఆక్వా రంగానికి యూనిట్‌కు రూ.1.50 చొప్పున విద్యుత్ విద్యుత్ సబ్సిడి ఇస్తున్నామని అన్నారు.ఇప్పటికే ఇచ్చిన 50 వేల కనెక్షన్లతో పాటు కొత్తగా రిజిస్ట్రేషన్లు చేసుకున్న 12,680 ఆక్వా కనెక్షన్లకూ ఈ సబ్సిడీ వర్తింప చేయాలని ఆదేశించారు. ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.1,100 కోట్లు ఇస్తోందని తెలిపారు. కొత్తగా ఇచ్చే కనెక్షన్లకు కూడా రూ.188 కోట్ల అదనపు సబ్సిడీని ప్రభుత్వం భరిస్తుందని వివరించారు. రాష్ట్రంలో సాగవుతున్న 4 లక్షల ఎకరాలు ఆక్వా జోన్ పరిధిలోకి రావాలని సీఎం స్పష్టం చేశారు. ఆక్వా రంగంలో క్వాలిటీ సర్టిఫికేషన్‌తో పాటు ట్రేసబిలిటీ తీసుకురావాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

# 7 బస్సులు దగ్ధం

>>చేశారు. తమ ప్రాణాలకు తెగించి సుమారు 10 బస్సుల వరకు సురక్షితంగా బయటకు తీశారు. దీంతో మరింత భారీ నష్టం తప్పింది. ఈలోగా మూడు ఫైరింజన్లు సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఇక, ఈ ప్రమాదంలో గ్యారేజీలో నిలిపి ఉంచిన ఏడు బస్సులు దగ్ధం అయ్యాయి. పోలీసులు ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని తెలిపారు.

## పవన్ ఆరోగ్యంపై కోకిలాబెన్ ఆస్పత్రి హెల్త్ బులెటిన్

**విజయవాడ, జూలై12,ప్రభాతవార్తప్రతినిధి:** పవన్ ఆరోగ్యంపై కోకిలాబెన్ ఆస్పత్రి హెల్త్ బులెటిన్‌ను ఆదివారం విడుదల చేసింది. పవన్ కుడి భుజంలోని రొటేటర్ కఫ్‌కు తీవ్రగాయం అయింది.రెండు ప్రధాన టెండన్లు చిట్లినట్లు వైద్యుల నిర్ధారణ చేసారు.నిన్న విజయవంతంగా శస్త్రచికిత్స పూర్తి చేసాం.ప్రస్తుతం నిలకడగా పవన్‌కల్యాణ్ ఆరోగ్యం ఉంది.కొంతకాలం పూర్తి విశ్రాంతి తీసుకోవాలని వైద్యుల సూచించారు. విశ్రాంతి అనంతరం షోల్డర్ రిహాబిలిటేషన్ ప్రారంభించడం జరుగుతుంది.

## వారం - వర్జ్యం

13-07-2026, సోమవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, పునర్వసు కార్తె
చతుర్దశి సా.6.50,
ఆరుద్ర రా.2.52
వర్జ్యం : మ.1.06-మ.2.31
దు.ము.12.38-మ.1.30,
2) మ.3.15-సా.4.07
రాహుకాలం – ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** కోర్టుకేసుల పరిష్కార దశకు చేరుకుంటాయి. ఊహించని విధంగా ఉద్యోగావకాశాలు దరికి చేరుతాయి.

**వృషభం:** చేపట్టిన పనులు సాఫీగా సాగుతాయి. ప్రముఖులను కలుసుకొని ముఖ్య విషయాలపై చర్చిస్తారు.

**మిథునం:** అకాల భోజనం, ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం తగదు. కళారంగంలోని వారికి విదేశీ పర్యటనలు వుంటాయి.

**కర్కాటకం:**సంతానం పరంగా అభివృద్ధిని సాధిస్తారు. పోటీ పరీక్షలలో అతికష్టం మీద విజయం సాధిస్తారు. వాహనసౌఖ్యం.

**సింహం:** జీవితభాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ఋణబాధలు తొలగుతాయి.

**కన్య :**సానుకూలంగా ఆలోచించి గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని నిర్ణయాలు తీసుకోండి. బంధువుల కలయిక.

**తుల :** మధ్యవర్తిత్వాలు, పంచాయితీలు లాభించవు. దేవాలయ సందర్శన చేసుకుంటారు. స్పెక్యులేషన్ లాభిస్తుంది.

**వృశ్చికం:** సన్నిహితం వర్గం నుండి ఆర్థిక సహాయ సహకారాలు నామమాత్రంగా అందుకుంటారు. పెట్టుబడులలో నిదానం అవసరం.

**ధనుస్సు:**ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న అవకాశాలు లాభిస్తాయి. మానసిక ప్రశాంతత పొందుతారు.

**మకరం:**రాజకీయ రంగాలలోని వారికి విదేశీ పర్యటనలు ఉంటాయి. ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు లాభిస్తాయి.

**కుంభం:** వ్యక్తిగత సమస్యల నుండి బయటపడతారు. సకుటుంబ సమేతంగా ప్రయాణాలు చేస్తారు.వస్త్ర లాభం.

**మీనం :** ఎదుటి వారి విషయంలో జోక్యం వద్దు. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. శుభవార్తలు అందుకుంటారు.

– శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



శనివారం రాత్రి సిమ్లాలో కురిసిన భారీ వర్షాలకు కొండచరియలు విరిగిపడిన దృశ్యం

# జీవన భృతి 10 వేలకు పెంపు

>> నుంచి రూ.60 వేలకు పెంచింది. 2024 జూన్ 12వ తేదీ తర్వాత ఒప్పందం చేసిన రైతులకు వర్తిస్తుందని స్పష్టం చేసింది. పదేళ్ల పాటు యాన్యుటీ చెల్లింపులు చేయాలని నిర్ణయించింది. ల్యాండ్ పూలింగ్ స్కీమ్ నిబంధనల్లో సవరణ చేసింది. రూ.10 వేల చొప్పున మెట్ట, జరీబు భూముల యాన్యుటీని ఎపి ప్రభుత్వంపెంచింది. గుంటూరు, పల్నాడు జిల్లాల 7 గ్రామాల్లో డెట్ వేవర్ స్కీమ్‌కు ఎపి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఎపిసిఆర్‌డిఎ కమిషనర్‌కు రుణమాఫీ అమలు అధికారాలను ప్రభుత్వం కల్పించింది. ల్యాండ్ పూలింగ్ పరిధిలోని రైతుల వ్యవసాయ రుణాల మాఫీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రుణమాఫీ అమలుకు ప్రత్యేక కార్యాచరణ మార్గదర్శకాలను ఎపిసిఆర్‌డిఎ రూపొందించనుంది. జూన్ 2026 నాటికి ఉన్న వ్యవసాయ రుణాలకే అర్హత కల్పించాలని స్పష్టం చేసింది. ఎపిసిఆర్‌డిఎ చట్టం సెక్షన్ 55(4) తొలి నోటిఫికేషన్ తేదీనే కట్‌ఆఫ్‌గా నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు జీవో ఎంఎస్ నంబర్148ను ప్రభుత్వం జారీ చేసింది.పట్టణ మౌలిక వసతుల అభివృద్ధికి రూ.1,122.86 కోట్ల ప్రాజెక్టులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. మున్సిపల్ బాండ్ల ద్వారా రూ.1,010.58 కోట్లు సమీకరించనుంది. పూల్డ్ మున్సిపల్ బాండ్ ఇష్యూ ఫ్రేమ్‌వర్క్‌కు సూత్రప్రాయ ఆమోదం తెలిపింది. పట్టణాభివృద్ధి నిధుల సమీకరణకు మార్కెట్ ఆధారిత విధానానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎపియుఐఎఎంఎల్ పూల్డ్ మున్సిపల్ బాండ్ కార్యక్రమానికి ప్రోగ్రామ్ మేనేజర్‌గా నియమించింది. మర్చంట్ బ్యాంకర్ ఎంపికకు స్క్రీనింగ్ కమిటీ ఏర్పాటు చేసింది. బాండ్ జారీకి ముందు పాల్గొనే పట్టణ స్థానిక సంస్థలకు క్రెడిట్ రేటింగ్ తప్పనిసరి అని స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వ గ్యారంటీ లేకుండానే బాండ్ జారీ ప్రక్రియ చేయాలని నిర్ణయించింది. బాండ్ రుణాల చెల్లింపు బాధ్యత పూర్తిగా సంబంధిత పట్టణ స్థానిక సంస్థలదేనని తేల్చిచెప్పింది. ఈ క్రమంలోనే పట్టణ మౌలిక వసతుల ప్రాజెక్టులకు ప్రత్యామ్నాయ నిధుల సమీకరణపై ప్రభుత్వం దృష్టిసారించింది.

# సెప్టెంబరు, అక్టోబరులో స్థానిక ఎన్నికలు

>> స్థాయిల్లో విస్తృత సమన్వయం ఉండాలని స్పష్టంచేశారు. కూటమి పార్టీల రాష్ట్రస్థాయి సమన్వయ కమిటీ సమావేశాన్ని ఈ నెల 15న నిర్వహించాలని నిర్ణయించారు. పార్టీ ఇన్‌ఛార్జులు లేని నియోజకవర్గాల్లో త్వరలోనే నియామక ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. ఎన్టీఆర్ భవన్‌లో సీఎం చంద్రబాబు పార్టీ ముఖ్య నేతలు, జోనల్ కోఆర్డినేటర్‌లతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. సోషల్ మీడియా వేదికగా గొడ్డలి పార్టీ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టడం, ఓటర్ల జాబితాల సవరణ, పార్టీ బలోపేతం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం వంటి అంశాలపై నేతలకు సీఎం దిశానిర్దేశం చేశారు. రాయలసీమలో ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, ఏర్పాటు చేస్తున్న పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు వంటి అంశాలపై 'రాయలసీమ రైజింగ్' పేరుతో విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు.

## సిఎం చంద్రబాబు నేడు కోనసీమ జిల్లాల పర్యటన

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పర్యటన, జులై 12 ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం తూర్పుగోదావరి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో విస్తృతంగా పర్యటించనున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం 10:25 గంటలకు గుంటూరు జిల్లా ఉండవల్లిలోని తన నివాసం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి ఉదయం 11 గంటలకు తూర్పుగోదావరి జిల్లా వేమగిరి హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.అక్కడ ప్రజాప్రతినిధులు, అధికారుల స్వాగతం పలుకుతారు. అనంతరం ఉదయం 11.10కి రోడ్డు మార్గంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్‌కు ఉదయం 11.25 చేరుకుని, బ్యారేజ్ నంబర్ 1 గేటును అధికారికంగా ప్రారంభిస్తారు. అనంతరం ఉ.11.40కు అక్కడ నుంచి బయలుదేరి ఉ .11.50 ఆత్రేయపురం మండలం పిచ్చుకలంక గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై రైతులతో ముఖాముఖి సమావేశంలో పాల్గొని,వారి సమస్యలు, సూచనలు తెలుసుకుంటారు. రైతులతో సమావేశం ముగిసిన అనంతరం ముఖ్యమంత్రి మ.12.50కు అక్కడ నుంచి బయలుదేరి మ.12.55కి వేమగిరి హెలిప్యాడ్‌కు చేరుకుని, అక్కడి నుంచి హెలికాప్టర్‌లో ఏలూరు జిల్లాలోని పోలవరం ప్రాజెక్టు ప్రాంతానికి బయలు దేరుతారు. మ.1:20 గంటలకు ప్రాజెక్టు ప్రాంతానికి చేరుకుని ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావేశమవుతారు. మధ్యాహ్నం 2:05 గంటల నుంచి సాయంత్రం 5:15 గంటల వరకు పోలవరం ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. ఈ సందర్భంగా ఇసిఆర్‌ఎఫ్ గ్యాప్ 2 పనులు, పవర్ హౌస్ నిర్మాణ పనుల పురోగతిని నిశితంగా పరిశీలిస్తారు. పరిశీలన అనంతరం పోలవరం సాగునీటి ప్రాజెక్టు పురోగతిపై ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. అనంతరం ప్రాజెక్టు తాజా పరిస్థితి, ప్రభుత్వం చేపట్టనున్న తదుపరి చర్యలపై మాట్లాడతారు. అనంతరం సాయంత్రం 5:25 గంటలకు పోలవరం ప్రాజెక్టు ప్రాంతం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి, సాయంత్రం 6:05 గంటలకు ఉండవల్లిలోని తన నివాసానికి చేరుకుంటారు.

## తెలంగాణ సిఎం రేవంత్‌పై అనుచిత వ్యాఖ్యలు

### గుంటూరులో వైసీపీ నేత నాగార్జున యాదవ్ అరెస్ట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై12:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణల నేపథ్యంలో వైసీపీ అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్‌ను తెలంగాణ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదివారం నాడు ఎపిలోని గుంటూరులో ఉన్న ఆయన నివాసానికి వెళ్లిన పోలీసులు, ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. కాగా, సిఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి నాగార్జున యాదవ్ చేసిన కొన్ని వ్యాఖ్యలపై కేసు నమోదైంది. ఈ కేసుకు సంబంధించి దర్యాప్తు చేస్తున్న తెలంగాణ పోలీసులు ఆదివారం గుంటూరుకు చేరుకున్నారు. నాగార్జున యాదవ్‌ను అరెస్ట్ చేస్తున్నట్లు ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం, తమ వివరాలను, అరెస్ట్ సమాచారాన్ని స్థానిక నల్లపాడు పోలీస్ స్టేషన్‌కు తెలియజేస్తామని చెప్పి ఆయన్ను తమతో తీసుకెళ్లారు. ఒక రాష్ట్రానికి చెందిన రాజకీయ నేతను, మరో రాష్ట్ర పోలీసులువచ్చి అరెస్ట్ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల ఒక టివి ఛానల్ చర్చా కార్యక్రమంలో నాగార్జున యాదవ్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. ఎమ్మెల్యేగా కూడా రేవంత్ సమర్థంగా పనిచేయలేదని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యల కారణంగానే ఆయనపై కేసు నమోదై, అరెస్ట్ జరిగిట్టు తెలుస్తోంది.

# డ్రగ్స్ విక్రయంపై పోలీసుల దాడి

## ముగ్గురు యువకులు అరెస్ట్

### వారిలో ఒకరు టిటిడి ఉద్యోగి?

**రేణిగుంట, జులై 12 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా రేణిగుంట అర్బన్ పోలీసులు జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు రేణిగుంట డిఎస్పీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో రెండు రోజుల క్రితం శుక్రవారం రేణిగుంట రైల్వే స్టేషన్ పార్కింగ్ వద్ద గంజాయి అమ్మే ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద 62 గ్రాముల మెత్ డ్రగ్, నాలుగు సెల్ ఫోన్లు, రెండు బుల్లెట్ ద్విచక్ర వాహనాలు, రెండు డిజిటల్ వేయింగ్ మిషన్లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు పంపారు. అరెస్ట్ అయిన వారిలో ఒకరు తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన ఉద్యోగిగా భావిస్తున్నారు. అర్బన్ పోలీసులకు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు అర్బన్ సిఐ జయచంద్ర, ఎస్సైలు ధర్మారెడ్డి, శ్రీనివాసులు తమ సిబ్బందితో రేణిగుంట రైల్వే స్టేషన్ కార్ పార్కింగ్ వద్ద ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. తిరుపతి జిల్లా తిరుపతి అర్బన్ మండలం శెట్టిపల్లి గ్రామానికి చెందిన తెల్ల గుణశేఖర్ (26), తిరుపతి కొర్లగుంటకు చెందిన అశ్విన్ కుమార్ (30), అదే ప్రాంతానికి చెందిన రాహుల్ యాదవ్ (30) గా పోలీసులు నిర్ధారించారు. వీరిలో ఒక వ్యక్తి తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన తిరుపతి శ్రీగోవిందరాజు స్వామి గుడి అనుసంధాన కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. వాస్తవ అవాస్తవాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

## నందిగామ గురుకుల వసతిగృహం విద్యార్థిని అదృశ్యం

**విజయవాడ.జులై12,ప్రభాతవార్తప్రతినిధి:** ఎన్టీఆర్ జిల్లా నందిగామ గురుకుల వసతిగృహం విద్యార్థిని అదృశ్యమవడం స్థానికంగా కలకలం రేపింది. నందిగామ జడ్పీ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న జోషిక అనే విద్యార్థిని కనిపించకుండా పోయింది. వీరులపాడు మండలం చెన్నారావుపాలెంకు చెందిన బాలికగా అధికారులు గుర్తించారు. బాలిక ఆర్టీసీ బస్సు ఎక్కి కంచికచర్ల బస్టాండ్‌లో దిగినట్లు సిసి ఫుటేజ్‌లో గుర్తించారు. బాలిక స్వగ్రామానికి పాఠశాల ఉపాధ్యాయులు, పోలీసులు వెళ్లారు.



# ధవళేశ్వరం బ్యారేజీకి నూతన జీవం

- 117 వరద గేట్ల మార్పిడికి ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు శ్రీకారం
- గోదావరి డెల్టా భద్రత, సాగునీటి భవిష్యత్తుకు చరిత్రాత్మక అడుగు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జులై 12 ప్రభాతవార్త:** ఉభయ గోదావరి జిల్లాల వ్యవసాయ, తాగునీటి అవసరాలకు దాదాపు రెండు శతాబ్దాలుగా జీవనాడిగా నిలిచిన ధవళేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ మరో చారిత్రాత్మక ఘట్టానికి వేదిక కానుంది. సుమారు రూ.152.95 కోట్ల వ్యయంతో 117 పాత వరద గేట్ల స్థానంలో అత్యాధునిక వరద గేట్ల ఏర్పాటు పనులకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిధిలో పిచ్చుకలంక గేట్ నెంబర్ ఒకటి వద్ద సోమవారం శంకుస్థాపన చేయనున్నారు. గోదావరి డెల్టా సాగునీటి భద్రత, ఆనకట్ట దీర్ఘకాలిక సంరక్షణ దిశగా ఇది అత్యంత కీలకమైన మైలురాయిగా అధికారులు పేర్కొంటున్నారు.

1847లో ప్రారంభమై 1852లో పూర్తయిన ధవళేశ్వరం ఆనకట్టతో గోదావరి జలాలను సక్రమంగా వినియోగించేందుకు మార్గం సుగమమైంది. అప్పటి వరకు సముద్రంలో కలిసిపోయే వరద జలాలను వ్యవసాయానికి మళ్లించి,గోదావరి డెల్టాను దేశంలోనే అత్యంత సారవంతమైన ప్రాంతాల్లో ఒకటిగా తీర్చిదిద్దడంలో సర్ ఆర్థర్ కాటన్ పాత్ర చారిత్రాత్మకంగా నిలిచింది.ఈ కృషికి గుర్తింపుగా గోదావరి జిల్లాల రైతులు నేటికీ ఆయనను కృతజ్ఞతాభావంతో స్మరిస్తుంటారు. కాలక్రమేణా పాత ఆనకట్ట వయోభారానికి లోనవడంతో, 1963 వరదల అనంతరం ఆధునిక బ్యారేజీ నిర్మాణ అవసరం ఏర్పడింది. 1969లో ప్రారంభమైన సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ నిర్మాణం 1984లో పూర్తయింది. దాదాపు 5.837 కిలోమీటర్ల పొడవున్న ఈ బ్యారేజీ ప్రస్తుతం 10.13 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించడంతో పాటు లక్షలాది మంది ప్రజలకు తాగునీటి ప్రధాన ఆధారంగా కొనసాగుతోంది. వరద నియంత్రణ, డెల్టా వ్యవసాయ పరిరక్షణలోనూ ఇది కీలక పాత్ర పోషిస్తోంది.

నాలుగు దశాబ్దాలుగా నిరంతర వినియోగం, భారీ వరదల ఒత్తిడి, యాంత్రిక భాగాల సహజ శిథిలీకరణ నేపథ్యంలో బ్యారేజీ భద్రతపై కేంద్ర జల సంఘం, డ్యామ్ సేఫ్టీ రివ్యూ ప్యానెల్, హైడ్రోమెకానికల్ నిపుణుల కమిటీలు పలు దఫాలు పరిశీలనలు నిర్వహించాయి. వాటి సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం బ్యారేజీ ఆధునీకరణకు శ్రీకారం చుట్టింది.

201415లో తొలి దశలో 175 వరద గేట్లలో 58 గేట్లను రూ.31.77 కోట్లతో మార్చగా, ఇప్పుడు మిగిలిన 117 గేట్ల మార్పిడి, అన్ని 175 గేట్లకు కొత్త రబ్బర్ సీల్స్, రోలర్ అసెంబ్లీలు, వైర్ రోప్‌లు, మాస్టర్ కంట్రోల్ ప్యానెల్స్, విద్యుత్ కేబుళ్ల మార్పిడి, శాండ్ బ్లాస్టింగ్, పెయింటింగ్ వంటి సమగ్ర పనులు చేపట్టనున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే బ్యారేజీ భద్రత, వరద నిర్వహణ సామర్థ్యం మరింత మెరుగుపడుతుందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ప్రభుత్వం 2025లో ఈ పనులకు పరిపాలనా అనుమతి మంజూరు చేయగా, సాంకేతిక ఆమోదం అనంతరం ఎంఎస్ బికెం ఇన్ ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ సంస్థకు పనులు అప్పగించారు. రెండు సంవత్సరాల్లో పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రాజెక్టు అమలవుతోంది.

ఈ కార్యక్రమం కేవలం గేట్ల మార్పిడితో పరిమితం కాకుండా, గోదావరి డెల్టా భవిష్యత్తుకు భద్రత కల్పించే దీర్ఘకాలిక పెట్టుబడిగా భావిస్తున్నారు. ముఖ్యంగా తూర్పు, పశ్చిమ గోదావరి, కోనసీమ జిల్లాల రైతాంగంతో పాటు మత్స్యకారులు, గ్రామీణ ప్రజల జీవనోపాధి మరింత స్థిరపడే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

జలవనరుల పర్యవేక్షణ సమితి గుర్తింపు పొందిన గోదావరి ప్రాంత వారసత్వ సంపద సంరక్షణ దిశగా కూడా ఈ ఆధునీకరణ కార్యక్రమం ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. చారిత్రక విలువ కలిగిన బ్యారేజీ నిర్మాణ వారసత్వాన్ని పరిరక్షిస్తూనే, ఆధునిక సాంకేతికతతో భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దే ప్రయత్నంగా దీనిని భావిస్తున్నారు.

సర్ ఆర్థర్ కాటన్ సృష్టించిన జలవనరుల వారసత్వాన్ని సంరక్షిస్తూ, భవిష్యత్ తరాలకు సురక్షితమైన సాగునీటి వ్యవస్థను అందించాలనే సంకల్పంతో చేపడుతున్న ఈ కార్యక్రమం గోదావరి డెల్టా చరిత్రలో మరో సువర్ణ అధ్యాయంగా నిలవనుందని అధికారులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.



## జ్యోతి సురేఖ, ప్రీతిక ప్రదీప్, చికిత తానిపర్తికి సిఎం చంద్రబాబు అభినందనలు

**విజయవాడ, జులై 12 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆర్చరీ వరల్డ్ కప్ స్టేజ్4 మహిళల కాంపౌండ్ ఈవెంట్‌లో రజతం సాధించిన జ్యోతి సురేఖ, ప్రీతిక ప్రదీప్, చికిత తానిపర్తికి ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందనలు తెలిపారు. యువ ఆర్చర్లకు రాష్ట్ర ముద్దుబిడ్డ జ్యోతి సురేఖ స్ఫూర్తిగా నిలుస్తున్నారని కొనియాడారు. ఛాంపియన్లను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ టోర్నమెంట్‌లో టీమ్ ఇండియా మరిన్ని విజయాలను సాధించాలన్నారు.

**క్రీడా మంత్రి అభినందనలు:** ఆర్చరీ వరల్డ్ కప్ స్టేజ్4లో పతకాలను సాధించిన జ్యోతి సురేఖ, ప్రీతిక ప్రదీప్, చికిత తానిపర్తికి ఏపీ క్రీడా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అభినందించారు. వారు మంచి విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. వారు విలువిద్యలో రాణించడానికి ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సాహాన్ని అందిస్తుందన్నారు.

# హంద్రీనీవా విస్తరణకు శ్రీకారం

- రూ.790 కోట్ల పనులు ప్రారంభించిన మంత్రి నిమ్మల రామానాయుడు



**హిందూపురం, జులై 12 ప్రభాతవార్త:** హంద్రీనీవా కాలువ వెడల్పు చేస్తూ మడకశిర బ్రాంచ్ కెనాల్ వరకు విస్తరించే అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ శంకుస్థాపన చేశారు. హిందూపురం పర్యటనకు వచ్చిన సందర్భంగా బాలయ్య రాచపల్లి గ్రామంలో ఆదివారం ఉదయం భూమి పూజ చేసి పనులు ప్రారంభించగా రాష్ట్ర జలవనరుల అభివృద్ధి శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యేలు కందికుంట వెంకటప్రసాద్, ఎమ్మెస్ రాజు, అమిలినేని సురేంద్రబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా లాంఛనంగా కాలువ వెడల్పు పనులను స్వయంగా బాలకృష్ణ హిటాచి వాహనం నడుపుతూ ప్రారంభించడం విశేషం. అనంతరం మీడియా సమావేశంలో మంత్రి నిమ్మల మాట్లాడుతూ వైఎస్ జగన్ పార్టీ పాలనలో రాయలసీమకు చేసిందేమీ లేదని, సీమ ద్రోహులుగా మిగిలిపోయారని ఘాటుగా విమర్శించారు. తమ ప్రభుత్వం రాయలసీమ రతనాల సీమగా మార్చుతోందని అన్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణ కృషితోనే 790 కోట్ల రూపాయల నిధులు హంద్రీ నీవా పనులకు విడుదల అయ్యాయని చెప్పారు. తమ ప్రభుత్వంలో రూ. 3,800 కోట్ల నిధులు విడుదల చేశామని చెప్పారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ హిందూపురం ప్రాంత అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని చెప్పారు. అనంతరం పట్టణంలో ఎంజీఎం క్రీడా మైదానములో నూతనంగా నిర్మించిన ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియంను బాలయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూపుర ప్రజల రుణం తీర్చుకోలేనిదని అభివృద్ధి పనులు చేస్తూ ప్రజలకు అండగా ఉంటామని వివరించారు. కష్టపడిన పార్టీ కార్యకర్తలకు తగిన గుర్తింపు లభిస్తుందని స్పష్టం చేశారు. ఇండోర్ స్టేడియం ప్రారంభంతో ఎంతో కాలంగా ఉన్న సమస్య తీరిందని దేహ దారుఢ్యానికి క్రీడలు ఎంతో కీలకం అన్నారు. అనంతరం బాలయ్యతో పాటు ఎంపీ పార్థసారథి, కలెక్టర్ శ్యాంప్రసాద్, చైర్మన్ రవి నాయుడు షటిల్ బ్యాడ్మింటన్ ఆడారు. ఆదేవిధంగా టేబుల్ టెన్నిస్ కూడా ఆడుతూ క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. రాచపల్లిలో జరిగిన కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి హాజరు అయ్యారు. ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శులు డాక్టర్ సురేంద్రబాబు, శ్రీనివాసరావు, వీరయ్య, బాలాజీ తోపాటు మున్సిపల్ మాజీ చైర్మన్ అనిల్ కుమార్, రమేష్ కుమార్, పట్టణ టిడిపి అధ్యక్షులు వెంకటేష్ మొదలగు వారు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి సవిత

# విద్యకు అధిక ప్రాధాన్యత: మంత్రి సవిత

**విజయవాడ, జులై 12 ప్రభాతవార్త ప్రతినిధి:** బిసి విద్యార్థుల విద్యకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని మంత్రి సవిత వ్యాఖ్యానించారు. సన్నబియ్యంతో రుచికరమైన భోజనం అందిస్తున్నామని పేర్కొన్నారు. డైట్ ఛార్జీల బిల్లులు 10శాతం పెంచబోతున్నామని తెలిపారు. బిసి బిడ్డలకు రుచికరమైన, కడుపు నిండేలా భోజనం అందిస్తున్నామని చెప్పుకొచ్చారు. బిసి విద్యార్థులు అత్యున్నత స్థానాల్లో నిలవాలన్నదే సిఎం చంద్రబాబు లక్ష్యమని ఉద్ఘాటించారు. ఆదివారం ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండల కేంద్రంలో మంత్రి సవిత పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వత్సవాయి ఎంజెపి గురుకుల పాఠశాలలో పి4 విధానంలో రూ.75 లక్షలతో నిర్మించిన డైనింగ్ హాల్, డార్మెటరీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజగోపాల్, మాజీ మంత్రి, కెడిసిసి బ్యాంకు ఛైర్మన్ నెట్టెం రఘురాం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడారు. సిఎం చంద్రబాబు ఆశయాన్ని కొనసాగిస్తూ పి4 విధానంలో వత్సవాయి ఎంజెపి స్కూల్‌ను అభివృద్ధి చేసిన ఎన్ఆర్ఐ చిరుమామిళ్ల రాంబాబు దంపతులను అభినందించారు. చిరుమామిళ్ల రాంబాబు ఎంతో మంది దాతలకు స్ఫూర్తిగా నిలిచారని ప్రశంసించారు. బిసి గురుకులాలను స్థాపించిన ఘనత దివంగత మాజీ సిఎం నందమూరి తారక రామారావుది అని తెలిపారు. సిఎం చంద్రబాబు వందలాది బిసి గురుకులాలను ఏర్పాటు చేశారని ప్రస్తావించారు. సమాజం నుంచి పేదరికాన్ని పారదోలాలని సిఎం చంద్రబాబు పి4 విధానం తీసుకువచ్చారని పేర్కొన్నారు. మన చుట్టు పక్కల ఉన్న పేదల కోసం ధనవంతులు ఎంతో కొంత సాయం చేయాలనే సదుద్దేశంతో పి4 విధానాన్ని సిఎం చంద్రబాబు అమలు చేస్తున్నారని ప్రస్తావించారు. కార్పొరేట్ విద్యాసంస్థల కంటే ఎంజెపి సీట్లకే డిమాండ్ ఎక్కువగా ఉందని వెల్లడించారు. పదోతరగతి, ఇంటర్‌లో ఎంజెపి విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని మంత్రి సవిత ప్రశంసించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఫొటోతో కూడిన విద్యామిత్ర కిట్లను అందజేస్తున్నామని తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీసుకొస్తున్న సంస్కరణల ఫలితంగా పదోతరగతి, ఇంటర్‌లో గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది ఫలితాలు వచ్చాయని తెలిపారు. ప్రస్తుతం ఎపిలో 109 గురుకులాలు ఉండగా, ఈ యేడాది కొత్తగా మరో 10 గురుకులాలను ప్రారంభించామని చెప్పుకొచ్చారు. 6 ఎంజెపి బాలికల గురుకుల పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేశామని వెల్లడించారు. రూ.500 కోట్ల సాస్కి నిధులతో ఎంజెపి గురుకులాలకు శాశ్వత భవనాలు ఏర్పాటు చేశామని అన్నారు. కొత్తగా బిసి హాస్టళ్లకు బదులు గురుకులాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించామని చెప్పారు. ఎంజెపి స్కూళ్లు, బిసి హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. ఆర్వో ప్లాంట్లు, సిసిటివి కెమెరాలు, ఇన్వర్టర్లు ఏర్పాటు చేశామని మంత్రి సవిత పేర్కొన్నారు.

# వలసల నివారణకే పలాస ఎయిర్‌పోర్ట్

- 500 ఎకరాల్లో పరిశ్రమల స్థాపన
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు
- భూసేకరణపై రైతులకు గరిష్ఠ పరిహారం: కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



**పలాస (శ్రీకాకుళం జిల్లా), జులై 12 ప్రభాతవార్త:** శ్రీకాకుళం జిల్లాను వెనుకబడిన ప్రాంతమనే ముద్ర నుంచి దూరం చేసి, ఉపాధి వలసలను శాశ్వతంగా నివారించడమే లక్ష్యంగా పలాస ప్రాంతంలో ప్రతిపాదిత విమానాశ్రయాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నామని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. ఆదివారం పలాసలో విమానాశ్రయ ఏర్పాటు, భూసేకరణ, పరిహారం చెల్లింపులపై స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఉడాన్ పథకం కింద ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నిధులతో ఈ విమానాశ్రయం పూర్తి ప్రభుత్వ ఆధీనంలోనే నిర్మితమవుతుందని, ప్రైవేటుకి కట్టబెడతారనే అపోహలను ఎవరూ నమ్మవద్దని కోరారు. జిల్లాలో విమానాశ్రయం కేవలం ప్రయాణికుల కోసమే కాదని, దీనితో పాటు సేకరించే భూముల్లో దాదాపు 500 ఎకరాలను ప్రత్యేకంగా పరిశ్రమల స్థాపన కోసం కేటాయిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. పరిశ్రమల స్థాపన ద్వారానే స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. విమానాశ్రయం, పరిశ్రమల వల్ల వచ్చే ఉద్యోగాలలో స్థానిక ప్రజలకే మొదటి ప్రాధాన్యత దక్కేలా ఒక పక్కా క్రమబద్ధమైన విధానాన్ని తీసుకువస్తామని హామీ ఇచ్చారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్ కారణంగా అక్కడ భూముల ధరలు పెరగడం, హోటళ్లు, రవాణా రంగాల ద్వారా వేలాది మందికి ఉపాధి లభించిన విషయాన్ని ఆయన ఉదాహరణగా గుర్తుచేశారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఆధ్వర్యంలో జిల్లాలోని మూలపేట పోర్ట్ పనులు అత్యంత వేగంగా సాగుతున్నాయని మంత్రి రామ్మోహన్ నాయుడు కొనియాడారు. మూలపేట ప్రాంత ప్రజలు ప్రాజెక్టు కోసం భూత్యాగం చేయడం వల్లే ఈరోజు ప్రపంచ స్థాయి కంపెనీలు అక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నాయని, అదే తరహాలో పలాస విమానాశ్రయానికి కూడా ప్రజలు సహకరించాలని కోరారు. రాబోయే 20, 30, 40 ఏళ్లలో మన పిల్లల భవిష్యత్తు బాగుండాలన్నా, ఉపాధి కోసం దుబాయ్, గల్ఫ్, సింగపూర్ వంటి దేశాలకు వలస వెళ్లే దుస్థితి తప్పాలన్నా ఈ ప్రాజెక్ట్ ఒక కేంద్ర బిందువుగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ, విమానాశ్రయ భూసేకరణ ప్రక్రియలో ఏ ఒక్క గ్రామాన్ని కూడా ఖాళీ చేయించడం లేదా తరలించడం జరగదని స్పష్టం చేశారు. భూసేకరణ చట్టం ప్రకారం రైతులకు, భూములు కోల్పోతున్న బాధితులకు పూర్తి స్థాయిలో న్యాయమైన, గరిష్ఠ పరిహారాన్ని పారదర్శకంగా అందిస్తామని హామీ ఇచ్చారు. స్థానిక ప్రజల పూర్తి అంగీకారం, సమన్వయంతోనే ఈ ప్రక్రియను ముందుకు తీసుకెళ్తామని కలెక్టర్ వివరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ హరి ఓం పాండియా, ఆర్డీఓ కృష్ణమూర్తి, పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీషలతో పాటు పలువురు స్థానిక నాయకులు, శాఖల ఉన్నతాధికారులు, పరిసర గ్రామాల ప్రజలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భూసేకరణపై రైతులు అడిగిన పలు సందేహాలను అధికారులు ఈ సందర్భంగా నివృత్తి చేశారు.

# సర్ ప్రక్రియ పారదర్శకంగా ముగించండి

- తిరుపతిలో తనిఖీల్లో కేంద్ర ఎన్నికల కమిషన్ కార్యదర్శి నవీన్ కుమార్




**తిరుపతి, జులై 12 ప్రభాతవార్త ప్రతినిధి:** ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ఇంటింటి సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని భారత ఎన్నికల కమిషన్ కార్యదర్శి నవీన్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఆదివారం తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో సంయుక్త కలెక్టర్ ఆర్. గోవిందరావు, ఇన్‌చార్జి కమిషనర్ శారదాదేవి, స్మార్ట్ సిటీ జీఎం చంద్రమౌళి తదితర అధికారులతో కలిసి ఎస్ఐఆర్ పురోగతిని సమీక్షించి అవసరమైన సూచనలు చేశారు. సమీక్ష అనంతరం ఎన్నికల కమిషన్ బృందం సెక్షన్ ఆఫీసర్ అనిత కుక్రేజా, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ ఉదిత్ కుమార్‌లతో కలిసి క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. తిరుపతిలోని రామకృష్ణ థియేటర్ సర్కిల్, లక్ష్మీపురం, వైకుంఠపురం ప్రాంతాలతో పాటు చంద్రగిరి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని తిరుచానూరు, చిన్నగొట్టిగల మండలం భాకరాపేట, ఎర్రావారిపాలెం మండలం నెరబైలు ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలను సందర్శించి ప్రత్యేక సవరణ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్లు, బిఎల్ఒలను కలిసి వారి పరిధిలోని పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల సంఖ్య, సేకరించిన ఎన్యూమరేషన్ ఫారాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఐఆర్ హెల్ప్‌డెస్క్ పనితీరును పరిశీలించి సచివాలయ సిబ్బంది, బీఎల్‌ఏలతో మాట్లాడారు. తిరుచానూరు ప్రాంతంలో ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన పలువురు తిరిగి వెళ్లిపోవడంతో 2002 ఓటర్ల జాబితాతో పోల్చడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని అధికారులు వివరించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా కొనసాగుతోందని బీఎల్‌ఏలు సంతృప్తి వ్యక్తం చేసినట్లు అధికారులు తెలిపారు. అనంతరం వైకుంఠపురంలోని 250వ పోలింగ్ కేంద్ర పరిధిలో ఇంటింటి సర్వేలో పాల్గొని స్థానిక ఓటర్లతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఆర్డీవో రామ్మోహన్, తిరుపతి అర్బన్ తహసీల్దార్ సురేష్‌బాబు, తిరుపతి రూరల్ తహసీల్దార్ జనార్దన్‌రాజు, సచివాలయ సిబ్బంది, బిఎల్ఒలు, బిఎల్ఎలు తదితరులు పాల్గొన్నారు.

# నేడు డయల్ యువర్ ఎస్‌పిడిసిఎల్ సిఎండి

**తిరుపతి, జులై 12 ప్రభాతవార్త ప్రతినిధి:** విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం నేడు (సోమవారం) ఉదయం 10 గంటల నుండి నుంచి మధ్యాహ్నం 12.30 గంటలవరకు "డయల్ యువర్ సిఎండి" కార్యక్రమాన్ని ఎస్పీడీసీఎల్ నిర్వహించనుంది. తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి వినియోగదారులు 89777 16661 నంబర్‌కు కాల్‌చేసి తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురావచ్చు. ఈ కార్యక్రమం ద్వారా తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురాదలచిన వినియోగదారులు తమ వద్ద విద్యుత్ సర్వీసు నంబరు అందుబాటులో ఉండేలా చూసుకోవాలి. కాగా జిల్లాస్థాయిలో తమ విద్యుత్ సమస్యలను ఎస్ఇల దృష్టికి తీసుకువచ్చేందుకు వీలుగా వినియోగదారులు ఈ నంబర్లకు కాల్ చేయాల్సి ఉంటుంది. తిరుపతి: 87126 52679, చిత్తూరు: 79931 47979, నెల్లూరు: 08612 320427, అన్నమయ్య: 94408 17449, కడప: 08562 242457, కర్నూలు: 73826 14308, నంద్యాల: 73826 18976, అనంతపురం: 91547 90350, శ్రీసత్యసాయి: 99637 07847 కాల్‌చేసి విద్యుత్ సమస్యలను ఎస్ఇల దృష్టికి తీసుకురావచ్చు.

# విశాఖను కుదిపిన భూప్రకంపనలు

- రిక్టర్ స్కేల్‌పై 4.5 తీవ్రత నమోదు.. అప్రమత్తంగా ఉండాలని నిపుణుల సూచనలు



**విశాఖపట్నం, జులై 12 ప్రభాతవార్త:** విశాఖనగరంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం తెల్లవారుజామున సంభవించిన భూప్రకంపనలు ప్రజలను ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేశాయి. ఉదయం 5:05:46 గంటలకు నమోదైన ప్రకంపనలు రిక్టర్ స్కేల్‌పై 4.5 తీవ్రతతో నమోదైనట్లు అధికారికంగా నిర్ధారణ అయింది. సాగర్‌నగర్, తాటిచెట్లపాలెం, సీతమ్మధార, మాధవధార, లాసన్స్ బే కాలనీ, పెదవాల్తేరు, ఈస్ట్ పాయింట్ కాలనీ, హెచ్‌బీ కాలనీతో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో భూమి కంపించినట్లు స్థానికులు తెలిపారు. భూప్రకంపనలతో పలువురు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. అయితే ఎలాంటి ప్రాణనష్టం, ఆస్తి నష్టం జరిగినట్లు ఇప్పటివరకు సమాచారం లేదు. ఈ సందర్భంగా మాజీ ఆంధ్ర విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్, లయన్స్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ వెలగపూడి ఉమామహేశ్వరరావు ప్రజలు భూకంపం సమయంలో భయాందోళనలకు గురికాకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. 'డ్రాప్-కవర్-హోల్డ్' విధానాన్ని పాటించాలని, లిఫ్ట్‌లను ఉపయోగించకుండా మెట్ల ద్వారానే బయటకు రావాలని, కిటికీలు, భారీ వస్తువులకు దూరంగా ఉండాలని సూచించారు. భూకంపం అనంతరం గ్యాస్ లీకేజీ, విద్యుత్ సరఫరాను తనిఖీ చేయాలని, అధికారిక సమాచారం మాత్రమే నమ్మాలని, వృద్ధులు, చిన్నారులు, దివ్యాంగులకు ప్రాధాన్యంగా సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# రొయ్యల రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య
- సిఎం చంద్రబాబుకు బహిరంగ లేఖ



**విజయవాడ, జులై 12 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో తీవ్ర ఆక్వా సంక్షోభం నెలకొని రొయ్యల రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారని, వారిని తక్షణమే ఆదుకునేందుకు ప్రభుత్వం అత్యవసర చర్యలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య ముఖ్యమంత్రి చంద్రబాబును డిమాండ్ చేశారు. ఈ మేరకు అక్వా రైతులను ఆదుకోవాలని కోరుతూ సీఎంకి ఈశ్వరయ్య ఆదివారం బహిరంగ లేఖ రాశారు. ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 6 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతుండగా, లక్షలాది కుటుంబాలు ఈ రంగంపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి జీవిస్తున్నాయని పేర్కొన్నారు. అయితే ఇటీవల కాలంలో పెరుగుతున్న ఉత్పత్తి వ్యయాలు, పడిపోతున్న రొయ్యల ధరలు, నాసిరకం సీడ్, కల్తీ మందులు, విద్యుత్ సమస్యలు, ఎగుమతుల్లో ఎదురవుతున్న ఇబ్బందులతో రైతులు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల సీపీఐ బృందం పశ్చిమగోదావరి, అంబేద్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాల్లో పర్యటించి రొయ్యల రైతులతో మాట్లాడిందని ఈశ్వరయ్య తెలిపారు. క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు అత్యంత ఆందోళనకరంగా ఉన్నాయని పేర్కొన్నారు. కేవలం రెండు నెలల వ్యవధిలోనే రొయ్యల మేత ధర టన్నుకు రూ.10 వేల నుంచి రూ.12,500 వరకు పెరిగిందని, ముఖ్యమంత్రి సమక్షంలో మేత ధరలను కిలోకు రూ.4 తగ్గించాలని ప్రభుత్వం సూచించినప్పటికీ కంపెనీలు కేవలం రూ.2 మాత్రమే తగ్గించి, ప్రస్తుతం ఆ తగ్గింపును కూడా అమలు చేయడం లేదని ఆరోపించారు. ప్రభుత్వ ఆదేశాలను పట్టించుకోని కంపెనీలపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వల్ల రైతులు నష్టపోతున్నారని విమర్శించారు. అదేవిధంగా వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి 100 కౌంట్ రొయ్యల ధరను కిలోకు రూ.260 నుంచి రూ.235కు తగ్గించడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. మార్కెట్లో నాణ్యతలేని రొయ్య పిల్లలు విచ్చలవిడిగా విక్రయిస్తున్నారని, ఒక్క ఎకరానికి లక్ష నుంచి 1.15 లక్షల పిల్లలు వదిలినా అందులో సగం మాత్రమే జీవిస్తున్నాయని పేర్కొన్నారు. కల్తీ మందుల అమ్మకాలను అరికట్టడంలో ప్రభుత్వ యంత్రాంగం విఫలమైందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఆక్వా, నాన్‌ఆక్వా జోన్లతో సంబంధం లేకుండా యూనిట్ విద్యుత్‌ను రూ.1.50కే అందిస్తామని ఇచ్చిన హామీ ఇప్పటికీ అమలు కాలేదని ఈశ్వరయ్య గుర్తు చేశారు. పైగా పవర్ ఫ్యాక్టర్ పేరుతో తీసుకొచ్చిన జీవో నంబర్ 169 వల్ల సబ్సిడీ పొందే అర్హత ఉన్న రైతులు కూడా నష్టపోతున్నారని విమర్శించారు.

# దక్షిణ కొరియా పర్యటనలో ప్రధాన ఆకర్షణగా శ్రీసిటీ

- శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి



**సత్యవేడు(తిరుపతి జిల్లా), జులై 12 ప్రభాతవార్త:** పెట్టుబడుల ఆకర్షణలో భాగంగా రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, హెచ్‌ఆర్‌డీ శాఖ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో ఈ నెల 5 నుంచి 11 వరకు సాగిన దక్షిణ కొరియా పర్యటనకు విశేష స్పందన రాగా, వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన పెట్టుబడి దారుల చర్చల్లో శ్రీసిటీ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ పర్యటన ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు అంతర్జాతీయ పెట్టుబడుల అవకాశాలు మరింత బలోపేతం కాగా శ్రీసిటీ ప్రపంచ స్థాయి పారిశ్రామిక కేంద్రంగా విస్తృత గుర్తింపు పొందిందని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తెలిపారు. శ్రీసిటీని ప్రపంచ పెట్టుబడులకు అనువైన గమ్యస్థానంగా ప్రముఖ కొరియా కంపెనీలు, పరిశ్రమల సమాఖ్యలు, ప్రభుత్వ సంస్థలకు సమర్థవంతంగా పరిచయం చేసిన మంత్రి లోకేష్‌కు రవీంద్ర సన్నారెడ్డి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. సియోల్, బుసాన్ నగరాల్లో జరిగిన ఉన్నత స్థాయి సమావేశాల్లో శ్రీసిటీని ప్లగ్ అండ్ ప్లే పారిశ్రామిక హబ్‌గా, ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్లు, డిస్‌ప్లే తయారీ, ఎలక్ట్రిక్ వాహన భాగాలు, అధునాతన తయారీ కృత్రిమ మేధస్సు ఆధారిత పరిశ్రమలు, సముద్ర సాంకేతిక రంగాలకు అత్యంత అనువైన కేంద్రంగా మంత్రి లోకేష్ వివరించినట్లు వెల్లడించారు. ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్, సోలమ్ గ్రూప్ హ్యుందాయ్ మొబిస్, సియోల్ సెమికండక్టర్, సునిక్ సిస్టమ్స్, సామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్, మోటివ్ లింక్,హ్యాసంగ్ హెవీ ఇండస్ట్రీస్ తదితర ప్రముఖ కొరియా సంస్థలతో జరిగిన చర్చల్లోను శ్రీసిటీ కీలక అంశంగా నిలిచిందన్నారు. ఈ పెట్టుబడుల ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు(ఈడీబీ), కొరియా ట్రేడ్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ ఏజెన్సీ(కేవోటీఆర్ఏ), భారత పరిశ్రమల సమాఖ్య(సీఐఐ), సియోల్‌లోని భారత రాయబార కార్యాలయం తదితర భాగస్వామ్య సంస్థలకు రవీంద్ర సన్నారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ పర్యటన రాష్ట్రానికి నాణ్యమైన పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు, అంతర్జాతీయ భాగస్వామ్యాలను మరింత పెంచుతాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

వార్త

ధైర్యం ఒక ఆయుధం, దాన్ని పట్టుకుంటే అసాధ్యాలన్నీ సుసాధ్యాలౌతాయి.

- జి. ఇలియట్

# చేదు వాస్తవం!

క్యాన్సర్ ప్రాణాంతకమేమీ కాదన్న శాస్త్రజ్ఞుల భరోసా ఉన్నా ఎంతో మంది రోగులకు ఇప్పటికీ నాణ్యమైన వైద్యం అందుబాటులో లేదని ఎన్నో సంఘటనలు రుజువు చేస్తున్నాయి. ఎన్నో కొత్త కొత్త ఔషధ ప్రయోగ ఆవిష్కరణలున్నా, ఆ రుగ్మతపై వస్తున్న సమాచారం ఇప్పటికీ మానవాళిని భయపెడుతూనే ఉంది. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఐదుగురిలో ఒకరు కేన్సర్ బారిన పడుతున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ తాజా నివేదికలో వెల్లడించింది. ప్రపంచంలో తాము కేన్సర్ రోగులపై చేసిన అధ్యయనాలు, తాజా అంకెల సేకరణను బట్టి 92శాతం మంది తమ జీవితంలో ఏదో ఒకసారైనా కేన్సర్‌కు ప్రభావితమైనవారేనని వివరించింది. కేన్సర్ నిర్ధారణ నుంచి నివారణ, చికిత్స విధానాలు, భరోసా వంటి అన్ని సందర్భాల్లోను రోగులు నిరాదరణకు గురవుతున్నారన్న అభిప్రాయాన్ని 'హు' వెల్లడించింది. ఈ వ్యాధిలో లక్షలాది మంది శారీరక భావోద్వేగ, ఆర్థిక కష్టనష్టాలను చవిచూశారని అంచనా. ఎన్నో కేన్సర్ రోగాల గురించి అవగాహన లేకపోవడమే కారణం కావొచ్చు. ఎందరో రోగులకు వైద్యసేవలు అందడమేలేదని డబ్ల్యుహెచ్ఓ అంగీకరించింది. ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతమున్న వైద్య చికిత్సల్లో సవాళ్లు కేన్సర్‌కేనని చెప్పాలి. అంతర్జాతీయ కేన్సర్ పరిశోధనా సంస్థతో కలిసి ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ నివేదిక విడుదల చేసింది. యేటా ప్రపంచ వ్యాప్తంగా 2.6కోట్ల కొత్త కేన్సర్ కేసులు నమోదవుతుండగా, కనీసం కోటి మరణాలు సంభవిస్తున్నాయని ఆ నివేదిక తెలుపుతోంది. జనాభా పెరుగుదల, వృద్ధాప్యం, మారుతున్న జీవనశైలి కారణంగా 2050 నాటికి కేసుల సంఖ్య సుమారు 3.5 కోట్లకు చేరుకుంటుందని తెలిపింది. ఇప్పటికే ఆరోగ్య సంరక్షణ విధానాలపై ప్రభుత్వాలు ఎంతో వ్యయపరుస్తున్నా కేన్సర్ రోగుల అవసరాలకు తగినంతగా ప్రయోజనం చేకూరడం లేదనే అపోహాలున్నాయి. సాధారణంగా ప్రాథమిక దశలోనే గుర్తిస్తే కేన్సర్ నయమవుతుందన్న భరోసా ఒకటున్నా ఆతర్వాత దశల మాటేమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తాజాగా ప్రఖ్యాత ఆంకాలజిస్టు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు చెప్పిన మాటలు వింటుంటే కేన్సర్ రోగికి ప్రాణం లేచొస్తోంది. నాలగవ దశలో ఉన్న కేన్సర్‌ను కూడా తగ్గించవచ్చునని స్పష్టంగా చెబుతున్నారు. ముందు వ్యాధి లక్షణాలు తెలియగానే నిర్ధారణ చికిత్స విధానాలకు ఒక్కో రోగికి అత్యధిక మొత్తంలో ఖర్చు చేసుకోవాల్సిరావడమే కేన్సర్ రోగిని బాధించే విషయం. ఆ తర్వాతనేచికిత్సల ఖర్చు. గత అయిదారేళ్లుగా కేన్సర్ చికిత్సలో విప్లవాత్మక మార్పులు రావడం శుభసూచకమే. జనాన్ని ప్రభావితం చేయగల కేన్సర్ వారియర్ సెలబ్రిటీలు కూడా కేన్సర్ రోగులకు రుగ్మతల నుంచి బయటపడి మార్గదర్శకులుగా సమాజానికి హితవు చెప్పగలుగుతున్నారు. వారి స్ఫూర్తితో మరెంతో మంది కేన్సర్ రోగులు బతుకు మీద ఆశలు పెంచుకుంటున్నారు. కేన్సర్ నాలుగోదశలో శరీరంలోని ఇతర భాగాలకు వ్యాపిస్తుంది. ఇతర దీర్ఘకాలిక వ్యాధుల్లాగే ట్రీట్ చేస్తూ అత్యాధునిక చికిత్సల ద్వారా కొన్ని జీవిత కాలాన్ని పెంచే కృషిలో ఆంకాలజిస్టులు నిమగ్నమవుతున్నారు. టార్గెటెడ్ థెరపీ,ఇమ్యూనో థెరపీ వంటి ఆధునిక పద్ధతులతో కేన్సర్ వృద్ధిని అదుపులో ఉంచి రోగి జీవనప్రమాణాన్ని పెంచగలుగుతున్నారు. తాజాగా ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రపంచానికి ఓ చేదు వాస్తవాన్ని వెల్లడించినట్లయింది. కేన్సర్ చికిత్సలో గణనీయ పురోగతి సాధించినట్లు భావిస్తున్న తరుణంలో కేన్సర్ రోగుల వ్యాప్తి అంశాలు వైద్యరంగానికి ఓ మేలుకొలుపులాగే చెప్పుకోవాలి. శాస్త్ర ప్రయోజనాలు ప్రతి రోగికి చేరడంలో అసమానతలు ఉన్నాయన్న అంశంపై చిత్తశుద్ధితో ప్రభుత్వాలు సరిచేయకపోతేకోట్లాది మంది ప్రాణాలకు ఆయువు తీరినట్లే. కేన్సర్ వ్యాధికి చికిత్స అంటే రోగి శరీరంలోని రోగనిరోధక వ్యవస్థతో నిరంతరపోరాటమే. అధిక ఆదాయ దేశాల్లో కేన్సర్ నిర్ధారణ, ఔషధాలు, రేడియోథెరపీ వంటి చికిత్సలు సులువుగా అందుతున్నాయి. పేద,మధ్యస్థ ఆదాయ దేశాలలో ఎంతో మందికి రోగులకు ప్రాథమిక చికిత్సలే అందుబాటులో లేవన్న ఆందోళనలున్నాయి. అందుకే కేన్సర్ రోగుల కుటుంబాలు ఆర్థిక సంక్షోభంలోకి నెట్టి వేయబడుతున్నాయి. భారత్ వంటి దేశాలకు 'హు' నివేదిక ఒక హెచ్చరికవంటిదే. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సైతంప్రత్యేక కేన్సర్ కేంద్రాల ఏర్పాటు వైద్యనిపుణుల నియామకం, వగైరా సమగ్ర ఆరోగ్య వ్యవస్థను సిద్ధం చేయాలి. ఈ నివేదిక వెలుగు చూడడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ వైద్యవిధానాల కోసం చేస్తున్న ఏర్పాట్లు ఏమాత్రం చాలవని అర్థమౌతోంది. అంతేకాకుండా ప్రస్తుత వాతావరణ, సామాజిక పరిస్థితుల్లో కేన్సర్ ఇమ్యూనిటీపై మరిన్ని పరిశోధనలు అవసరం. విదేశీ శాస్త్రీయ విజ్ఞానమే కాకుండా స్వదేశీ విజ్ఞానంలో అద్భుతాలు చేయగలిగిన నైపుణ్యత భారతీయుల్లో ఉంది. దానిని సద్వినియోగం చేసుకోవాలి. దేశంలో హృద్రోగ మరణాల తర్వాత కేన్సర్ మరణాలదే ద్వితీయ స్థానం.82 శాతం దేశాలు జాతీయ కేన్సర్ నియంత్రణ ప్రణాళికలను రూపొందించుకున్నాయి. కానీ అవిచాలవు. ప్రపంచంలోనిమూడింట ఒక వంతు దేశాలు మాత్రమే తమ సార్వత్రిక ఆరోగ్య బీమా పథకాల్లో కేన్సర్ పరిరక్షణకు నడుం కట్టాయి. సంపన్న అభివృద్ధి చెందిన దేశాల్లో రొమ్ముకేన్సర్ బారినపడిన మహిళల్లో 87 శాతం మంది ఐదేళ్లకు పైగా జీవిస్తున్నారు. భారత్‌లో గర్భాశయ ముఖద్వారా కేన్సర్‌దే అగ్రస్థానం. దీనిపై శ్రద్ధపెట్టే బాధ్యత కేంద్ర వైద్య ఆరోగ్య మంత్రిత్వశాఖ. ఆంకాలజిస్టులదే ఆ దిశా మార్పు జరిగితే కేన్సర్‌కు చెక్‌పెట్టవచ్చు.

డబ్బు ఉన్నప్పుడు ఎడాపెడా ఖర్చు చేయడం, లేనప్పుడు ఇతరుల దగ్గర చేతులు చాచడం వల్ల మన వ్యక్తిత్వం దెబ్బతింటుంది.



మహాత్మా గాంధీ

అందరిలోనూ శక్తిసామర్థ్యాలు ఎంతో కొంత ఉంటాయి. వాటిని వినియోగించుకోవడంలోనే అసలు సమస్య ఉంటుంది.



రామకృష్ణ పరమహంస

# ప్రజావాక్కు



### ఆహార ధరలను ఎందుకు తగ్గించడం లేదు?

కేంద్ర ప్రభుత్వం గతవారం వాణిజ్య అవసరాల కోసం వాడేఎల్పీజీ సిలిండర్ ధరను రూ.183.50 తగ్గించింది. ధరల పెంపుతో అసంతృప్తిగా ఉన్న హోటళ్లకు ఇది కొంత ఉపశమనం కలిగించింది. ప్రస్తుత బ్లాక్ మార్కెట్ కారణంగా సిలిండర్ల అమ్మకాలుతగ్గడంతో సరఫరా గొలుసు సాధారణ స్థితికి వచ్చింది. అయితే, హోటల్స్ లో దొరికే టిఫిన్,భోజనం,కాఫీ,టీ,ధరలు మాత్రం తగ్గలేదు. హోటల్ యజమానులు ధరలు తగ్గించకపోవటంతో వినియోగదారులు చాలా నిరాశ చెందుతున్నారు. సిలిండర్ ధరను యాభైలేదా వంద రూపాయలు పెంచిన వెంటనే, ఒక రకమైనటిఫిన్,భోజనం,టీ,కాఫీ ధరలను అమాంతం పది రూపాయలు పెంచారు. సిలిండర్ ధరల తగ్గింపు హోటళ్లకు ప్రయోజనకరమైనప్పటికీ, ఇది వినియోగదారులకు చాలా భారంగా మారింది. ధరల నియంత్రణకు సంబంధించి స్పష్టమైన నిబంధనలు అవసరం.

- దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

### అతివేగం అనర్థదాయకం

పెరుగుతున్న వాహనాల సంఖ్య, మితిమీరిన వేగం కారణంగా నేడు రోడ్డుప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. ఎందరో ప్రాణాలు కోల్పోవడమే కాకుండా, అనేక కుటుంబాలు వీధిన పడుతున్నాయి. రోడ్లను ప్రమాదరహితంగా మార్చడం అనేది కేవలం ప్రభుత్వం బాధ్యత మాత్రమే కాదు, ప్రతి పౌరుడి కర్తవ్యం. రహదారి భద్రత విషయంలో నిర్లక్ష్యం వహించడంవల్ల కలిగే పరిణామాలు అత్యంత భయంకరంగా ఉంటున్నాయి. ప్రమాదాల నివారణకు రహదారుల రూపకల్పనలో శాస్త్రీయ పద్ధతులు పాటించాలి. మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు, రాత్రి వేళల్లో వెలుతురు ఉండేలా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలి.

- సి. సాయిరుత్విక్, శ్రీకాకుళం

### మొబైల్ వాడకాన్ని తగ్గించాలి

మానవ జీవితంలో నీరు,ఆరోగ్యం, ఆహారం,నిద్ర చాలా విలువైనవి.మానవుడు ఆర్యోగంగాఉండాలంటే పౌష్టికాహారమే కాదు సరైన నిద్ర కూడా అవసరం. ప్రధానంగా సాధారణ మనిషికి 8 నుండి 10 గంటల నిద్ర చాలు అయినప్పటికీ కొందరు వ్యక్తులు అతి నిద్ర పోతుంటారు. ఇలాంటి వ్యక్తుల ఆరోగ్యం సమతుల్యత లేకపోవడంతో భవిష్యత్తులో దెబ్బతినే అవకాశాలు మెండుగాఉంటాయి. నిద్ర సమయాన్ని పాటిస్తేనే ఆరోగ్యం బాగుంటుంది.

- ఎమ్. శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### టీచర్లకు పరీక్షలు

ఇన్ సర్వీస్ టీచర్లకు, ప్రత్యేకించి ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న టీచర్లకు( టెట్), టీచర్ ఎజిబిలిటీ టెస్ట్ తప్పనిసరిగా ఉత్తీర్ణులు కావాలని నేషనల్ ఎడ్యుకేషనల్ పాలసీ 2020 ప్రాప్తి మేరకు టీచర్లు అప్డేట్‌గా ఉండాలని ఆ టెస్ట్ 2028 లోగా ఉత్తీర్ణులు అవ్వాలని ఎవరైతే ఇంతకుముందు ఆ టెస్ట్ రాయకుండా ఉద్యోగంలో చేరారో వారు కచ్చితంగా ఉత్తీర్ణులు కావాల్సిందేనని సుప్రీంకోర్టు తీర్పుఇవ్వడం ఆ తీర్పును అమలు జరపడానికి కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలకు ముందుకు రావడం విడ్డూరం. ప్రభుత్వ ఉద్యోగాలలో ప్రతి డిపార్ట్మెంట్కు ప్రమోషన్లు ఉంటాయి. కానీ ప్రభుత్వ పాఠశాలలోని టీచర్ల ప్రమోషన్లు చాలావిడ్డూరంగా ఉంటున్నాయి.కొత్తగా ఆనాడు వచ్చిన మార్కుల ఆధారంగా ఎక్కువ మార్కులు వచ్చిన వారి పేరు ముందు పెట్టి రిజర్వేషన్లలో కూడా అలాగే పాటించి తమకు నచ్చిన వారిపేర్లు ముందుపెట్టి రోస్టర్ పాయింట్స్ గందరగోళంచేసి మార్చడం ఎంతవరకు సమంజసం.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### పెరుగుతున్న మోసాలు

ఆధార్‌ను ఆసరా చేసుకొని ప్రభుత్వాలు ప్రజలతో ఆడుకుంటున్నారు. డేట్‌ఆఫ్ బర్త్ చేంజ్ ఒకసారి, నేమ్ చేంజ్ లేదా స్పెల్లింగ్ కరెక్షన్స్ రెండుసార్లు పరిమితి పెట్టారు. మానవ తప్పిదాలు సహజంగా జరుగుతాయి. స్పెల్లింగ్ మిస్టేక్స్ రావడం ప్రింట్ పొరపాట్లు జరగడానికి అవకాశాలుంటాయి. దేశం బోర్డర్లో ఉన్న ప్రజలకు కఠినమైన నిబంధనలు ఉండడం అర్థం ఉంటుందేమో కానీ అందరికీ ఇలా ఇబ్బంది పెట్టడం తగదు. అన్నింటికీ ఆధార్ ఉపయోగిస్తున్నారు. అన్నింటితో ఆధార్‌ని లింక్ చేస్తున్నారు. ప్రజలందరూ డేటా సెంటర్ల చుట్టూ తిరగడానికే సరిపోతూఉన్నది. నిజానికి ఓటు వేయడానికి చేతి వేలి ముద్రలు, కన్నులు ఐరిష్ మ్యాచ్ అయితే దొంగ ఓట్లు వేయడానికి అసలు అవకాశం ఉండదు.

- వి. నీరజ, హైదరాబాద్

### మౌలిక సదుపాయాలు కల్పించాలి

ప్రస్తుతం రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాల భవనాలు దాదాపుగా ఆధునీకరించబడినవి. ఏ ప్రభుత్వ కార్యాలయం అయినా మార్పులు చేసేటప్పుడు ప్రధానంగా పారిశుధ్యపు వసతి, నీటి సరఫరా, విద్యుత్ కలిపే చేస్తారు. మరి మహిళలకు ఒకటి వేరేగా వాష్‌రూమ్ ఉంటేనే సిబ్బంది, విద్యార్థినీలకు ఇబ్బంది ఉండదు. విద్యాశాఖ ఈ వసతి కూడా లేని పాఠశాలల్లో వాష్‌రమ్‌ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి.

-బి. మేఘానాదం, విశాఖపట్నం

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# చదువే పేదరిక నిర్మూలనకు మార్గం

**ఒక కుటుంబంలో ఒకరు ఉన్నత విద్యను పూర్తి చేసి స్థిరమైన ఉద్యోగం సాధిస్తే ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితి పూర్తిగా మారుతుంది. కుటుంబ ఆదాయం పెరుగుతుంది. అప్పుల భారం తగ్గుతుంది. తల్లిదండ్రులకు భరోసా లభిస్తుంది. తదుపరి తరానికి మెరుగైన విద్య, ఆరోగ్యం, జీవన ప్రమాణాలు అందుబాటులోకి వస్తాయి. ఈ విధంగా విద్య ఒక వ్యక్తి జీవితాన్నే కాకుండా మొత్తం కుటుంబాన్ని, సమాజాన్ని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే శక్తిగా మారుతుంది. అందుకే ప్రపంచవ్యాప్తంగా విద్యను పేదరిక నిర్మూలనకు అత్యంత శక్తివంతమైన సాధనంగా గుర్తిస్తున్నారు. ప్రభుత్వం విద్యపై చేసే ప్రతి రూపాయి ఖర్చు వ్యయం కాదు, అది మానవ వనరుల అభివృద్ధిపై, రాష్ట్ర భవిష్యత్తుపై చేసే అత్యంత విలువైన పెట్టుబడి.**



మన్నారం నాగరాజు

విద్య అనేది వ్యక్తిగత అభివృద్ధికి మాత్రమే కాదు, సమాజప్రగతికి, రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి, దేశ భవిష్యత్తుకు కూడా మూలాధారం. భారత రాజ్యాంగం ప్రతి పౌరునికి సమాన విద్యావకాశాలను కల్పించాలనే లక్ష్యంతో సామాజిక న్యాయ స్ఫూర్తిని ప్రతిష్ఠించింది. ముఖ్యంగా ఆర్థికంగావెనుకబడిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులకు ఉన్నత విద్య అందుబాటులోకి రావాలంటే ప్రభుత్వం ప్రత్యేక బాధ్యత తీసుకోవాల్సిందే. ఈ నేపథ్యంలో స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలు కేవలం సంక్షేమ కార్యక్రమాలు మాత్రమే కాదు, అవి సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, రాజ్యాంగ విలువలను ఆచరణలో నిలబెట్టిన చారిత్రాత్మక సంస్కరణలు. ఈపథకాల ద్వారా లక్షలాది మంది పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఇంజినీరింగ్, మెడిసిన్, ఫార్మసీ, న్యాయశాస్త్రం, డిగ్రీ, పీజీ, నర్సింగ్,మేనేజ్‌మెంట్, ఇతర వృత్తి విద్యా కోర్సులను అభ్యసించి దేశ, విదేశాల్లో ఉన్నత ఉద్యోగాలు సాధించారు. చదువుతో ఒక్క విద్యార్థి మాత్రమే కాదు, అతని కుటుంబం, తదుపరి తరం కూడా పేదరికం నుంచి బయటపడగలదని ఈ పథకం స్పష్టంగా నిరూపించింది.ఒక కుటుంబంలో ఒకరు ఉన్నత విద్యను పూర్తి చేసి స్థిరమైన ఉద్యోగం సాధిస్తే ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితి పూర్తిగా మారుతుంది. కుటుంబ ఆదాయం పెరుగుతుంది. అప్పుల భారం తగ్గుతుంది. తల్లిదండ్రులకు భరోసా లభిస్తుంది. తదుపరి తరానికి మెరుగైన విద్య, ఆరోగ్యం, జీవన ప్రమాణాలు అందుబాటులోకి వస్తాయి. ఈ విధంగా విద్య ఒక వ్యక్తి జీవితాన్నే కాకుండా మొత్తం కుటుంబాన్ని, సమాజాన్ని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే శక్తిగా మారుతుంది. అందుకే ప్రపంచవ్యాప్తంగా విద్యను పేదరిక నిర్మూలనకు అత్యంత శక్తివంతమైన సాధనంగా గుర్తిస్తున్నారు. ప్రభుత్వం విద్యపై చేసే ప్రతి రూపాయి ఖర్చు వ్యయం కాదు, అది మానవ వనరుల అభివృద్ధిపై, రాష్ట్ర భవిష్యత్తుపై చేసే అత్యంత విలువైన పెట్టుబడి.2008లో ప్రారంభమైన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం భారత సంక్షేమ చరిత్రలో అత్యంత ప్రభావవంతమైన విద్యా సంస్కరణలలో ఒకటిగా నిలిచింది. పేదరికం కారణంగా ఉన్నత విద్యకు దూరమవుతున్న లక్షలాది మంది విద్యార్థులకు ఈ పథకం ఆశాకిరణంగా మారింది. గ్రామీణ ప్రాంతాలు, వ్యవసాయ కూలీలు, చిన్న రైతులు, కార్మికులు, చిరు వ్యాపారుల కుటుంబాలకు చెందిన యువత వైద్యులు, ఇంజినీర్లు, ఉపాధ్యాయులు, న్యాయవాదులు, శాస్త్రవేత్తలు, ప్రభుత్వ ఉద్యోగులు,బ్యాంకు అధికారులు, ఐటీ నిపుణులు, పారిశ్రామికవేత్తలుగాఎదిగారు. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి ఐటీ కేంద్రంగా తీర్చిదిద్దడంలోనూ, పరిశ్రమలు, ఫార్మా, బయోటెక్నాలజీ, సేవారంగం, స్టార్టప్‌ల అభివృద్ధికి అవసరమైన నైపుణ్య మానవ వనరులను అందించడంలోనూ ఈ పథకం కీలక పాత్రపోషించింది. ఈ అభివృద్ధి వల్ల రియల్ ఎస్టేట్, రవాణా, ఆరోగ్యం, విద్య, సేవారంగం వంటి అనుబంధ రంగాలు కూడా విస్తరించాయి. రాష్ట్ర ఆదాయం, ఉపాధి అవకాశాలు, తలసరి ఆదాయం పెరగడంలో కూడా ఈ పథకం పరోక్షంగా విశేష పాత్ర పోషించిందని చెప్పడం అతిశయోక్తి కాదు. ఈపథకం ప్రభుత్వాల దయాదాక్షిణ్యంతో అమల్లోకి వచ్చినది కాదు. పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందించాలనే లక్ష్యంతో జరిగిన ఉద్యమాల ఫలితమే ఇది. 'చదువే పేదరిక నిర్మూలనకు మార్గం' అనే సామాజిక తత్వానికి ఈ పథకం



ప్రతీకగా నిలిచింది. అందువల్ల దీనిని సాధారణ సంక్షేమ పథకంగా కాకుండా సామాజిక హక్కుగా చూడాల్సిన అవసరం ఉంది.అయితే ఇటీవలి కాలంలో స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదలలో చోటుచేసుకున్న జాప్యం విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యాసంస్థలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. గత మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న బకాయిలు వేల కోట్ల రూపాయలకు చేరినట్లు వెల్లడవుతోంది. ప్రభుత్వ నిధులు సమయానికి విడుదల కాకపోవడంతో అనేక మంది విద్యార్థులు ఫీజులు చెల్లించలేక చదువులు మధ్యలో నిలిపివేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కళాశాలలు ప్రభుత్వ చెల్లింపులకోసం ఎదురుచూస్తూ బ్యాంకుల నుంచి అప్పులు తీసుకుని నిర్వహణ కొనసాగించాల్సి వస్తోంది. అధ్యాపకులు, బోధనేతర సిబ్బందికి జీతాలు చెల్లించడం కష్టమవుతోంది. ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, ఇతర మౌలిక సదుపాయాల నిర్వహణ కూడా ప్రభావితమవుతోంది. దీని ప్రభావం నేరుగా విద్యా నాణ్యతపై పడుతోంది. ఇంకా ఆందోళనకరమైన విషయం ఏమిటంటే, ప్రభుత్వ బకాయిలు విడుదల కాకపోవడంతో అనేక మంది విద్యార్థులు తమ విద్యా సర్టిఫికెట్లు పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్నతవిద్య, విదేశీ విద్య, ఉద్యోగాలు, పోటీ పరీక్షలకు దరఖాస్తు చేసుకునే అవకాశాలను కోల్పోతున్నారు. ఒక విద్యార్థి భవిష్యత్తు అనిశ్చితిలో పడితే, దాని ప్రభావం అతని కుటుంబంపైనే కాదు, సమాజంపైనా పడుతుంది. చదువు ఆగిపోవడం వల్ల నిరుద్యోగం పెరుగుతుంది. నైపుణ్యం కలిగిన మానవ వనరుల కొరత ఏర్పడుతుంది. సామాజిక అసమానతలు మరింత పెరిగే ప్రమాదం ఉంటుంది.ఈ నేపథ్యంలో ప్రభుత్వం 'బడ్జెట్ లేదు' అనే కారణాన్ని చూపడం సమంజసంగా కనిపించదు. ప్రతి సంవత్సరం సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలకు బడ్జెట్ కేటాయించడం ప్రభుత్వ రాజ్యాంగబద్ధమైన, పరిపాలనా బాధ్యత. రాష్ట్ర ఖజానాకు పన్నుల రూపంలో, కేంద్ర నిధుల రూపంలో, భూముల విక్రయాల ద్వారా, ఇతర ఆర్థిక వనరుల ద్వారా భారీ ఆదాయం సమకూరుతున్నప్పుడు, లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన నిధులను మాత్రమే విడుదల చేయలేకపోవడం ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఈ పరిస్థితి ఒక్కసారిగా ఏర్పడలేదు. ప్రతి సంవత్సరం అవసరమైన నిధులనుక్రమం తప్పకుండా విడుదల చేయకపోవడం వల్లే బకాయిలు పేరుకుపోయాయి. వార్షిక బడ్జెట్‌లో ముందుగానే తగిన నిధులు కేటాయించి, త్రైమాసికం లేదా ఆరు నెలలకొకసారి విడతల వారీగా విడుదల చేసి ఉంటే నేడు ఈ పరిస్థితి వచ్చేది కాదు. ప్రణాళికాబద్ధమైన ఆర్థిక నిర్వహణ ఉంటే కళాశాలలు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఇంతటి ఇబ్బందులు ఎదుర్కొనాల్సిన అవసరం ఉండేది కాదు. అందువల్ల భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా శాశ్వత ఆర్థిక విధానాన్ని ప్రభుత్వం రూపొందించాల్సిన అవసరం ఉంది. ఇటీవల తీసుకొచ్చిన జీవో నెం.9 కూడా విద్యార్థుల్లో ఆందోళన కలిగిస్తోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని విద్యార్థుల ఖాతాల్లో జమ చేసి,నిర్దిష్ట గడువులోపు కళాశాలలకు చెల్లించకపోతే రెవెన్యూ రికవరీ చట్టం కింద చర్యలు తీసుకుంటామని పేర్కొనడం సంక్షేమ పథకాల అసలులక్ష్యానికి విరుద్ధంగా కనిపిస్తోంది. పేద విద్యార్థులుఉద్దేశపూర్వకంగా ఫీజులు చెల్లించకుండా ఉండరు.వారికి ఆర్థిక, సాంకేతిక, పరిపాలనా సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది.అలాంటి పరిస్థితుల్లో వారిపై శిక్షాత్మక నిబంధనలు విధించడంకంటే, వారికి అనుకూలమైన పరిపాలనా విధానాన్ని రూపొందించడం ప్రభుత్వ బాధ్యత. గతంలో అమలులో ఉన్న విధంగా ప్రభుత్వం నేరుగా కళాశాలల ఖాతాలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేస్తే పారదర్శకత, సౌలభ్యం రెండూ పెరుగుతాయి. అందువల్ల జీవో నెం.9లోని వివాదాస్పద నిబంధనలను ప్రభుత్వం పునఃసమీక్షించడం సముచితంగా ఉంటుంది. పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న విధానాన్ని కూడా పరిశీలించాల్సిన అవసరంఉంది. అక్కడ అర్హులైన విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలులో దశలవారీ చెల్లింపుల విధానం కొనసాగుతోందని ప్రభుత్వం పేర్కొంటోంది. విద్యార్థుల చదువులకు ఆటంకం కలగకుండా, కళాశాలలకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా నిధులు విడుదల చేసే వ్యవస్థపై దృష్టి సారిస్తోంది. మంచి పరిపాలన అంటే ఇతర ప్రాంతాల్లో అమలవుతున్న సమర్థవంతమైన విధానాలను అధ్యయనం చేసి ప్రజల ప్రయోజనాల కోసం స్వీకరించడం. విద్యలో పెట్టుబడి పెట్టడం అంటే కేవలం వ్యక్తిగత అభివృద్ధికే కాదు, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికీ దోహదపడటం. ●

# భారత్ భవిష్యత్తుకు అరుదైన ఖనిజాలే ఆధారం


సి.హెచ్.ప్రతాప్

ఇరవై ఒకటో శతాబ్దంలో చమురు ఎంత వ్యూహాత్మకమైనదో, రానున్న దశాబ్దాల్లో అరుదైన ఖనిజాలు చమురుతో సమానమైన వ్యూహాత్మక ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నాయి. లిథియం, కోబాల్ట్, నికెల్, గ్రాఫైట్, రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ వంటి ఖనిజాలు విద్యుత్ వాహనాలు, సెమీకండక్టర్లు, మొబైల్ ఫోన్లు, సౌర విద్యుత్ ప్యానెల్లు, విండ్ టర్బైన్లు, రక్షణ రంగం, అంతరిక్ష సాంకేతికత, కృత్రిమ మేధ, అధునాతన సమాచార వ్యవస్థలకు జీవనాడిగా మారాయి. భవిష్యత్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో సాంకేతిక ఆధిపత్యాన్ని నిర్ణయించే శక్తిగా ఈ ఖనిజాలు ఎదుగుతున్నాయి. అందువల్ల అరుదైన ఖనిజాల భద్రత భారతదేశ ఆర్థికాభివృద్ధికి మాత్రమే కాకుండా, జాతీయ భద్రతకు, ఇంధన స్వావలంబనకు, పారిశ్రామికపురోగతికి, సాంకేతిక స్వాతంత్ర్యానికి కూడా అత్యంత కీలకంగా మారింది. భారత ప్రభుత్వం ఇప్పటికే 30 ఖనిజాలను 'క్రిటికల్ మినరల్స్'గా గుర్తించింది. వీటిలో 24 ఖనిజాలను గనులు ఖనిజాల (అభివృద్ధి, నియంత్రణ) చట్టం తొలి షెడ్యూల్‌లోని పార్ట్ డిలో చేర్చి, వాటి అన్వేషణ, వేలం, తవ్వకాల ప్రక్రియలను వేగవంతం చేయడానికి కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేక అధికారాలు కల్పించింది. 2025లో ప్రారంభమైన జాతీయ క్రిటికల్ మినరల్ మిషన్ కింద 2030-31 నాటికి 1,200 అన్వేషణ ప్రాజెక్టులు చేపట్టాలని లక్ష్యంగా నిర్ణయించారు.ఈమిషన్ కోసం కేంద్ర ప్రభుత్వం రూ.16,300 కోట్ల ప్రత్యక్ష వ్యయాన్ని కేటాయించగా, ప్రభుత్వ రంగ సంస్థలు,ఇతర భాగస్వాముల ద్వారా మరో రూ.18,000 కోట్ల పెట్టుబడులను సమీకరించే లక్ష్యాన్ని నిర్దేశించింది. మొత్తంగా ఈ మిషన్ పరిమాణం రూ.34,300 కోట్లు. ఇది కేవలం గనుల అభివృద్ధి కార్యక్రమం మాత్రమే కాదు, దేశ పారిశ్రామిక, ఇంధన, సాంకేతిక భద్రతను బలోపేతం చేసే జాతీయ వ్యూహం కూడా. అయితే భారతదేశం ఎదుర్కొంటున్న ప్రధాన సవాలు దిగుమతులపై అధికంగా ఆధారపడటమే. లిథియం, కోబాల్ట్, నికెల్ వంటి పలు కీలక ఖనిజాల అవసరాలను ప్రస్తుతం భారత్ ప్రధానంగా దిగుమతుల ద్వారానే తీర్చుకుంటోంది. ప్రపంచ సరఫరా గొలుసులో కొద్ది దేశాలపై అధికంగా ఆధారపడటం వ్యూహాత్మక ప్రమాదాలకు దారితీస్తుంది. అంతర్జాతీయ ఉద్రిక్తతలు, ఎగుమతి ఆంక్షలు లేదా యుద్ధపరిస్థితులు ఏర్పడితే విద్యుత్ వాహనాలు, బ్యాటరీలు,ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, రక్షణ పరికరాల తయారీరంగాలు తీవ్రప్రభావాన్ని ఎదుర్కొనే అవకాశం ఉంది. సరఫరాలో స్వల్ప అంతరాయం కూడా పారిశ్రామిక ఉత్పత్తి, ఇంధన మార్పిడి కార్యక్రమాలపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది. భారత్ 2070 నాటికి నెట్‌జీరో కార్బన్ ఉద్గారాల లక్ష్యాన్ని ప్రకటించింది. అలాగే పరిశుభ్రమైన ఇంధన వినియోగాన్ని, విద్యుత్ వాహనాల తయారీని, పునరుత్పాదక శక్తి సామర్థ్యాన్ని వేగంగా విస్తరిస్తోంది. ఈ లక్ష్యాలు విజయవంతం కావాలంటే లిథియం అయాన్ బ్యాటరీలు, శక్తినిల్వ వ్యవస్థలు, సౌర పరికరాల తయారీకి అవసరమైన అరుదైన ఖనిజాల నిరంతర లభ్యత అత్యంత అవసరం.దేశీయ అన్వేషణను వేగవంతం చేయడంతోపాటు విదేశాల్లో గనుల అభివృద్ధిలో పెట్టుబడులు పెట్టడం, సర ఫరా దేశాలతో దీర్ఘకాలిక ఒప్పందాలు కుదుర్చుకోవడం, ఖనిజాల రీసైక్లింగ్‌ను ప్రోత్సహించడం, ప్రత్యామ్నాయ సాంకేతికతలపై పరిశోధనలను విస్తరించడం కాలానుగుణ అవసరం. 'వికసిత భారత్-2047' లక్ష్యాన్ని సాకారం చేయాలంటే ఖనిజ భద్రతను జాతీయ భద్రతలో అంత ర్భాగంగా పరిగణించాల్సిందే. రేపటి ప్రపంచంలో ఆర్థిక శక్తిగా, సాంకేతిక నాయకుడిగా,ఇంధన స్వావలంబన సాధించిన దేశంగా భారత్ ఎదగాలంటే అరుదైన ఖనిజాల భద్రత విలాసం కాదు అది అనివార్యమైన జాతీయ అవసరం. ●

# ఒకే దేశం-ఒకే పన్ను ఎంతవరకు నిజమైంది?


తిప్పర్తి శ్రీనివాస్

భారత ఆర్థిక సంస్కరణల చరిత్రలో కొన్ని నిర్ణయాలు కాలగర్భంలో కలిసిపోకుండా, వ్యవస్థను శాశ్వతంగా మార్చివేస్తాయి. 2017 జులై 1న అమల్లోకి వచ్చిన వస్తు-సేవల పన్ను అలాంటి సంస్కరణలలో అగ్రగణ్యమైనది. స్వాతంత్ర్యానంతర కాలంలో పరోక్ష పన్నుల వ్యవస్థలో చేపట్టిన అతిపెద్ద మార్పుగా జీఎస్‌టీని పేర్కొనడం అతిశయోక్తి కాదు. 'ఒకే దేశం-ఒకే పన్ను-ఒకే మార్కెట్' అనే ఆకర్షణీయ నినాదంతో ప్రారంభమైన ఈ సంస్కరణ దశాబ్దపు ముంగిట నిలిచిన నేడు, దాని విజయాలను సంబరంగా గుర్తుచేసుకోవడంతోపాటు, ఇంకా మిగిలి ఉన్నలోపాలను నిర్మోహమాటంగా సమీక్షించాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే ఏ సంస్కరణ విలువ దాని ఆరంభంలో కాదు, కాల పరీక్షలో నిలిచే సామర్థ్యంలో ఉంటుంది. జీఎస్‌టీ ప్రవేశానికి ముందు భారతదేశ పన్నువ్యవస్థ అనేక పరోక్ష పన్నుల అల్లికగా ఉండేది. కేంద్రం విధించే ఎక్సైజ్ సుంకం, సేవల పన్ను, రాష్ట్రాల వ్యాట్, ప్రవేశ పన్ను, ఆక్ట్రాయ్, వినోద పన్ను, లగ్జరీ ట్యాక్స్ ఇలా ఒకే వస్తువు ఉత్పత్తి నుంచి వినియోగదారుడి చేతికి చేరే వరకు అనేక దశల్లో పన్ను విధించబడేది. దాంతో పన్నుపై పన్ను పడే పరిస్థితి ఏర్పడి ఉత్పత్తి వ్యయం పెరిగేది. రాష్ట్ర సరిహద్దులు దాటే సరుకులు చెక్‌పోస్టుల వద్ద గంటల తరబడి నిలిచిపోయేవి. దేశీయ మార్కెట్ ఒకటే అయినప్పటికీ, పన్నుల పరంగా అది అనేక చిన్న చిన్న మార్కెట్లుగా విడిపోయి ఉండేది. ఆ విభజనను తొలగించి, ఆర్థిక ఏకీకరణకు పునాది వేయడమే జీఎస్‌టీ లక్ష్యం. ఆ లక్ష్య సాధనలో జీఎస్‌టీ గణనీయమైన పురోగతి సాధించిందని చెప్పాలి. దేశవ్యాప్తంగా వస్తువులు, సేవల రవాణా సులభతరమైంది. రాష్ట్రాలమధ్య పన్ను అవరోధాలు తగ్గడంతో లాజిస్టిక్స్ వ్యయం తగ్గింది.ఈకామర్స్, తయారీ, రవాణా రంగాలకు ఇది కొత్త ఊపునిచ్చింది. ముఖ్యంగా జాతీయ సరఫరా గొలుసు (సప్లై చైన్) మరింత సమర్థవంతంగా మారింది.గతంలో గిడ్డంగులు పన్నుప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఏర్పాటు చేసేవారు. ఇప్పుడు వ్యాపార అవసరాల ఆధారంగా వాటిని రూపొందించే పరిస్థితి ఏర్పడింది. ఇది జీఎస్‌టీ తీసుకొచ్చిన నిర్మాణాత్మక మార్పు. డిజిటల్ పరిపాలనకు జీఎస్‌టీ కొత్త దిశ చూపింది. జీఎస్‌టీఎన్, ఈవే బిల్లు, ఈఇన్వాయిస్ వంటి వ్యవస్థల ద్వారా పన్ను నిర్వహణలో సాంకేతికతను విస్తృతంగా వినియోగించారు. నమోదు నుంచి రిటర్నుల దాఖలు వరకు దాదాపు అన్ని ప్రక్రియలు ఆన్‌లైన్‌లోకి మారాయి. డేటా విశ్లేషణ ఆధారంగా పన్ను ఎగవేతను గుర్తించే సామర్థ్యం పెరిగింది. ప్రభుత్వ యంత్రాంగంలో పారదర్శకత పెరగడంతో పాటు మానవ జోక్యం తగ్గింది. పరిపాలనా సంస్కరణల దృష్ట్యా ఇది ఒక కీలక ముందడుగు. పన్ను చెల్లింపుదారుల సంఖ్య పెరగడం జీఎస్‌టీ విజయాన్ని మరింత బలపరుస్తోంది. గతంలో పన్ను వ్యవస్థకు దూరంగా ఉన్న అనేక వ్యాపార సంస్థలు అధికారిక ఆర్థిక వ్యవస్థలోకి వచ్చాయి. పన్ను ఆధారం విస్తరించడం వల్ల ప్రభుత్వ ఆదాయం కూడా గణనీయంగా పెరిగింది. ఇటీవలి కాలంలో నెలవారీ



జీఎస్‌టీ వసూళ్లు తరచూ రూ.2 లక్షల కోట్లకు పైగా నమోదవుతున్నాయి. ఇది దేశ ఆర్థిక వ్యవస్థలో చైతన్యం పెరిగిందనే సంకేతం మాత్రమే కాదు, పన్ను అనుసరణ కూడా మెరుగుపడిందని సూచిస్తోంది. అయితే, జీఎస్‌టీని సంపూర్ణ విజయ గాథగా ప్రకటించడానికి ఇంకా సమయం ఉంది. దాని నిర్మాణంలోనే కొన్ని బలహీనతలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. ముఖ్యంగా బహుళ పన్ను శ్లాబ్‌లు జీఎస్‌టీ మూలస్ఫూర్తికే విరుద్ధంగా మారాయి. 0, 5, 12, 18, 28 శాతం పన్ను రేట్లతో పాటు సెస్‌లు కూడా అమలులో ఉండటంతో పన్ను వ్యవస్థక్లిష్టత తగ్గలేదు. ఒకేతరహా వస్తువుల వర్గీకరణపై తరచూ వివాదాలు తలెత్తుతున్నాయి. ఒకే దేశం-ఒకే పన్ను అన్న నినాదం ఉన్నప్పటికీ, ఒకే వస్తువుకు వేర్వేరు రేట్లు ఉండడం వినియోగదారులలోనూ, వ్యాపారులలోనూ గందరగోళాన్ని సృష్టిస్తోంది. రేట్ల హేతుబద్ధీకరణ ఇక వాయిదా వేయలేని సంస్కరణ. జీఎస్‌టీ అమలులో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఎదుర్కొన్న ఇబ్బందులను కూడా విస్మరించలేం. తరచూ మారిన నిబంధనలు, సాంకేతిక లోపాలు, సంక్లిష్టమైన రిటర్న్ విధానం, ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌లో జాప్యాలుచిన్న వ్యాపారులపై అదనపు భారం మోపాయి. డిజిటలీకరణ పెద్ద సంస్థలకు అనుకూలంగా ఉన్నప్పటికీ,గ్రామీణ ప్రాంతాల్లోని చిన్న వ్యాపారులు దానికి అనుగుణంగా మారడానికి సమయం పట్టింది. కంప్లయన్స్ ఖర్చు పెరగడం వల్ల కొన్ని చిన్న వ్యాపారాలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. సంస్కరణల లక్ష్యం పన్ను వసూళ్లు పెంచడం మాత్రమే కాకుండా, వ్యాపార సౌలభ్యాన్ని పెంపొందించడం కూడా కావాలి.మరో ప్రధాన చర్చనీయాంశం సహకార సమాఖ్య. జీఎస్‌టీ విజయానికి కేంద్ర-రాష్ట్రాల సమన్వయం అత్యంత కీలకం. ప్రారంభ ఐదేళ్లపాటు రాష్ట్రాలకు ఆదాయ నష్టపరిహారం అందించిన కేంద్రం, ఆ గడువు ముగిసిన తర్వాత రాష్ట్రాల ఆందోళనలను సమర్థవంతంగా పరిష్కరించాల్సిన బాధ్యత కలిగి ఉంది. జీఎస్‌టీ కౌన్సిల్ రాజకీయ భేదాలకు అతీతంగా విధాన నిర్ణయాలు తీసుకునే వేదికగా నిలవాలి. సంస్కరణ అంటే ఏకపక్ష నిర్ణయం కాదు, అన్ని భాగస్వాముల ప్రయోజనాలను సమన్వయం చేయడమే.ముందున్న దశాబ్దంలో జీఎస్‌టీ విజయాన్ని నిర్ణయించేది వసూళ్ల గణాంకాలు మాత్రమే కావు. పన్ను చెల్లింపుదారుడికి అది ఎంత సరళంగా మారింది? చిన్న వ్యాపారికి ఎంత స్నేహపూర్వకంగా ఉంది? వినియోగదారుడికి ధరల పరంగాఎంత ప్రయోజనం కలిగించింది? రాష్ట్రాల ఆర్థిక స్థిరత్వానికి ఎంత తోడ్పడింది? అనే ప్రశ్నలే అసలు ప్రమాణాలు. అందుకే రేట్ల హేతుబద్ధీకరణ, కంప్లయన్స్ సరళీకరణ, సాంకేతిక మౌలిక సదుపాయాల బలోపేతం, వివాద పరిష్కారవ్యవస్థ వేగవంతం, విధాన స్థిరత్వం వంటి అంశాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలి. సంస్కరణల గమ్యం గణాంకాల్లో కాదు, ప్రజల అనుభవంలో ప్రతిబింబించాలి. వ్యాపారానికి సౌలభ్యం, వినియోగదారుడికి న్యాయం, రాష్ట్రాలకు సముచిత ఆదాయం, ప్రభుత్వానికి పారదర్శకత ఈ నాలుగు లక్ష్యాలు సమన్వయమైతేనే జీఎస్‌టీ తన అసలు ఉద్దేశాన్ని సార్థకం చేసుకున్నట్లు అవుతుంది. దశాబ్ది ముంగిట నిలిచిన జీఎస్‌టీకి ఇప్పుడు అవసరమైంది విస్తరణ కాదు పరిపక్వత. కొత్త పన్నులు కాదు సరళమైన విధానం,అధిక వసూళ్లు మాత్రమే కాదు విశ్వాసాన్ని పెంపొందించే పాలన. ●

# హర్మూజ్ జలసంధి మళ్లీ మూసివేత



## గల్ఫ్ దేశాలలోని అమెరికా బేస్‌లపై ఇరాన్ దాడులు

### పశ్చిమాసియాలో మళ్లీ వార్ ఉధృతం

**టెహ్రాన్,జులై 12:** పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు మరింత దట్టంగా కమ్ముకున్నాయి. అమెరికా, ఇరాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు అత్యంత ప్రమాదకర స్థాయికి చేరాయి. హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకపై ఇరాన్ దాడికి ప్రతీకారంగా, తెల్లవారు జామున అమెరికా సైన్యం ఇరాన్‌పై మరోసారి భీకర దాడులు జరిపింది. వారం వ్యవధిలో ఇరాన్‌పై అమెరికా దాడులకు దిగడం ఇది మూడోసారి కావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. అమెరికా సెంట్రల్ కమాండ్ వెల్లడించిన వివరాల ప్రకారం, తెల్లవారుజామున 5:45 గంటలకు ఇరాన్‌లోని పలు లక్ష్యాలపై అమెరికా బలగాలు దాడులు చేశాయి. అంతకు ముందు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ (ఐఆర్‌జీసీ), హార్మూజ్ జలసంధిలో ప్రయాణిస్తున్న ఎమ్/వి జీఎఫ్ఎస్ గెలాక్సీ అనే వాణిజ్య నౌకపై దాడి చేసింది. ఈ ఘటనలో నౌక ఇంజిన్ రూమ్ తీవ్రంగా దెబ్బతిని మంటలు చెలరేగాయి. ఒక సిబ్బంది కూడా అదృశ్యమయ్యాడు. వాణిజ్య నౌకలపై దాడులు చేసే ఇరాన్ సామర్థ్యాన్ని దెబ్బతీసేందుకే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశాల మేరకు ఈ దాడులు జరిపినట్లు సెంట్‌కామ్ స్పష్టం చేసింది. ఈ దాడులపై అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్‌సెత్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ ఇరాన్ తప్పుడు నిర్ణయం తీసుకుంది. ఇప్పుడు దానికి తగిన మూల్యం చెల్లించుకుంటోందని తీవ్రంగా హెచ్చరించారు. అమెరికా దాడులకు కొన్ని గంటల ముందే ఇరాన్ సంచలన నిర్ణయం తీసుకుంది. ప్రపంచంలోనే అత్యంత కీలకమైన వాణిజ్య రవాణా మార్గమైన హార్మూజ్ జలసంధిని మూసివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ ప్రాంతంలో అమెరికా జోక్యం ఆగిపోయే వరకు ఏ అంతర్జాతీయ నౌకను అనుమతించేది లేదని ఐఆర్‌జిసి నేవీ స్పష్టం చేసింది. దశాబ్దాలుగా ఇది అంతర్జాతీయ జలమార్గంగా ఉన్నప్పటికీ, తమ సార్వభౌమ ప్రాంతంగా పరిగణిస్తూ నౌకల నుంచి పన్నులు వసూలు చేస్తామని ఇరాన్ వాదిస్తోంది. అమెరికా దాడుల తర్వాత ఇరాన్‌లోని ఖేష్మ్ ద్వీపం, బందర్ అబ్బాస్, సిరిక్‌లలో భారీ పేలుడు శబ్దాలు వినిపించినట్లు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ పరిణామాలపై ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ స్పందిస్తూ, అమెరికానే తమ మధ్య కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని ఆరోపించారు. అంతర్జాతీయ మార్కెట్లో ఇరాన్‌చమురు అమ్ముకోవడానికి ఇచ్చిన మినహాయింపులను అమెరికా ఏకపక్షంగా రద్దు చేయడమే దీనికి కారణమన్నారు. హార్మూజ్ జలసంధిలో ఇరాన్ దాడులకు పాల్పడటం వల్లే చమురు మినహాయింపులు రద్దు చేశామని అమెరికా వాదిస్తోంది.

ఈ పరస్పర దాడులు, ఆరోపణలతో పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం మరింతగా ముదిరింది. మరోపక్క ఇరాన్‌కూడా గల్ఫ్‌దేశాల్లోని అమెరికా స్థావరాలపై డ్రోన్లు, క్షిపణులతో దాడులు చేస్తోంది. ఈ దాడులతో ఇపుడు గల్ఫ్‌దేశాల్లోకూడా కలవరం వ్యక్తం అవుతోంది.



## 23న జనం మధ్యకు ఖమేనీ!

### తండ్రి స్మారక కార్యక్రమంలో పాల్గొనే అవకాశం

**టెహ్రాన్,జులై 12:** ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ ఎట్టకేలకు ప్రజల ముందుకు రానున్నారు. తన తండ్రి, దివంగత సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ స్మారకార్థం ఈనెల 23న టెహ్రాన్‌లో నిర్వహించనున్న కార్యక్రమంలో ఆయన పాల్గొంటారని అధికారిక వర్గాలు వెల్లడించాయి. సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొజ్తబా బహిరంగంగా కనిపించనుండటం ఇదే తొలిసారి కావడంతో ఈ పరిణామంపై ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఆసక్తి నెలకొంది. టెహ్రాన్‌లో సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల మధ్య జరిగే ఈ కార్యక్రమానికి దేశంలోని కీలక నేతలు హాజరుకానున్నారు. ఈ యేడాది ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన వైమానిక దాడిలో అయతుల్లా అలీ ఖమేనీ మరణించిన విషయం తెలిసిందే. ఈ సంఘటన తర్వాత ఇరాన్-అమెరికా మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. తండ్రి మరణానంతరం మొజ్తబా ఖమేనీని ఇరాన్ కొత్త సుప్రీంలీడర్‌గా ప్రకటించారు. అప్పటి నుంచి ఆయన అజ్ఞాతంలోనే ఉన్నారు. భద్రతా కారణాల రీత్యా ఆయన బయటకు రావడం లేదని అధికారులు తెలిపారు. ఇజ్రాయెల్ నుంచి హత్యకు గురయ్యే ప్రమాదం ఉందన్న ఆందోళనల నేపథ్యంలో ఆయన తనతండ్రి, భార్య అంత్యక్రియలకు సైతం హాజరుకాలేదు. ఇదే సమయంలో మొజ్తబా ఆరోగ్యంపై కూడా తీవ్రస్థాయిలో ఊహాగానాలు వ్యాపించాయి. ఫిబ్రవరి 28 దాడిలో ఆయన గాయపడ్డారని, చికిత్స తీసుకుంటున్నారని వార్తలు వచ్చాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సైతం ఆయన ఆరోగ్యంపై సందేహాలు వ్యక్తం చేశారు. దాడుల్లో ఆయన ముఖం రూపురేఖలు మారిపోయి ఉండొచ్చని అన్నారు. అయితే, ఈ వాదనలను ఇరాన్ ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. మొజ్తబా సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారని స్పష్టం చేస్తూ, ఇరానియన్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ఇటీవల ఆయన కొత్త ఫోటోను కూడా విడుదల చేసింది.

## దాడులు ఆపకపోతే తీవ్ర పరిణామాలు

### ఇరాన్‌ను హెచ్చరించిన అమెరికా



**వాషింగ్టన్,జులై 12:** హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై జరుగుతున్న దాడులను వెంటనే నిలిపివేయాలని, లేకపోతే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని ఇరాన్‌ను అమెరికా హెచ్చరించింది. హర్మూజ్ జలసంధి అంతర్జాతీయ నౌకాయానానికి పూర్తిగా తెరిచి ఉంటుందని, వాణిజ్య నౌకలపై ఎలాంటి దాడులు జరగవని పేర్కొంటూ 24 గంటల్లోగా ఇరాన్ బహిరంగ ప్రకటన చేయాలని వాషింగ్టన్ స్పష్టం చేసినట్టు సమాచారం. గడువులోగా చెప్పినట్లు చేయకుంటే తీవ్రమైన సైనిక, ఆర్థిక చర్యలు తీసుకుంటామని అమెరికా హెచ్చరించినట్టు తెలుస్తోంది. ఈ హెచ్చరికను మధ్యవర్తుల ద్వారా ఇరాన్‌కు అమెరికా చేరవేసినట్టు సమాచారం. నౌకలపై కాల్పులు ఆపేస్తామని బహిరంగంగా చెప్పాలి. అలాగే తాము తప్పు చేశామని వాళ్ల కనీసం పరోక్షంగానైనా అంగీకరించాలని మేము కోరుకుంటున్నాం. కాల్పులు ఆపేస్తామనేదే రేపు వారి ప్రకటన కావాలని, లేకపోతే వారికి అది మంచి రోజు కాబోదని అమెరికా అధికారి హెచ్చరించినట్టు తెలుస్తోంది. ఈ ఉద్రిక్త పరిస్థితుల మధ్య ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి ఒమాన్‌లో మధ్యవర్తిత్వ చర్చల్లో పాల్గొననున్నారు. ఈ సమావేశం అనంతరం ఇరాన్ అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉందని అమెరికా అధికారులు భావిస్తున్నారు. అయితే గడువులోగా స్పష్టమైన హామీ రాకపోతే పరిస్థితి మళ్లీ ఉద్రిక్తంగా మారే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



## ముగిసిన 3 దేశాల ప్రధాని మోడీ పర్యటన

### ఇండొనేసియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాధినేతలతో ద్వైపాక్షిక చర్చలు, పలు కీలక ఒప్పందాలు

**న్యూఢిల్లీ, జులై 12:** ప్రధాని మోడీ ఇండోనేసియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లలో తన ఆరు రోజుల విజయవంతమైన పర్యటనను ముగించుకుని న్యూఢిల్లీకి తిరిగి వచ్చారు. తన మూడు దేశాల పర్యటనలో భాగంగా తొలి అంచెలో మోడీ ఇండోనేసియాలో పర్యటించారు. ఈ పర్యటన సందర్భంగా, ఇండోనేషియాలో, ప్రధాని మోడీ సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటోతో చర్చలు జరిపారు. ఈ పర్యటన సందర్భంగా, ప్రధాన మంత్రి మోడీకి ఇండోనేసియా అత్యున్నత పౌర పురస్కారం 'బింటాంగ్ ఆదిపూర్ణను ప్రదానం చేశారు. ఉమ్మడి సాంస్కృతిక వారసత్వాన్ని చాటిచెబుతూ, పునరుద్ధరించిన ప్రంబనన్ ఆలయాన్ని సంయుక్తంగా ప్రారంభించారు.

ఆ తర్వాత ప్రధాని మోడీ ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌కు వెళ్లారు, అక్కడ నిర్వహించిన మూడవ వార్షిక భారత్-ఆస్ట్రేలియా వార్షిక శిఖరాగ్ర సమావేశంలో ఆస్ట్రేలియా ప్రధానమంత్రి ఆంథోనీ అల్బనీస్‌ను మోడీ కలిశారు. ఈ పర్యటన సందర్భంగా, ఆస్ట్రేలియన్ సూపర్ సంస్థ భారతదేశ జాతీయ పెట్టుబడి, మౌలిక సదుపాయాల నిధికి ఐదు వందల మిలియన్ల ఆస్ట్రేలియన్ డాలర్ల పెట్టుబడిని ప్రకటించింది. ఈ పర్యటన "బంధాలను మరింత బలపరిచి, భాగస్వామ్యాలను పటిష్టం చేసి, ఉమ్మడి భవిష్యత్తుకు రూపునిచ్చింది" అని, వాణిజ్యం, భద్రత, సాంకేతికత, ప్రాంతీయ సహకారం వంటి రంగాలలో గణనీయమైన ఫలితాలు సాధించిందని విదేశాంగ మంత్రిత్వశాఖ అభివర్ణించింది. అనంతరం ప్రధాని మోడీ ఆక్లాండ్‌ను సందర్శించారు. ఈ పర్యటన సందర్భంగా, భారత, న్యూజిలాండ్ వాణిజ్యం, రక్షణ, సాంకేతికత, విద్య, ఆవిష్కరణలు, పర్యాటకం, ప్రజల మధ్య సంబంధాలపై దృష్టి సారిస్తూ 'రోడ్‌మ్యాప్ టు 2030ని ఆమోదించాయి. రక్షణ, సముద్ర భద్రత, ఉగ్రవాద నిరోధం, విపత్తు నిర్వహణ, వ్యవసాయం, పర్యాటకం, ఆహార సాంకేతికత, స్వచ్ఛఇంధనం రంగాలను కవర్‌చేస్తూ ఇరు దేశాలు 18 ఒప్పందాలను ప్రకటించాయి. ఈ ఏడాది ప్రారంభంలో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం విజయవంతంగా ముగిసిన నేపథ్యంలో, 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రెట్టింపు చేయాలనే లక్ష్యాన్ని ప్రధాని మోడీ

## జమ్ము కాశ్మీర్‌లో బిజెపి ఆపరేషన్ లోటస్

### ఒక్కో ఎన్సీ ఎమ్మెల్యేకు 30 కోట్ల నగదు ఆఫర్

**శ్రీనగర్,జులై 12:** జమ్మూకశ్మీర్ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. తమ ప్రభుత్వాన్ని అస్థిర పరిచేందుకు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ఆపరేషన్ లోటస్‌కు తెరలేపిందని, తమ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు ప్రయత్నిస్తోందని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా సంచలన ఆరోపణలు చేశారు. శ్రీనగర్‌లోని హజ్రత్‌బాల్‌లో జరిగిన ఓ బహిరంగ సభలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ బిజెపికి చెందిన ఓ కీలక నేత, సుప్రీంకోర్టు న్యాయవాది మా పార్టీ ఎమ్మెల్యేను రహస్యంగా కలిశారు. పార్టీ మారితే రూ.20 కోట్ల నుంచి రూ.30 కోట్ల నగదు, మంత్రి పదవి ఇస్తామని, జమ్మూ కశ్మీర్‌కు పూర్తి రాష్ట్ర హోదా కల్పిస్తామని ఆశ చూపారు. కానీ మా ఎమ్మెల్యేల విశ్వాసాన్ని, నిబద్ధతను వారు కొనలేక పోయారు. రూ.100 కోట్లుఇచ్చినా నేషనల్ కాన్ఫరెన్స్ నేతలు అమ్ముడుపోరు. బలహీనులుగా



భావించి వెనుక ద్వారం గుండా అధికారంలోకి రావాలని బిజెపి చూస్తోందని తీవ్రంగా విమర్శించారు. ఒమర్ ఆరోపణలను బిజెపి జమ్మూకశ్మీర్ సీనియర్ నేత రవీందర్ రైనా ఖండించారు. ఈ వ్యాఖ్యలు పూర్తిగా నిరాధారమైనవని, భ్రమ కలిగించేలా ఉన్నాయని కొట్టిపారేశారు.

కేంద్రం నిధులు ఇవ్వకపోతే ఉద్యోగులకు జీతాలు కూడా చెల్లించలేమని కొద్దిరోజుల క్రితం స్వయంగా ముఖ్యమంత్రే అన్న విషయాన్ని రైనా గుర్తుచేశారు. ప్రస్తుతం 90 స్థానాలున్న అసెంబ్లీలో 41 మంది ఎమ్మెల్యేలతో నేషనల్ కాన్ఫరెన్స్ బలంగా ఉంది. కాంగ్రెస్ (6), స్వతంత్రులు (5), సిపిఎం (1) బయటి నుంచి మద్దతు ఇస్తుండటంతో ఒమర్ ప్రభుత్వానికి ఎలాంటి ప్రమాదం లేదు. మరోవైపు, జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణపై కేంద్రం అనుసరిస్తున్న వైఖరిని ఒమర్ అబ్దుల్లా తప్పుబట్టారు. "సరైనసమయం వచ్చినప్పుడు రాష్ట్ర హోదా ఇస్తామని కేంద్రం చెబుతోంది. ఆ సరైన సమయం ఎప్పుడు వస్తుందో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో, రాష్ట్ర హోదా కోసం ఈనెల 20న న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు ప్రకటించారు. రాజకీయ విభేదాలను పక్కనపెట్టి, గులాం నబీ ఆజాద్ సహా ప్రస్తుత, మాజీ ప్రజాప్రతినిధులందరూ ఈ నిరసనలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఒమన్ తీరంలో సైప్రస్‌జెండా ఉన్న నౌకపై దాడి

### 11 మంది భారత సిబ్బందిలో పదిమంది సురక్షితం, ఒకరు గల్లంతు..

**సనా,జులై 12:** పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. ఒమన్ తీరంలోని హోర్ముజ్ జలసంధిలో సైప్రస్ జెండాతో ప్రయాణిస్తున్న జీఎఫ్ఎస్ గెలాక్సీ అనే వాణిజ్య నౌకపై ఇరాన్ దాడి చేసింది. ఈ ఘటనలో నౌకలో ఉన్న 11 మంది భారత సిబ్బందిలో ఒకరు గల్లంతయ్యా రని, మిగిలిన 10 మందిని సురక్షితంగా కాపాడా మని భారత విదేశాంగ శాఖ ధృవీకరించింది. దాడి తర్వాత నౌకలో మంటలు చెలరేగి భారీగా దెబ్బ తినడంతో సిబ్బంది ప్రాణాలతో బయటపడేందుకు నౌకను విడిచిపెట్టినట్లు తెలుస్తోంది.

ఈ దాడిని భారత ప్రభుత్వం తీవ్రంగా ఖండిం చింది. ఒమన్ తీరంలో జీఎఫ్ఎస్ గెలాక్సీ వాణిజ్య నౌకపై జరిగిన దాడిని ఖండిస్తున్నాం. నౌకలోని 11 మంది భారతీయులలో 10 మందిని రక్షించగా, ఒకరు గల్లంతయ్యారని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. గల్లంతైన భారతీయుడి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని, ఒమన్‌లోని భారత రాయబార కార్యాలయం అక్కడి అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుం టోందని తెలిపింది. ఈ ప్రాంతంలో వాణిజ్య నౌకలపై జరుగుతున్న దాడులు ఆందోళనకరమని, ఉద్రిక్తతలను తక్షణమే తగ్గించాలని భారత్ పిలుపునిచ్చింది. గల్ఫ్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం కోసం జరుగుతున్న చర్చలను ముగించి, దౌత్య పరమైన పరిష్కారం కనుగొనాలని భారత్ సూచించింది. అంతర్జాతీయ చట్టాల ప్రకారం వాణిజ్య నౌకలు, పౌర మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకోరాదని, అంతర్జాతీయ జలాల్లో స్వేచ్ఛాయుత వాణిజ్యం, రవాణాకు ఎలాంటి ఆటంకాలు ఉండరాదని స్పష్టం చేసింది.

మరోవైపు నౌక అనధికార మార్గంలో ప్రయాణిం చడం వల్లే దారి మళ్లించే చర్యగా దాడి చేశామని ఇరాన్ తన చర్యను సమర్థించుకుంది. ఈ ఘటన తర్వాత హోర్ముజ్ జలసంధిని మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. దీనికి



ప్రతిస్పందనగా, అమెరికా ఇరాన్‌పై కొత్తగా మూడుసార్లు దాడులు ప్రారంభించింది. నౌకపై దాడి తర్వాత ఒక సిబ్బంది గల్లంతైనట్లు, నౌక ప్రయాణాన్ని కొనసాగించలేని విధంగా దెబ్బతిన్నట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ ధ్రువీకరించింది. ఇప్పటికే పలు దాడులకు పాల్పడిన ఇరాన్‌కు మరో అవకాశం ఇచ్చినా నిబంధనలను ఉల్లంఘించింది. అందుకే, పౌర నావికులపై దాడి చేసే ఇరాన్ సామర్థ్యాన్ని దెబ్బతీసేలా భారీ మూల్యం చెల్లించేలా చేస్తున్నామని యూఎస్ సెంట్రల్ కమాండ్ హెచ్చరించింది. ఇరాన్, ఒమన్ విదేశాంగ మంత్రులు సమావేశమైన మరుసటి రోజే ఈ దాడి జరగడం, ఇరుపక్షాల మధ్య దాడులు, ప్రతిదాడులు పెరగడం మధ్యప్రాచ్యంలో శాంతి ప్రయత్నాలకు పెద్ద ఎదురుదెబ్బగా మారింది.

## సంక్షిప్త వార్తలు

### రష్యాకు షాక్.. సిజ్రాన్ రిఫైనరీపై ఉక్రెయిన్ మెరుపుదాడి




**కీవ్, జులై 12:** రష్యాకు ఉక్రెయిన్ మరో షాక్ ఇచ్చింది. సమర రీజియన్‌లోని సిజ్రాన్ చమురుశుద్ధి కర్మాగారంపై కీవ్ డ్రోన్లు మెరుపు దాడి చేశాయి. దీంతో ఆయిల్ రిఫైనరీకి భారీ నష్టం వాటిల్లింది. ఈ నెల 11,12 తేదీల మధ్యలో ఈ దాడులు చోటు చేసుకున్నాయి. ఈ విషయాన్ని ఉక్రెయిన్ అధికారులు వెల్లడించారు. ఈ రిఫైనరీ యేటా 8.5 మిలియన్ మెట్రిక్ టన్నుల చమురును ప్రాసెస్ చేయగలదు. ఇక్కడి నుంచి సమర రీజియన్‌కు అవసరమైన పెట్రోల్, డీజిల్, ఏవియేషన్ ఫ్యూయల్ వెళతాయి. వీటిని రష్యా సైనిక దళాలు కూడా వినియోగిస్తాయి. దీనిని రోస్‌నెఫ్ట్ కార్పొరేషన్ నిర్వహిస్తోంది. తాజా దాడితో ఇక్కడ కార్యకలాపాలను నిలిపివేశారు.

### బావిలో విషవాయువులు లీక్.. ఐదుగురు దుర్మరణం

**షిల్లాంగ్, జులై 12:** మేఘాలయ రాజధాని షిల్లాంగ్‌లో ఓ విషాద ఘటన చోటుచేసుకుంది. ఒక ప్రైవేట్ నిర్మాణ స్థలంలోని ఓ బావిలో విషవాయువుతో ఐదుగురు మృతి చెందారు. తూర్పు ఖాసీ హిల్స్ జిల్లా పోలీసు అధిపతి వివేక్ సియెమ్ తెలిపిన వివరాల ప్రకారం.. లాపాలాంగ్ ప్రాంతంలోని ప్రైవేట్ స్థలంలో ఉన్న బావిలో నలుగురు కూలీలు నీళ్ల తోడుతున్నారు. ఈ క్రమంలో ఒక్కసారిగా ప్రమాదం సంభవించింది. బావిలో ఉన్న జనరేటర్ నుంచి విషపూరిత వాయువు వెలువడింది. ఈ విషవాయువు కారణంగా వారికి ఊపిరాడక అక్కడే కుప్పకూలారు.

### అమెరికా సెనెటర్ లిండ్సే గ్రాహం కన్నుమూత



**వాషింగ్టన్, జులై 12:** అమెరికా సెనెటర్, ట్రంప్ సన్నిహితుడు లిండ్సే గ్రాహం (71) కన్నుమూశారని ఆయన కార్యాలయం వెల్లడించింది. ఇటీవల ఆయన అనారోగ్యానికి గురై చికిత్స తీసుకుంటుండగా శనివారం సాయంత్రం స్వగృహంలో ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపింది. అయితే ఆయన అనారోగ్యానికి కారణాలు వెల్లడించలేదు. 2003 నుంచి యుఎస్ సెనేట్‌లో సౌత్ కరోలినాకు ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్నారు. జాతీయ భద్రత, విదేశాంగ విధాన చర్చలు వంటి వాటిలో చురుకుగా వ్యవహరిస్తూ.. దేశంలోని కీలక నేతల్లో ఒకరిగా పేరు పొందారు. అమెరికాకు చెందిన అనేక కీలక అంశాల్లో ట్రంప్‌కు బలమైన మద్దతుదారుగా వ్యవహరించారు. ఇటీవల అమెరికా-ఇరాన్ మధ్య పాకిస్థాన్ మధ్యవర్తిత్వం వహించిన సమయంలోనూ ఇస్లామాబాద్‌పై లిండ్సేగ్రాహం తీవ్ర విమర్శలు చేశారు.

### అమర్‌నాథ్ యాత్రికుల బస్సు బోల్తా, 16 మందికి గాయాలు

**సిమ్లా,జులై 12:** అమర్‌నాథ్ యాత్రికులతో వెళ్తున్న బస్సు బోల్తా పడటంతో 16 మంది గాయాలపాలయ్యారు. వారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు తెలిపారు. ఈ ఘటన హిమాచల్ ప్రదేశ్‌లోని కాంగ్రా జిల్లాలో చోటుచేసుకుంది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో మొత్తం 57 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది. జమ్మూ నుంచి డెహ్రాడూన్‌కు వెళ్లేందుకు యాత్రికులు ఈ ప్రైవేట్ బస్సును అద్దెకు తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

### ఇండోర్‌లో కళాశాల విద్యార్థిని ఆత్మహత్య

**ఇండోర్,జులై 12:** మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఓ కళాశాల విద్యార్థిని తాను అద్దెకు ఉంటున్న గదిలో ఆత్మహత్యకు పాల్పడింది. చనిపోయే ముందు ఆమె తన గది గోడపై చాక్‌పీస్‌తో రాసిన సూసైడ్ నోట్ సంచలనం రేపుతోంది. తన చావుకు తన తండ్రి, నానమ్మే కారణమని అందులో పేర్కొనడం కలకలం సృష్టిస్తోంది. పోలీసుల వివరాల ప్రకారం బాధితురాలిని రాజ్‌గఢ్ జిల్లాకు చెందిన వైష్ణవి బనావడే (20)గా గుర్తించారు. ఆమె ఇండోర్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. చదువు నిమిత్తం ఎంఐజీ పోలీస్ స్టేషన్ పరిధిలోని నెహ్రూ నగర్‌లో అద్దె గదిలో ఒంటరిగా ఉంటోంది. వైష్ణవి గత ఏడాదిగా ఓ యువకుడితో ప్రేమలో ఉన్నట్లు ప్రాథమిక విచారణలో తెలిసింది.

## వీసాగడువు ముగిసినా భారత్‌లోనే ఉన్న పాకిస్థానీయుల అరెస్టు

**బెంగళూరు,జులై 12:** కర్ణాటకలో గత 22 ఏళ్లుగా అక్రమంగా నివసిస్తున్న పాకిస్థాన్ జాతీయులైన తల్లి, కుమారుడిని పోలీసులు అరెస్టు చేశారు. చిక్కబళ్లాపూర్ జిల్లా బాగేపల్లి తాలూకాలో శనివారం ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. వీసా గడువు ముగిసినప్పటికీ దేశం విడిచి వెళ్లకుండా, నకిలీ పత్రాలు ద్వారా భారత ప్రభుత్వ గుర్తింపు కార్డులు పొందారనే ఆరోపణలపై వారిని అదుపులోకి తీసుకున్నారు. బాగేపల్లి సమీపంలోని దాసగరిపల్లి గ్రామంలో నివసిస్తున్న ఫర్హానాజ్ (52), ఆమె కుమారుడు మహమ్మద్ ఫర్దీన్ (21) రేషన్ కార్డు పొందడంతో పాటు ఓటర్ల జాబితాలో పేరు నమోదు చేయించుకోవాలని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. వారు సమర్పించిన పత్రాలను పరిశీలించిన రెవెన్యూ అధికారులకు అనుమానం కలగడంతో క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. ఈ విచారణలో వారు భారత పౌరసత్వంలేని పాకిస్థాన్ జాతీయులని నిర్ధారణ అయింది.వీసా గడువు ముగిసిన తర్వాతకూడా వారు పాకిస్థాన్‌కు తిరిగి వెళ్లకుండా, బెంగళూరు చిరునామాలను ఉపయోగించి నకిలీ ఆధార్ కార్డులు, కుల ధ్రువీకరణ పత్రాలు సృష్టించి బ్యాంకు ఖాతాలు కూడా పొందినట్లు అధికారులు గుర్తించారు.

## క్షిపణుల తయారీ ప్రైవేట్‌కు!

### రక్షణ మంత్రిత్వ శాఖ సన్నద్ధం, అస్త్రా మార్క్ 2 క్షిపణిలకు బిడ్‌లు

### ఎగుమతులు పెంచడం, పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడమే లక్ష్యం

**న్యూఢిల్లీ, జులై 12:** తన రక్షణ ఉత్పత్తి విధానంలో అతిపెద్ద సంస్కరణలలో భాగంగా, క్షిపణి తయారీని ప్రైవేట్ కంపెనీలకు తెరవడానికి భారత్ సిద్ధమవుతోంది. రక్షణ పరిశోధన- అభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఒ) అస్త్రా క్షిపణిని కొనుగోలు చేసేందుకు ఇండోనేషియా ఆసక్తి చూపడంతో, పెరుగుతున్న ఎగుమతి డిమాండ్‌ను తీర్చడానికి దేశీయ తయారీ సామర్థ్యాన్ని విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. విమానాలు, డ్రోన్లు, ఫిరంగి, నౌకాదళ ప్లాట్‌ఫారమ్‌ల వంటి రంగాలలో భారత్ ఇప్పటికే ప్రైవేట్ భాగస్వామ్యాన్ని అనుమతించినప్పటికీ, క్షిపణి తయారీ మాత్రం చాలా వరకు ప్రభుత్వ ఆధీనంలోని రక్షణ సంస్థల కిందనే ఉంది. రక్షణ మంత్రిత్వ శాఖ నివేదిక ప్రకారం, అస్త్రా మార్క్ 2 బియాండ్ విజువల్ రేంజ్ (బివిఆర్) గగనతల నుంచి గగనతల క్షిపణిని తయారు చేయడానికి భారతీయ ప్రైవేట్ కంపెనీలను ఆహ్వానిస్తూ రక్షణ మంత్రిత్వ శాఖ ఒక ప్రతిపాదనల కోసం అభ్యర్థన (ఆర్ఎఫ్ఆర్) జారీ చేయనుంది. ఇందులో పాల్గొనే కంపెనీలలో ఐకామ్(ఐసిఒఎంఎం), అదానీ, భారత్ ఫోర్జ్, టాటా గ్రూప్, మహీంద్రా గ్రూప్ ఉన్నాయని భావిస్తున్నారు. భారత సాయుధ దళాల నుండి, అలాగే మిత్ర దేశాల నుండి పెరుగుతున్న డిమాండ్ కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నారని, ప్రభుత్వ



రంగ సంస్థ భారత్ డైనమిక్స్ లిమిటెడ్ ప్రస్తుతం ఈ డిమాండ్‌ను పూర్తిగా తీర్చలేకపోతోందని నివేదిక పేర్కొంది. డిఆర్‌డిఒ అభివృద్ధి చేసిన అస్త్రా మార్క్ 2, 180- 200 కిలోమీటర్ల దాడి పరిధిని కలిగి ఉంది. ఆపరేషన్ సింధూర్‌కు ముందు పాకిస్థాన్‌కు చైనా సరఫరా చేసిన పిఎల్-15ఇ దీర్ఘ శ్రేణి గగనతల నుంచి గగనతల క్షిపణిని ఎదుర్కోవడానికి దీనిని రూపొందించారు. ఈ క్షిపణిని తేజస్ మార్క్ 1ఎ, మిగ్29, ఎస్‌యు30 ఎంకెఐ, రఫేల్ మెరైన్ యుద్ధ విమానాలతో అనుసంధానించనున్నట్లు భావిస్తున్నారు.

**తదుపరి ప్రళయ క్షిపణి:**

డిఆర్‌డిఒ వర్గాల కథనం ప్రకారం, అభివృద్ధి, తయారీ రెండింటికీ ప్రైవేట్ కంపెనీలకు తెరవబడే తదుపరి క్షిపణి వ్యవస్థ ప్రళయ వ్యూహాత్మక బాలిస్టిక్ క్షిపణి అయ్యే అవకాశం ఉంది. ప్రళయ క్షిపణి సుమారు 500 కిలోమీటర్ల పరిధిని కలిగి ఉంది. ఇది ధ్వని వేగం కంటే ఆరు రెట్లు వేగంతో ప్రయాణించగల రెండుదశల క్షిపణి. ఇది లాంగ్ రేంజ్ ల్యాండ్ అటాక్ క్రూయిజ్ మిస్సైల్ (ఎల్ఆర్ఎల్ఎసిఎం), తదుపరి తరం బ్రహ్మోస్ క్షిపణి, విస్తృతశ్రేణి పినాకా రాకెట్ వ్యవస్థతో పాటు భారత దేశపు సమీకృత రాకెట్ దళాలలో భాగంగా ఉంది.

**'ఆపరేషన్ సింధూర్' రక్షణ ప్రాధాన్యతలతోనే:**

స్టాండ్‌ఆఫ్ ప్రెసిషన్ ఆయుధాల ప్రాముఖ్యత పెరుగుతోందని ఆపరేషన్ సింధూర్ నుండి నేర్చుకున్న పాఠాల నేపథ్యంలోనే ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టిందని నివేదిక పేర్కొంది. నిరోధక శక్తిని బలోపేతం చేయడానికి భారతదేశపు క్షిపణి, రాకెట్ నిల్వలను వేగంగా విస్తరించడంపై, అదే సమయంలో క్షిపణి రక్షణ సామర్థ్యాలను పెంచడంపై కేంద్రం ఇప్పుడు దృష్టి సారించింది. ఇటీవలి ఇరాన్-అమెరికా సంఘర్షణ కూడా క్షిపణులు, వాయు రక్షణ వ్యవస్థల వ్యూహాత్మక ప్రాముఖ్యతను బలపరిచిందని, కీలకమైన మౌలిక సదుపాయాలపై కచ్చితమైన దాడులు ఎంత నష్టం కలిగించగలవో ఇది స్పష్టం చేసిందని నివేదిక పేర్కొంది.

# మంగళం ఆర్టీసి డిపోను ప్రైవేట్‌కు కట్టబెట్టొద్దు

## • 500 మంది ఉద్యోగుల జీవితాలతో చెలగాటమాడొద్దు



**తిరుపతి, జులై 12 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆర్టీసిని, సంబంధించిన ఆస్తులను ప్రైవేట్ సంస్థలకు పంచి పెడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు ద్రోహం చేస్తున్నదని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి తీవ్రంగా విమర్శించారు. వందల కోట్ల విలువ చేసే 10 ఎకరాలపైనే ఉన్న మంగళం ఆర్టీసి డిపో భూములను పూణేకి చెందిన పినాకిల్ సంస్థకు కట్టబెట్టడం దారుణమని అన్నారు. 95 బస్సులు, 500 మందికి పైగా ఉద్యోగుల తో ఉన్న మంగళం డిపోను చెల్లా చెదురుచేసి బస్సులను, ఉద్యోగులను వివిధ డిపోలకు బదిలీ చేసి డిపోను 24 బస్సులకు పరిమితం చేశారని ఆరోపించారు. ఆర్టీసీని ప్రైవేటుపరం చేయలేదని రోజూ ప్రకటనలు చేస్తూనే, మొదటి దశలో 12 డిపోలు, రెండవ దశలో 19 డిపోలను ప్రైవేటుపరం చేయటానికి దశలవారీగా ప్రభుత్వం ప్రయత్ని స్తున్నదని పేర్కొన్నారు. తిరుపతి మంగళం డిపోను ప్రైవేటుపరం చేస్తున్న మొదటి డిపోగా ఆయన ఆ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని 129 డిపోలను ఎలక్ట్రిక్ బస్సుల డిపోలుగా మార్చాలని, ఈ బస్సులన్నిటిని పూణేకి చెందిన పినాకిల్ మొబిలిటీ సొల్యూషన్స్ కంపెనీ ద్వారా నడిపించాలని ప్రభుత్వం ఒప్పందం చేసుకున్నదని వివరించారు. ఒక్కో బస్సుకు కేంద్ర ప్రభుత్వం రూ.35 లక్షలు సబ్సిడీని అందిస్తున్నదని ఆ సబ్సిడీ తీసుకొని రాష్ట్ర ప్రభుత్వమే బస్సులను కొనుగోలు చేసి నడపాల్సింది పోయి, పినాకిల్ సంస్థకు ఆర్టీసీని అప్పజెప్పడమే కాకుండా ఇష్టారీతిన అద్దె ఒప్పందాలు చేసుకున్నారని ఆరోపించారు. ప్రస్తుతం ఆర్టీసీకి కిలోమీటర్‌కు రూ.45ల ఆదాయం వస్తుండగా పూణే సంస్థతో 12 మీటర్ల బస్సును కిలో మీటర్‌కు రూ..72.55లకు 9 మీటర్ల బస్సును కిలో మీటర్‌కు రూ.62.17లకు ఒప్పందాలు చేసుకున్నారని మండిపడ్డారు. ఈ కారణంగా రానున్న కాలంలో ఆర్టీసీ తీవ్రంగా నష్టపోతుందని, సంస్థ అదృశ్యమయ్యే పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వెలిబుచ్చారు. చార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేయటానికి ప్రభుత్వ డిపోను కొట్టివేసి కొత్త నిర్మాణాలు ఆర్టీసీ చేపట్టిందని ఓ ప్రైవేటు సంస్థ కొరకు ప్రభుత్వం ప్రజల ఆస్తులను ధ్వంసం చేసే అధికారం ఎవరిచ్చారని కందారపు మురళి ప్రశ్నించారు. మంగళం డిపోను ప్రైవేటు సంస్థకు అప్పజెప్పే చర్యలను మానుకోకుంటే పెద్ద ఎత్తున నిరసనను వ్యక్తం చేయాల్సి వస్తుందని కందారపు మురళి హెచ్చరించారు.

## వియత్నాం ఘటనపై జగన్ దిగ్భ్రాంతి

**విజయవాడ, జులై 12 ప్రభాతవార్త ప్రతినిధి:** వియత్నాంలోని హాలాంగ్ బే వద్ద జరిగిన ఘోర బోటు ప్రమాదంలో తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు పర్యాటకులు దుర్మరణం చెందడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ విచారం వ్యక్తం చేశారు. వియత్నాం పర్యటనకు వెళ్లిన భారతీయ పర్యాటకుల బృందం ప్రయాణిస్తున్న బోటు ప్రమాదానికి గురికావడం అత్యంత విషాదకరమని ఆయన పేర్కొన్నారు. వియత్నాంలో జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారిలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన వారుండ టం మరింత బాధాకరమన్నారు.

ముఖ్యంగా కడప, బందరు ప్రాంతాలకు చెందిన పలువురు మొబైల్ డిస్ట్రిబ్యూటర్లు ఈ ప్రమాదంలో మృతి చెందడం ఎంతో కలిచి వేసిందన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని ఆ కుటుంబా లకు భగవంతుడు ప్రసాదించాలని ప్రార్థించారు. ప్రమాదంలో గాయపడిన వారంతా త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన వైయస్ జగన్, ప్రస్తుతం వియత్నాంలో చిక్కుకుపోయిన తెలుగు రాష్ట్రాల పర్యాటకులకు అవసరమైన సహాయ సహకారాలు అందేలా కేంద్ర, రాష్ట్ర పభుత్వాలు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రమాదంలో గల్లంతైన వారి ఆచూకీ కోసం ముమ్మరంగా సహాయక చర్యలు చేపట్టి, బాధిత కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా నిలవాలని సంబంధిత అధికారులను కోరారు. ఈ విపత్కర పరిస్థితిలో చిక్కుకున్న తెలుగు వారిని సురక్షితంగా స్వదేశానికి తీసుకురావడానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని వైఎస్ జగన్ విజ్ఞప్తి చేశారు.

# రాజధానిపై విషం చిమ్మడం వైసిపి పని

## • టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు నక్కా ఆనందబాబు



**విజయవాడ, జులై 12 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధానిపై విషం చిమ్మడం ప్రత్యర్థిపార్టీ ఆపటం లేదని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ఆరోపించారు. "అమరావతికి కనెక్టివిటీ రాకుండా చేసేందుకు రైతులను అడ్డు పెట్టి జగన్ పార్టీ కుట్రలు చేస్తున్నారు. అమరావతిని అడ్డుకోవడానికే అర శాతం మంది రైతులను జగన్ వాడుకుంటు న్నారు. అమరావతిని ఆపేందుకు గొడ్డలి పార్టీ నానా తంటాలు పడుతోంది. అమరావతికి 99.50 శాతం మంది రైతులు భూములను త్యాగం చేశారు. భూములివ్వని అర శాతం రైతులను అడ్డం పెట్టుకుని వైఎస్సార్సీపీ కుతంత్రాలు పన్నుతోంద్ని అని నక్కా ఆనందబాబు ఆరోపించారు. ఈ సందర్భంగా సిఆర్‌డిఎ సీడ్ యాక్సెస్ రోడ్ నిర్మాణం, భూసేకరణ వంటి అంశాలపై మీడియా సమావేశంలో నక్కా ఆనంద బాబు పలు వాస్తవాలను తెలియజేశారు. సిఆర్‌డిఎ చేపట్టిన ఇ3 సీడ్ యాక్సెస్ రోడ్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియ పూర్తిగా నిబంధనల ప్రకారమే జరిగిందని స్పష్టం చేశారు. రాష్ట్రానికి రాజధాని లేకుండా చేయాలనే ఉద్దేశంతోనే వైసిపి వ్యవహరిస్తోందని ఆనంద బాబు పేర్కొన్నారు. 2014 నుంచి 2019 వరకు అమరావతి అభివృద్ధిని అడ్డుకునేందుకు తప్పుడు ఆరోపణలు, ఫిర్యాదులు చేసిన గొడ్డలి పార్టీ, 2019 నుంచి 2024 వరకు మూడు రాజధానుల పేరుతో రాజధానిని పూర్తిగా నిర్వీర్యం చేసిందని ఆగ్రహిం చారు. రాష్ట్ర ప్రజలు తగిన గుణపాఠం చెప్పడంతో ఆ పార్టీ 11 అసెంబ్లీ స్థానాలకు పరిమితమైందని, కూటమి ప్రభుత్వం అమరావతే రాష్ట్ర రాజధాని అని పార్లమెంటులో స్పష్టం చేసినా వైసిపి వైఖరిలో మార్పు రాలేదని అన్నారు. రాజధాని అమరావతికి కనెక్టివిటీ కోసం నిర్మిస్తున్న ఇ3 సీడ్ యాక్సెస్ రోడ్ కోసం చేపట్టిన 2.725 ఎకరాల భూసేకరణ అంశాన్ని బూచిగా చూపే ప్రయత్నం ఆ పార్టీ చేస్తోందన్నారు. భూసేకరణకు ముందు అధికారులు పలుమార్లు రైతులతో సమావేశాలు నిర్వహించి, ల్యాండ్ పూలింగ్‌లో చేరితే కలిగే ప్రయోజనాలను వివరించారని ఆనంద బాబు చెప్పారు. నోటిఫికేషన్ జారీ చేసిన తర్వాత కూడా ల్యాండ్ పూలింగ్‌కు అవకాశం కల్పిస్తూ రైతులను ఒప్పించే ప్రయత్నాలు కొనసాగించారని పేర్కొన్నారు.

# రాజకీయ కుట్రలకు దళితులను వాడుకోవద్దు

## • హిందూ సమాజంలో చిచ్చు పెట్టే ప్రయత్నాలను తిప్పికొట్టాలి • బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్



**విజయవాడ, జులై 12 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ఎన్‌డియే ప్రభుత్వం దళిత సంక్షేమం, సాధికారతకు పెద్దపీట వేస్తూ ఎస్సీ వర్గాల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్ అన్నారు. జడ శ్రవణ్, ప్రకాష్‌రాజ్ పై ఉపా యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలని ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్ నేరుగా డిమాండ్ చేశారు. రావణ్ హైందవ ధర్మంపై మాటల యుద్ధం ప్రారంభం చేసిన 24గంటల తరువాత జడ శ్రవణ్ ఇదే వ్యాఖ్యలు చేశారు మరో 48గంటలు దాటిన తర్వాత ప్రకాష్‌రాజ్ తన వైఖరిని వెల్లడించాడు. ఆ తర్వాత రోజు సిపిఐ నేత రామకృష్ణ స్పందిం చారు. వైసిపి వీరందరి వ్యాఖ్యలకు అండగా నిలుస్తూ మీడియా ముందు వ్యక్తం చేస్తూ వచ్చిందని తీవ్ర ఆరోపణలు గుప్పించారు. దళితులపై ఎలాంటి అన్యాయం జరిగినా బిజెపి ఎస్సీ మోర్చా అండగా నిలుస్తుందని ఆయన స్పష్టంచేశారు. విజయవాడలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నినాదమైన "సబ్ కా సాథ్.. సబ్ కా వికాస్.. సబ్ కా విశ్వాస్ట్ స్ఫూర్తితో సమాజంలోని చివరి వ్యక్తికీ ప్రభుత్వ పథకాల ఫలాలు చేరేలా ఎన్డీఏ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. దళితులను అన్ని రంగాల్లో అగ్రగాములుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అయితే రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుండ టాన్ని జీర్ణించుకోలేక జగన్‌మోహన్ రెడ్డి కుట్రలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దళితుల మధ్య విభేదాలు సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. దేవాలయాలు, హిందూ సంస్థలు, హిందూ విశ్వాసాలపై జరుగుతున్న దాడులను బిజెపి ఎస్సీ మోర్చా తీవ్రంగా ఖండిస్తోందన్నారు. రావణ్ పేరుతో రాజకీయాలు చేస్తున్న వ్యక్తి వెనుక వైసిపి నాయకత్వం ఉందని, జడ శ్రవణ్ కుమార్ వంటి వ్యక్తులను వైసిపి ప్రోత్సహిస్తూ దళితుల పేరుతో సమాజంలో ఉద్రిక్తతలు సృష్టించే ప్రయత్నం చేస్తోందన్నారు. దళిత హిందువులు ఇలాంటి కుట్రల పట్ల అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని అడ్డుకునేందుకే కొందరు ఉద్దేశపూర్వకంగా వివాదాలు సృష్టిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికే ప్రజలు వైఎస్సార్‌సిపిని 11 అసెంబ్లీ స్థానాలకే పరిమితం చేసి తమ తీర్పు ఇచ్చారని అన్నారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలు జరిగాయని ప్రభుత్వం భావిస్తే, సంబంధిత చట్టాల ప్రకారం సమగ్ర దర్యాప్తు జరిపి తగిన చర్యలు తీసుకోవాలని బిజెపి ఎస్సీ మోర్చా డిమాండ్ చేస్తోందన్నారు. ఈ నెల 15వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా దళిత నాయకులతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించి దళిత సమాజానికి సంబంధించిన వివిధ అంశాలపై విస్తృతంగా చర్చిస్తామని పనతల సురేష్ వెల్లడించారు. ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు, వల్లూరి గంగాధర్, కంతేటి బ్రహ్మయ్య, జోనల్ ఇంచార్జీ మేకల లక్ష్మణ్, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు సర్వశుద్ధి రాజు తదితరులు పాల్గొన్నారు.

# రజకులను డిఎన్‌టిలో చేర్చాలి

## • ఆర్థికంగా బలోపేతం కావాలి • రాష్ట్రస్థాయి సదస్సులో వక్తలు




**గుత్తి, జులై 12 ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా సామాజికంగా, ఆర్థికంగా, వెనుకబడిన రజకుల అభ్యున్నతి దృష్ట్యా రజకులను డిఎన్‌టిలో చేర్చాలని తద్వారా కేంద్రం అందించే పథకాలు అందుబాటులోకి వస్తాయని రాజ్యసభ సభ్యులు సత్యనారాయణ, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు, విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, టిడిపి జాతీయ ఉపాధ్యక్షులు దువ్వాడపు రామారావు, కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వెంకటశివుడుయాదవ్, టిడిపి గుంతకల్లు ఇన్‌చార్జ్ గుమ్మనూరు నారాయణ స్వామి తదితరులు పేర్కొన్నారు. రజకులు ఆర్థికంగా బలోపేతం కావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని వారు అభిప్రాయపడ్డారు. అనంతపురం జిల్లా గుత్తి పట్టణంలోని విరూపాక్షిరెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం రాష్ట్రస్థాయిలో ఆరవ రజక ఆకాంక్ష సభ నిర్వహించారు. అంతకుముందు గుత్తి పట్టణంలో భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం రజక సంక్షేమ ఫెడరేషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ సావిత్రి అధ్యక్షతన భారీ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రజకులు ఐకమత్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ల్యాండ్రీలు నిర్వహిస్తున్న రజకులకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించాలని, 50 యేళ్లకే పెన్షన్ ఇవ్వాలని, రజక కార్పొరేషన్‌కు రూ.1000 కోట్లు కేటాయించాలని, జిఒ నెంబర్ 27 ప్రకారం ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ధోబి పోస్టు భర్తీ చేయాలని, తెలంగాణ తరహాలో ఆధునిక ధోబి ఘాటు నిర్మించాలని, రజకులను బిసి-ఎ నుండి ఎస్‌సి క్యాటగిరీకి మార్చాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రజకుల అభ్యున్నతికి చేయూత ఇవ్వాలని వారు కోరారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్కెటింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ కెసి హరి, రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగమయ్య, రజక అభివృద్ధి సంస్థ ప్రధాన కార్యదర్శి కమ్మన్న, జిల్లా అధ్యక్షుడు హరికృష్ణ, కార్యదర్శి నాగప్ప, గుత్తి మార్కెట్ యార్డ్ చైర్మన్ జక్కలచెరువు ప్రతాప్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ పత్తి హిమబిందు, రజక కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, పట్టణ టిడిపి అధ్యక్షుడు ఎంకె చౌదరి, స్థానిక నాయకులు కిరణ్, తిప్పడు శీన, మల్లికార్జున, నాగేంద్ర, చెర్లపల్లి సురేష్, సూరి, భూషణ్, నారాయణస్వామి, సుంకన్న, జయరాం, లక్ష్మినారాయణ, సాయి, తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల సమాచారం



## కొండపై భక్తుల రద్దీ

### గోవిందుని దర్శనానికి 30గంటలు

**తిరుమల, జులై 12 ప్రభాతవార్త ప్రతినిధి:** వరుసగా రెండురోజులు వారాంతం సెలవులు రావడంతో తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. అలిపిరి టోల్ గేట్ నుంచే రద్దీ కనిపిస్తోంది. ఆదివారం సాయంత్రానికి సర్వదర్శనానికి 30 గంటల పైగానే సమయం పడుతోంది. భక్తులు పూర్తిగా సిబ్బందికి సహకరించాలని, సంయమనంతో దర్శనం చేసుకోవాలని టిటిడి ప్రచారం చేస్తోంది. క్యూ లైన్‌లలో ఉన్న వారికి శ్రీవారి సేవకులు అన్న ప్రసాదం, మజ్జిగ, మంచినీరు, పాలు అందిస్తున్నారు. తిరుమలలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్ మెంట్లు భక్తులతో నిండిపోయాయి. భక్తుల క్యూ లైన్ బాటగంగమ్మ ఆలయం వరకూ విస్తరించింది. శనివారం రాత్రి వరకు 92,017 మంది భక్తులు దర్శించుకున్నారు. కానుకల రూపంలో శ్రీవారి హుండీకి 3.93 కోట్లు రూపాయలు ఆదాయం వచ్చింది. ఆదివారం సాయంత్రానికి 43వేలమంది భక్తులకు మహాలఘులో స్వామివారి దర్శనం చేయించారు. రద్దీ ఎక్కువగా ఉండటంతో వెలుపల క్యూ లైన్లలో భక్తుల నిరీక్షణ తప్పడంలేదు.

## ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్‌కు రూ.10 లక్షలు విరాళం



**తిరుమల, జులై 12 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి నిర్వహిస్తున్న ఎస్వీప్రాణదాన ట్రస్ట్‌కు విరాళాలందు తున్నాయి. హైదరాబాద్ సరూర్ నగర్‌కు చెందిన కె వెంకటేశ్వర్లు పేద ప్రజల ఆరోగ్య సంరక్షణకు ఉపయో గపడే ప్రాణదాన ట్రస్ట్‌కు సహకారం అందించారు. హైదరాబాద్ క్యాంప్ కార్యాలయంలో టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడును కలిసి రూ.10లక్షలు విరాళం డిడిని అందజేశారు.

## రెండు రోజులు విఐపి బ్రేక్ దర్శనాలు రద్దు



**తిరుమల, జులై 12 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవారి ఆలయంలో ఆణివార ఆస్థానం రానున్న శుక్రవారం జరగనుంది. ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని రేపు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా ఇతరులకు టిటిడి రెండు రోజుల పాటు విఐపి బ్రేక్ దర్శనాలను రద్దు చేసింది. నేడు సోమవారం, 16వ తేదీ గురువారం విఐపి బ్రేక్ దర్శనాలకు సంబంధించిన సిఫార్సు లేఖలు స్వీకరించబడవు. జూలై 17న కళ్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకరణ సేవలను రద్దు చేసింది. ఈ విషయాలను దృష్టిలో పెట్టుకొని సహకరించవలసినదిగా భక్తులకు టిటిడి విజ్ఞప్తి చేసింది.

## శ్రీవారి ఆలయంలో మహాద్వారం - బంగారువాకిలి

# బంగారుమయం చేయరా!?



**తిరుమల, జులై 12 ప్రభాతవార్త ప్రతినిధి:** నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లు తున్న తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి కొలువైన బంగారువాకిలిలో ద్వారపాల కులుగా ఉన్న జయవిజయుల తలుపులు బంగారు తాపడం చేయాల్సిన పనులకు నాలుగేళ్ళు గా 'బ్రేక్' పడిందా? అనే అనుమానాలు టిటిడి వర్గాల్లో వ్యక్తమవు తున్నాయి. ఎప్పుడో పూర్తిచేయాల్సిన ఈ పనులు ఇంకా నాన్చుతూనే ఉన్నారు. ఇప్పటికే తిరుమలేశుని ఆలయంలోపల మహ ద్వారం వాకిలి, గోపురం, ఆనందనిలయం బంగారుమయం వంటి బంగారుతాపడం పనులు చేపట్టాలని గతంలో అనేక పాలక మండళ్ళు నిర్ణయించినా ఆ దిశగా ఇప్పటివరకు పనులు మొదలుకాలేదు.

గత ధర్మకర్తల మండలి రూ.1.69కోట్ల అంచనాతో బంగారు వాకిలిలో ఉన్న జయవిజయుల తలుపులు బంగారుతాపడం చేయాలని నిర్ణయించింది. ఈ వైదిక పనులు ఎప్పుడో పూర్తికావలసి ఉన్నా గత ప్రభుత్వం మారడంతో ఈ పనులు ఎక్కడ కక్కడే ఆగిపోయాయి. ఈ పనులు పూర్తయితే ఆలయం లోపల బంగారు వాకిలి తరహాలో జయవిజయులు కొలువైన తలుపులు కూడా మరింత తళతళ మెరిసిపోతాయి.

ఆలయ పవిత్రత పెంపొందించడంలో భాగంగా బంగారుమయం పనులు చేయాలని నిర్ణ యించినా ఇంతవరకు ఆ దిశగా కార్యాచరణ ముందుకు సాగలేదు. ప్రస్తుతం రోజువారీగా ఒక లక్ష మంది వరకు భక్తులు అన్ని రకాల దర్శనాలలో (ఉదయం వేళ సుప్రభాతసేవ, విఐపి బ్రేక్ తప్ప)మహాలఘు విధానం జయ విజయుల వరకే అనుమతిస్తున్నారు.

భక్తులు తదేకంగా గోవిందా... గోవింద నామాలతో కులశేఖరపడికి సమీపంలో కొలువైన దివ్య మంగళరూపాన్ని వీక్షించి తమ జీవితం ధన్యం చేసుకుంటున్నారు. రోజువారీగా 75వేలమంది వరకు భక్తులు ఆ వేంకన్న దర్శనం చేసుకోగలు గుతున్నారు. వీరంతా కూడా జయవిజయుల వరకే అనుమతించ బడుతున్నారు. ఇక్కడ తలుపులు కూడా కొంత బంగారుపూత తగ్గిందనేది భక్తుల సమాచారం.

### మహద్వారం, బంగారువాకిలి స్వర్ణమయం ఏదీ!?

బంగారుస్వామిగా కీర్తింప బడుతున్న తిరుమల ఆలయంలో ద్వారాలు బంగారు తాపడం మయం చేయాల్సిన పనులు ఎప్పుడు ప్రారంభమ వుతాయనేది భక్తుల్లో వినిపిస్తున్న ప్రశ్నలు. వెంకన్న ఆలయంలో మహద్వారం నుంచి బంగారు వాకిలి, గోపురం బంగారు తాపడం చేయాలని, ఈ పనులు వైఖానస ఆగమోక్తంగానే చేపట్టేందుకు కూడా పాలక మండలి నిర్ణయించింది. ప్రధానమైన మహద్వారం ప్రవేశం నుంచి వెండివాకిలి, బంగారు వాకిలి, ఆలయ గోపురాలు ముఖ్యమైనవి, ఇందులో మహద్వారం గడపలకు, తలుపులు ఎప్పుడో కొన్ని దశాబ్దాల క్రిందట బంగారు తాపడం చేశారు. దీంతో ఇప్పుడు ఇవి చూడటానికి కొంత పేలవంగా కనిపిస్తున్నాయి. మరో రెండు నెలల్లో ఏడుకొండల వెంకన్న బ్రహ్మోత్సవాలు మొదలు కానున్నాయి.

ఈ సమయంలో ఈ బంగారు తాపడం పనులు ఎంతవరకు సాధ్యమవుతుందనేది ప్రస్తుతం టిటిడి వర్గాల్లో చర్చ మొదలైంది. రేపు జరిగే టిటిడి బోర్డు ఏం నిర్ణయం తీసుకోనుందో చూడాల్సిందే.

## 18న అక్టోబర్ దర్శన కోటా ఆన్‌లైన్‌లో విడుదల



**తిరుమల, జులై 12 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల (సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవ)కు సంబంధించిన అక్టోబర్ నెలకోటాను ఈనెల 18న ఉదయం 10 గంటలకు టిటిడి ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్లు ఎలక్ట్రానిక్ డిప్ కోసం 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఈ టికెట్లు పొందిన వారు 20వతేదీ నుండి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లించిన వారికి టికెట్లు మంజూరవుతాయి. ఇక కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ టికెట్లను ఈనెల 21న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

**వర్చువల్ సేవల కోటా విడుదల:** వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను 21న మధ్యాహ్నం 3 గంటలకు టిటిడి ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. అంగ ప్రదక్షిణ టోకెన్ల కోటాను 23న ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నారు. శ్రీవాణి ట్రస్టు దర్శన టికెట్ల కోటాను 23న ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నారు. వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను 23న మధ్యాహ్నం 3 గంటలకు టిటిడి ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను 24న ఉదయం 10 గంటలకు టిటిడి ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఇక చివరగా తిరుమల, తిరుపతిలలో గదుల కోటాను 24న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. భక్తులు టిటిడిదేవస్థానమ్స్.ఎపి.జిఓవి.ఇన్ వెబ్‌సైట్ ద్వారా మాత్రమే శ్రీవారి ఆర్జితసేవలు, దర్శన టికెట్లు బుక్ చేసుకోవాలని టిటిడి తెలిపింది.

## టిటిడి ఇఒ నకిలీ మెయిల్‌తో నగదు కాజేత

**తిరుమల, జులై 12 ప్రభాతవార్త ప్రతినిధి:** విదేశాల్లోని జోహానెస్‌బర్గ్‌లో శ్రీనివాస కళ్యాణం కార్యక్రమానికి ప్రసాదాల సామాగ్రి కోసం నగదు పంపాలంటూ ఎన్నారైకి ఓ సైబర్ నేరస్తుడు మాయమాటలతో నమ్మించాడు. ఏకంగా ఆ మాటలకు నమ్మిన ఓ భక్తుడు నుండి రూ.37వేలు కాజేశాడు. టిటిడి ఇఒ నకిలీ మెయిల్ ఐడితో ఈ దగా చేశాడు. దక్షిణాఫ్రికాలోని ఇండియా కేర్స్ సంస్థ ప్రతినిధి వెంకటప్రసాద్‌తో ఓ సైబర్ నేరస్తుడు సంప్రదించాడు. ఆ సంస్థ ప్రతినిధి నుండి రూ.37 వేలు నగదు యూపీఐ అకౌంట్ ద్వారా కాజేశాడు. ఆ వెంటనే టిటిడి అధికారులనుఇండియా కేర్స్ ప్రతినిధి సంప్రదించాడు. టిటిడి ఎటువంటి నగదు అడగలేదని, రశీదులు తప్పుడువని నిర్ధారించిన టిటిడి దీనిపై ఎవిఎస్ఒ చంద్ర ఫిర్యాదుతో తిరుపతి ఈస్ట్ సిఐ శ్రీనివాసులు కేసు నమోదు చేశారు.

# వెంటాడుతున్న వర్షాభావ పరిస్థితులు!

## • శేషాచలంలో ఎండిన కుంటలు • కాలినడక మార్గాల్లోకి చిరుతలు



**తిరుమల, జులై 12 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏడాదికాలంగా కురవని వర్షాలు...శేషాచలం కొండల్లో నిండని కుంటలు వెరసి అడవిలో ఉండాల్సిన చిరుత పులులు, ఏనుగుల, ఎలుగుబంట్లు ఆహారం నీటి కోసం దారితప్పి కాలినడక మార్గాల్లో సంచరిస్తున్నాయి. భక్తుల సంచారం ఉండే అలిపిరి, శ్రీవారిమెట్టు మార్గంతో బాటు తిరుమల మొదటిఘాట్‌రోడ్డులోనూ చిరుతలు సంచారం పెరిగింది. భక్తులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పుడు, అప్పుడు కాదు తరచుగా దశాబ్ధకాలంగా తిరుమల కాలినడక మార్గాల్లో, ఘాట్‌రోడ్లలో భక్తులపై చిరుతపులులు దాడులు చేసిన విషాద ఘటనలు కూడా ఉన్నాయి. తిరుమల శేషాచలం అటవీ ప్రాంతాన్ని ఆనుకునే అలిపిరి, శ్రీవారిమెట్టు నడక మార్గాలు ఉన్నాయి. తిరుమలకు ఉన్న మొదటి, రెండో ఘాట్‌రోడ్లు చాలావరకు అటవీప్రాంతం మధ్యలోనే ఉండటంతో వన్యప్రాణులు సంచారం ఉంది. ఐదేళ్ళ క్రిందట రెండోఘాట్‌లో చివరి మలుపు వద్ద తిరుమల ట్రాఫిక్ పోలీసులు, స్థానికులు ద్విచక్ర వాహనంలో వస్తుండగా వెంబడించి దాడిచేసిన ఘటన తెలిసిందే. శ్రీవారిమెట్టు మార్గంలో ఏకంగా బాలుడిపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచింది. మొదటి ఘాట్‌లో మోకాళ్ళ పర్వతం సమీపంలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి సమీపంలో నడకదారిలో వస్తున్న భక్తులపై దాడికి ప్రయత్నించి వాహనాల రాకతో పరుగులు తీసింది. మూడేళ్ళ క్రిందట 7వ మైలు వద్ద చిరుతపులి కర్నూలుకు చెందిన బాలుడ్ని నోట కరచుకుని తీసుకెళ్ళి గాయపరిచింది. ఈ ఘటనతో తిరుమలకు వచ్చే భక్తులకు చిరుతల భయం పట్టుకుంది. శేషాచలం అటవీ ప్రాంతంలో గత ఏడాది వరకు దాదాపు 300వరకు చిరుతపులులు ఉన్నట్లు వాటి పాదాల అడుగుల ద్వారా అటవీశాఖ గణన చేసింది. ఏడాదికేడాది చిరుతల సంఖ్య పెరుగుతోంది. ఆహారం కోసం అడవిలో దారితప్పి నడక మార్గాల్లో, ఘాట్ రోడ్లపై వస్తుంటాయని, ఆ సమయంలో మనుషులు గుంపుగా ఉంటే ప్రమాదం లేదని, అక్కడక్కడా ఇద్దరు ముగ్గురు వస్తుంటే దాడి చేస్తున్నాయనేది అటవీశాఖ వర్గాల సమాచారం. ఇటీవల శనివారం వేకువజామున మొదటిఘాట్‌కు ఆనుకుని ఉన్న అలిపిరి కాలినడక మార్గంలో చిరుతపులి పొదల్లో దాక్కుని మెట్లమార్గంలోకి రావడంతో భక్తులు చెల్లాచెదురై భయంతో పరుగులు తీశారు. కొందరు ఏకంగా శబ్ధాలు చేయడంతో చిరుత అడవిలోకి వెళ్ళింది. ఒక్కసారిగా ఈ ఘటనతో ఆ ప్రాంతమంతా ఆందోళనకరంగా మారింది. అలిపిరి నడక మార్గాన్ని వందకోట్ల పైగా వెచ్చించి ఆధునికంగా పునర్మిర్మాణం చేశారు. అయితే కాలినడక భక్తుల భద్రతకు తగిన జాగ్రత్తలు తీసుకోలేకపోయారు. అటవీప్రాంతాన్ని ఆనుకుని వున్న నడకమార్గాల్లో రక్షణ గోడల చుట్టూ ఇనుపకంచె ఏర్పాటుచేస్తే ఇలాంటి ప్రమాదం ఉండదనేది భక్తుల నుండి అభిప్రాయం. తిరుమల మొదటి ఘాట్‌లో అధికభాగం అటవీ ప్రాంతానికి, నడక మార్గానికి ఆనుకునే ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో భక్తుల రక్షణకు చర్యలు తీసుకుంటే తప్ప చిరుతల ప్రమాదం నుంచి భద్రత కల్పించలేరనేది భక్తుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. తిరుమలకు రోజుకు 90వేల మంది వరకు భక్తులు వస్తుంటే ఇందులో కాలినడక మార్గాల్లో సాధారణ రోజుల్లో 20 వేల మంది వరకు, వారాంతంలో 30వేలమంది వరకు భక్తులు వస్తున్నారు. మధ్యాహ్నం తరువాత అలిపిరి నడకమార్గంలో భక్తులు కొండకు రావడం కనిపిస్తుంది. ఇలా అర్ధరాత్రి వరకు ఏకధాటిగా భక్తుల సంచారం ఉంటుంది. అయితే భక్తుల ప్రాణాల రక్షణకు టిటిడి తీసుకుంటున్న చర్యలు మాత్రం శూన్యమనే భక్తులు చెబుతున్నారు. పైగా అటవీప్రాంతానికి ఆనుకుని ఉన్న నడకమార్గాల్లో బలమైన ఇనుపకంచె వేయడం, భద్రతపరంగా చర్యలు తీసుకోవడం చేయాలని సూచిస్తున్నారు. రేపు జరిగే బోర్డు సమావేశంలో ఆ దిశగా మరిన్ని చర్యలకు ఉపక్రమిస్తారని ఆశిద్దాం.

## బుచ్చి వ్యవసాయాధికారి హత్య కేసు

# ఇద్దరు నిందితుల అరెస్ట్



**నెల్లూరు క్రైమ్, జులై 12, ప్రభాతవార్త:** సంచలనం సృష్టించిన బుచ్చిరెడ్డిపాలెం మండల వ్యవసాయ అధికారి నరవాటి శ్రీహరి మృతి కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. ఇది కేవలం అనుమానాస్పద మృతి కాదని, పక్కా పథకం ప్రకారం జరిగిన హత్య అని నిర్ధారించిన పోలీసులు, ఈ కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే.. ఈ నెల 6న తన భర్త శ్రీహరి మృతిపై భార్య లావణ్య అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. వెంటనే స్పందించిన జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల సమగ్ర విచారణకు ఆదేశించారు. నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు నేతృత్వంలో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. విచారణలో భాగంగా గోగుమూడికి చెందిన సోంపల్లి భద్రం, రామతీర్థానికి చెందిన బుచ్చిగారి యానాదయ్యలను అదుపులోకి తీసుకుని విచారించగా, వారు నేరాన్ని అంగీకరించారు. వారిద్దరిని న్యాయ స్థానంలో హాజరుపరచగా, కోర్టు రిమాండ్ విధించింది.

**ప్రధాన నిందితుడు బావమరిదే:** ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న కుదుముల హరికృష్ణ మృతుడికి స్వయానా బావమరిది అని పోలీసుల దర్యాప్తులో తేలింది. హరికృష్ణ ప్రస్తుతం పరారీలో ఉన్నాడని, అతడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు విస్తృతంగా గాలిస్తున్నాయని రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు తెలిపారు. హత్యతో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల స్పష్టం చేశారు.

# మంట కలుస్తున్న మానవత్వం

- డబ్బుకోసం మృగాలుగా మారుతున్న మనుషులు
- శ్రీహరి మృతి హత్యగా తేలడం సంచలనం
- పోలీస్ అధికారే కేసును రూట్ మార్చాడన్న ఆరోపణలు

**బుచ్చి (నెల్లూరు), జులై 12 ప్రభాతవార్త:** బుచ్చిరెడ్డిపాళెం మండలం వ్యవసాయాధికారి శ్రీహరి మృతి మిస్టరీగా మారింది. శ్రీహరి మొదటిభార్య లావణ్య జిల్లా ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు విచారణ వేగవంతం చేస్తుండగా డొంక కదిలినట్లు అసలు వాస్తవాలు ఒక్కొక్కటి బయటకు వస్తున్నాయి. శ్రీహరి మృతి చెందిన రోజు సృగాలమైన మినగల్లులో అంత్యక్రియలు నిర్వహించే సమయంలో శ్రీహరి మెడపైన గాయాలు ఉండడంతో దానిని పలువురు ప్రశ్నించగా కుటుంబసభ్యులు దానిని దాట వేసి,హడావుడిగా దహన సంస్కారాలు చేశారు. అప్పటి నుండి ఈకేసు విషయంలో అందరికి అనుమానంగానే ఉంది.శ్రీహరి విషయంలో అనుమానాలు వ్యక్త పరుస్తున్నా పోలీసులు దీనిపైన సీరియస్‌గా తీసుకోకుండా వ్యవహరించడం పట్ల ప్రజలు తీవ్రంగా విమర్శలు చేశారు. ఓ పోలీస్ అధికారికి పెద్దమొత్తం ముడుపులు ముట్టజెప్పడంతో దాంతో ఏమి పట్టించుకోలేదని తెలుస్తొంది.

జిల్లా ఎస్పీ చొరవతో ఒక్కొక్క విషయం బయటకు వస్తుంది. జిల్లా ఎస్పీ చొరవతో పోలీసులు అనుమానితుడ్ని విచారించగా పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. బావమరిదే కుక్క ఇంజక్షన్ మూడు సార్లు చేసి వ్యవసాయాధికారి శ్రీహరిని హత్య చేసి గుండెపోటుగా చిత్రీకరించారని తెలుస్తొంది. సొంత బావమరిదే ఈ ఘటనకు పాలుపడితే ఇంక మానవత్వం ఎక్కడుందని పలువురు విస్తుపోతున్నారు. బావమరిది బ్రతకకోరతాడని పెద్దలు చెబుతుంటారు.కాని ఇక్కడ బావమరిదే హతమార్చడం,మృతి చెందిన రోజే పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం చేసి ఉంటే అప్పుడే వాస్తవాలు బయటపడేవని పలువురు విమర్శలు చేస్తున్నారు. వివాద రహితుడుగా మండలంలో మంచి పేరు తెచ్చుకున్న శ్రీహరిని ఇలా చేయడం దారుణమని పలువురు ఖండిస్తున్నారు. మొదటి భార్య చొరవతోనే అసలు విషయాలు బయటకు రావడం విశేషం.



# సిఆర్‌యస్‌లో భారీ అగ్నిప్రమాదం

**రేణిగుంట, జులై 12 ప్రభాతవార్త:** రేణిగుంట (తిరుపతి) సిఆర్‌ఎస్‌లో ఆదివారం మధ్యాహ్నం పెను అగ్నిప్రమాదం సంభవించింది. ఉవ్వెత్తున మంటలు ఎగసిపడటంతో స్థానికంగా ఉన్న ప్రజలు భయంతో పరుగులు తీశారు. అగ్ని ప్రమాదం ఎలా సంభవించిందనే విషయాన్ని అధికారులు బయటకు పొక్క నివ్వలేదు. సిఆర్‌ఎస్ ప్రాంగణంలో ఉన్న స్క్రాప్ అగ్నికి ఆహుతి అయిందంటున్నారు. ప్రమాదం ఎలా సంభవించిందో తెలియదు గానీ చిన్నగా రాజుకున్న మంటలు అంతకంతకు పెద్దవై భారీ ఎత్తున అగ్ని కీలలు ఎగిసి పడ్డాయి. ప్రాంగణంలో ఉన్న జామాయిల్ చెట్ల వరకు మంటలు వ్యాపించాయి. నల్లటి పొగలు ఆ ప్రాంతాన్ని చుట్టూ ముట్టాయి. ఫైర్ సర్వీస్ అధికారులు సిబ్బంది ప్రమాద స్థలానికి చేరుకొని మంటలను ఆర్పే ప్రయత్నాలు చేస్తున్నాయి. ఆదివారం సెలవు దినం కావడంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. అగ్నిమాపక యంత్రాలు పనిచేసినప్పటికీ రాత్రి వరకు మంటలు అదుపులోకి రాలేదు. ప్రహరీ గోడ బయట వైపు ఉన్న చెట్లు, కంపలు కూడా మంటలకు ఆహుతి అయ్యే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు.

# దుర్గమ్మ ఆలయంలో వేదోక్తంగా సూర్యఉపాసన



**ఇంద్రకీలాద్రి, జులై 12 ప్రభాతవార్త:** ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం సూర్యోపాసన సేవ వేదోక్తంగా నిర్వహించారు. లోక కళ్యాణార్థం మరియు భక్తుల క్షేమం కోసం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆలయ వేద పండితులందరూ శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ వేద పండితులు అరుణ పారాయణం, మహా సౌర పారాయణం, సూర్య అష్టోత్తర శతనామావళిని పఠిస్తూ సూర్య భగవానుడికి ప్రత్యేక అర్చనలు చేశారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లకు ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు.

సూర్యోపాసన అనంతరం కనకదుర్గమ్మ వారికి ప్రత్యేక హారతులు సమర్పించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సూర్యోపాసన వంటి ఆర్జిత సేవల్లో పాల్గొనాలనుకునే భక్తులు ముందస్తుగా అధికారిక మనమిత్ర వాట్సాప్ సేవలు ద్వారా లేదా దేవస్థానం కౌంటర్ల వద్ద టికెట్లు పొందవచ్చునని ఇఒ వికె శీనా నాయక్ తెలిపారు.

**భక్తుల విరాళం:** దుర్గమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న ఉచిత ప్రసాదము పంపిణీ పథకమునకు తిరుపతి జిల్లా పనగలూరుకు చెందిన జి.సుబ్రహ్మణ్యం రెడ్డి తమ కుటుంబీకులతో కలిసి రు.1,00,116ల విరాళాన్ని ఆదివారం ఆలయ డిఇఓ కిషోర్‌కుమార్‌కు అందించారు. మచిలీపట్నంకు చెందిన సిహెచ్ శ్రీలలిత కుటుంబ సభ్యులతో కలసి నిత్యాన్నదాన పథకమునకు రూ.1,00,000లు ఆలయాధికారి డివివి సత్యనారాయణకు అందచేశారు. దాతలకు అమ్మవార్ల దర్శనం కల్పించి, దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనం చేసి ప్రసాదము అమ్మవారి చిత్రపటము అందచేశారు.

**ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ:** దుర్గమ్మవారిని దర్శించుకోడానికి ఆదివారం సెలవురోజు కావడంతో భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం 9 గంటల నుంచే భక్తుల రాక విపరీతంగా పెరిగింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు డిఈవో కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది క్యూలైన్లు పర్యవేక్షణ చేయగా భక్తులకు కావలసిన అన్ని ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

సాధారణ భక్తులకు త్వరితగతిన దర్శనం కల్పించేందుకు అధికారులు ఉదయం 10.30 గంటల నుండి అంతరాలయ దర్శనాలను తాత్కాలికంగా నిలిపివేశారు. అలాగే ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు అన్ని రకాల వీఐపీ దర్శనాలను పూర్తిగా రద్దు చేశారు. దీనివల్ల క్యూ లైన్లలోని సామాన్య భక్తులకు అమ్మవారి దర్శనం అత్యంత వేగంగా, సులభంగా లభించింది. ఆలయ పరిసరాల్లో నిరంతరాయంగా ఉచిత ప్రసాదం, అన్నదానం విరివిగా పంపిణీ చేశారు.

**భక్తుల సేవలో పాలకమండలి, అధికారులు:** మధ్యాహ్నం 3 తర్వాత భక్తుల రద్దీ క్రమంగా తగ్గింది. ధర్మకర్తల మండలి సభ్యులతో స్వయంగా క్యూలైన్లలో పర్యటించి భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు. భక్తులతో కలిసి ఉంటూ వారి అవసరాలను అడిగి తెలుసుకున్నారు. మరోవైపు సిబ్బందితో క్యూ లైన్లను క్రమబద్ధీకరించేందుకు ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎప్పటికప్పుడు తగు ఆదేశాలు ఇస్తూ పాలకమండలి, అధికారుల సమన్వయం, కఠిన శ్రమ కారణంగా ఇంతటి భారీ రద్దీలోనూ భక్తులకు ఎక్కడా ఎటువంటి ఇబ్బంది కలగకుండా అమ్మ దర్శనం ప్రశాంతంగా జరిగింది.



**ఇంద్రకీలాద్రిపై వైభవంగా ధర్మపథం:** ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో భక్తులకు ఆధ్యాత్మిక భావనను పెంపొందించేలా నిర్వహిస్తున్న "ధర్మపథం" సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం జరిగిన నృత్య ప్రదర్శనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. విజయవాడకు చెందిన నత్యగాన శిక్ష బృందం అత్యంత ప్రతిభావంతంగా ఈ నృత్యార్చనను గావించారు. దుర్గమ్మ సన్నిధిలో శాస్త్రీయ నృత్య రీతులతో దేవతా మూర్తులను కీర్తిస్తూ చేసిన నృత్య ప్రదర్శనలు భక్తులను మంత్రముగ్ధులను చేశాయి. విఘ్నేశ్వరుని స్తుతిస్తూ చేసిన నర్తనగణపతం అమ్మవారి వైభవాన్ని చాటే అన్నపూర్ణే విశాలాక్షి, వచ్చెను అలమేలు మంగ, అన్నమయ్య సంకీర్తన ఒకపరి కొకపరి, నగుమోము, శివపంచాక్షరి, భో శంభో, పలుకే బంగారమాయెనా వంటి మొత్తం 12 విశిష్టమైన ఆధ్యాత్మిక అంశాలపై కళాకారులు అద్భుతంగా నృత్యం చేశారు. ప్రదర్శన ఇచ్చిన కళాకారులను ఆలయ అధికారులు ఘనంగా సత్కరించి, అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలను అందజేశారు.

**15 నుండి ఆషాఢమాస ఉత్సవాలు:** దుర్గమ్మవారిని తమ ఇంటి ఆడపడుచుగా భావిస్తూ ఆషాఢమాసంలో భక్తులు ఆరాధించే ఆషాఢమాస ఉత్సవాలు ఈనెల 15 నుండి ఆగస్టు 12 వరకు నిర్వహిస్తామని ఇఒ వికె శీనా నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ అమ్మవారికి ఆషాఢమాస సారెను పలు భక్తబృందాలు అందిస్తాయని, ఆషాఢమాస ఉత్సవాల్లో భక్తులు పాల్గొనాలన్నారు. దుర్గమ్మవారికి ఈనెల 15న మొదటి సారెను ఆలయ స్థానాచార్య విష్ణుబొట్ల శివప్రసాద్ నేతృత్వంలో అర్చకస్వాములు, పండితులు వైదిక బృందం సమర్పిస్తారన్నారు.

# షాబాద్ నిందితుని కోసం కొనసాగుతున్న గాలింపు

## షాద్‌నగర్ సమీపంలో నందిగామ వద్ద కారు స్వాధీనం

**హైదరాబాద్, జులై 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన షాబాద్‌లో ఆరు హత్యల కేసులో నిందితుడు రాజ్‌కుమార్ కోసం పోలీసుల వేట కొనసాగుతోంది. తనపై పోక్సో కేసు పెట్టి జైలుకు పంపినందుకు శుక్రవారం అర్ధరాత్రి సమయంలో బాలికతోపాటు ఆమె తల్లి, నానమ్మలను చంపిన నిందితుడు ఆ తరువాత తన భార్య సరితతోపాటు ఇద్దరు కొడుకులను కత్తితో పొడిచి హత్య చేయడం తెలిసిందే. ఈ ఘటన షాబాద్‌లో తీవ్రఉద్రిక్తతలకు దారితీయగా పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని శాంతిభద్రతలు అదుపు తప్పకుండా ఉండేందుకు అదనపు బలగాలను మొహరించారు. పోక్సో కేసులో నెలన్నరపాటు జైల్లో ఉండి శుక్రవారమే బెయిల్‌పై విడుదలైన రాజ్‌కుమార్ అనంతరం కారును సెల్ఫ్‌డ్రైవింగ్ పేరిట అద్దెకు తీసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. అనంతరం అదే కారులో అర్ధరాత్రి వరకు బయట తిరిగి చిత్తుగా మద్యం సేవించాడు. అనంతరం పక్కాగా వ్యవహరించి మొదట తనపై ఫిర్యాదు చేసిన మైనర్ బాలికను, ఆమె తల్లి, నానమ్మలను చంపాడు. ఈ ముగ్గురిని చంపడంతో ఆ కుటుంబంలో మిగిలిన మానసిక దివ్యాంగురాలు అనాథగా మారింది. దీని తరువాత కొంతదూరంలో వున్న తన ఇంటికి వెళ్లి భార్య, ఇద్దరు పిల్లలను చంపి కారులో పారిపోయాడు. ఇతని కోసం శని వారం అంతా గాలించినా ప్రయోజనం కలగలేదు. ఆరుగురిని చంపిన తరు వాత తాను కూడా ఆత్మహత్య చేసుకుంటున్నట్లు రాజ్‌కుమార్ తన తండ్రికి ఫోన్ చేశాడు. దీంతో అతను ఒకవేళ ఏదైనా రైలు కింద ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని భావించిన పోలీసులు ఆ దిశగా విచారణ చేబట్టగా సమీప గ్రాం తాల్లో గల రైలు పట్టాలపై ఎలాంటి మృతదేహం లభించలేదు. అటవీ గ్రాం తంలో ఏదైనా గుర్తుతెలియని శవం వుంటే వాకబు చేయాలని ఆయా గ్రాం తాల పోలీసులను కోరినా ఎక్కడా ఎలాంటి మృతదేహం కనపించలేదు. దీంతో నిందితుడు బతికే ఉన్నాడని, తప్పించుకుని పారిపోయాడని నిర్ధారణకు వచ్చిన పోలీసులు అతని కోసం గాలింపు చేబట్టారు. హత్యల సందర్భంగా అతను వాడిన కారును షాద్‌నగర్ సమీపంలో గల నందిగామ వద్ద బెంగ ళూరు జాతీయ రహదారిపై తిమ్మాపూర్ రైల్వేస్టేషన్‌కు సమీపంలో ఉండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనిని షాబాద్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఇతన్ని పట్టుకునేందుకు 12 ప్రత్యేక పోలీసు బృందాలను రంగంలో దించారు. నిందితుడి ఆచూకి చెప్పిన వారికి రెండు లక్షల రూపా యల రివార్డు ఇస్తామని ఫ్యూచర్ సిటీ కమిషనర్ తరుణ్‌జోషి ప్రకటించడం తెలిసిందే. మరోవైపు నిందితుడి ఫొటోను రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు పంపి బస్‌స్టేషన్లు, రైల్వేస్టేషన్లలో గాలింపు చేబట్టారు. రాజ్‌కుమార్ శ్రీశైలంకు పారిపోయి ఉండవచ్చని అనుమానాలు రావడంతో అక్కడికి ఓ బృందాన్ని పంపారు. హత్యలకు ముందు ఇతను వాడిన సెల్‌ఫోన్‌లోని సిమ్‌కార్డుల గురించి పోలీసులు ఆరా తీస్తున్నారు. ఇతని ఫోన్‌కాల్ డేటాను పరి శీలిస్తు న్నారు. ఈ కేసును కమిషనర్ తరుణ్ జోషితోపాటు చేవెళ్ల డిసిపి యోగేష్ గౌతం స్వయంగా విచారిస్తున్నారు.

## రాజ్‌కుమార్ చిక్కలేదు : చేవెళ్ల డిసిపి యోగేష్‌గౌతమ్

# పోలీసుల అదుపులో షాబాద్ నిందితుడు?

**చేవెళ్ల, జులై 12, ప్రభాతవార్త:** శనివారం రాత్రి షాబాద్‌లో జరిగిన ఆరు హత్యల నిందితుడు రాజ్‌కుమార్‌ను ఆదివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు ప్రచారమవుతోంది. ఆరుగురి దారుణ హత్యల ఉదంతం తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ మారణ హోమానికి ఒడిగట్టిన ప్రధాన నిందితుడు రాజ్‌కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కొత్తూరు మండలం కుమ్మరిగూడెం గ్రామానికి చెందిన బండారు సుధాకర్ తాను నిందితుడు రాజకుమార్‌ను ప్రత్యక్షంగా చూశానని వెల్లడించారు. ప్రత్యక్ష సాక్షి బండారు సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. నిందితుడు రాజ్‌కుమార్ తప్పించుకునే క్రమంలో కుమ్మరిగూడెం పరిసర ప్రాంతాల్లో తిరిగడని తెలిపారు. తాను రోడ్డుపై వెళ్తుండగా ఒక వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడని, పరిశీలించి చూడగా ఆరుగురిని చంపిన కిరాతకుడు రాజ్‌కుమార్ కావడంతో ఒక్కసారిగా షాక్‌కు గురయ్యానని బండారు సుధాకర్ తెలిపారు.. ఇంత దారుణానికి ఒడిగట్టి కూడా ఎలాంటి భయం లేకుండా తిరుగుతున్న అతడినిచూసి ఏం చేయాలో తెలియలేదని సుధాకర్ వెంటనే క్షణాల వ్యవధిలో చుట్టుముట్టిన పోలీసులు నిందితుడు రాజ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. వ్యూహాత్మకంగా వ్యవహరించిన పోలీసులు నిందితుడు రాజ్‌కుమార్ తప్పించుకునే అవకాశం ఇవ్వకుండా చుట్టుముట్టారని చెప్పారు. నిందితుడి కదలికలపై నిఘా ఉంచిన పోలీసులు క్షణాల వ్యవధిలోనే రంగంలోకి దిగి అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఆరు హత్యల కేసు నిందితుడు రాజ్‌కుమార్ పోలీసులకు చిక్కాడంటూ జరుగుతున్న ప్రచారంపై చేవెళ్ల డీసీపీ యోగేష్ గౌతం స్పందించారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ షాబాద్ ఆరు హత్యల కేసులో దర్యాప్తును వేగవంతం చేశామని తెలిఎపారు. నిందితుడి కోసం మొత్తం తొమ్మిది బృందాలతో గాలిస్తున్నామని. నిందితుడు చేగురు రైల్వే ట్రాక్ దాటి అడవి ప్రాంతంలోకి వెళ్లినట్లు అనుమానిస్తున్నామన్నారు. రాజ్‌కుమార్ తన మొబైల్ ఫోన్‌ను శుక్రవారం రాత్రి 11:47 స్విచ్ ఆఫ్ చేశాడు. అతడి కోసం రైల్వే పోలీస్, ట్రాకింగ్ టీమ్, హ్యూమన్ ఇన్వెస్టిగేషన్, టెక్నికల్ టీమ్స్‌తో 9 బృందాలు గాలిస్తున్నాయి. రాజ్ కుమార్ పోలీసులకు చిక్కినట్టు మీడియాలో వస్తున్న విషయం వాస్తవం కాదని స్పష్టం చేశారు.



# అమెరికాలో గూగుల్ సీనియర్ టెక్నాలజీ అధికారిణి హత్య

**అట్లాంటా, జులై 12:** అమెరికాలో భారత మూలాలున్న గూగుల్ సీనియర్ టెక్నాలజీ ఎగ్జిక్యూటివ్ షీతల్ వ్రెజ్సియన్ (57)ను ఆమె భర్త కాల్చిచంపాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో జరిగిన ఈ కాల్పుల ఘటనలో వారి కుమారుడు జాసన్ వ్రెజ్సియన్ కూడా గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అట్లాంటా సమీపంలోని కాబ్ కౌంటీలో ఈ ఘటన చోటుచేసుకుంది. నిందితుడు కిర్క్ బి. వ్రెజ్సియన్ (56)ను పోలీసులు మంగళవారం రాత్రి నివాసంలోనే అరెస్ట్ చేశారు. ప్రస్తుతం అతడిని కాబ్ కౌంటీ అడల్ట్ డిటెన్షన్ సెంటర్‌లో బెయిల్ లేకుండా నిర్బంధించారు. ఈ ఘటన కుటుంబ హింసకు సంబంధించినదిగా పోలీసులు పేర్కొన్నారు. దర్యాప్తు కొనసాగుతోందని, ప్రస్తుతం మరెవరిని అరెస్ట్ చేయలేదని తెలిపారు.

# 'బలవంతపు భూసేకరణ తగదు'

**విజయవాడ, జులై 12 ప్రభాతవార్త ప్రతినిధి:** రైతులపై పోలీసుల దౌర్జన్యాన్ని ఖండించిన సిపిఐ(యం) రైతులకు న్యాయంగా నష్టపరిహారం ఇవ్వాలి రాజధాని అమరావతిలోని ఉండవల్లిలో రెండున్నర ఎకరాలకు పైగా రైతుల భూమిని దౌర్జన్యంగా సేకరించడాన్ని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నది. వారంతా పేద రైతులు. భూమి తప్ప మరో దిక్కు లేదు. హైకోర్టు ఆర్డర్‌పై రైతులతో సామరస్యంగా చర్చలు జరిపి వారికి న్యాయంగా నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నది. పంటలను ధ్వంసం చేసి, రైతులపై దౌర్జన్యం చేసిన, మహిళలని చూడకుండా అవమాన కరంగా మాట్లాడిన, పోలీసు, రెవిన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని సిపిఐ(యం) డిమాండ్ చేస్తున్నది. ఉండవల్లిలో ఎకరం భూమి ఐదు నుండి ఏడు కోట్ల రూపాయలకు పైగా ఉండగా, ఎకరం విలువ కోటి 18 లక్షలుగా లెక్క గట్టి, రెండు కోట్ల 62 లక్షల రూపాయలకు అవార్డు ఇచ్చి, ఆగ మేఘాల మీద దౌర్జన్యంగా భూములు లాక్కోవటం అక్రమం. మహిళలతో సహా రైతులను నిర్బంధించి, చేతికొచ్చిన పంటను నాశనం చేసి బుల్డోజర్లతో అప్పటికప్పుడే రోడ్డు వేయడానికి ప్రయత్నించటం అన్యాయం. ప్రభుత్వం, సిఆర్‌డిఏ రైతులతో చర్చలు జరిపి న్యాయమైన పరిహారాన్ని రైతులకు చెల్లించి భూములు స్వాధీనం చేసుకుని రోడ్డు వేసుకోవటానికి అవకాశం ఉన్నప్పటికీ, దౌర్జన్య పూర్వకంగా వ్యవహరించడం గర్హనీయం. ఇప్పటికైనా రైతులతో చర్చలు జరిపి, వారికి మార్కెట్ విలువకు అనుగుణంగా న్యాయమైన పరిహారం చెల్లించాలి.

# చెరువులో పడి బాలుడు మృతి

## త్రిపురాంతకం మండలం గొల్లపల్లిలో విషాద ఛాయలు



**త్రిపురాంతకం, జులై 12 ప్రభాతవార్త:** మార్కాపురం జిల్లా త్రిపురాంతకం మండలంలోని గొల్లపల్లి గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. సరదాగా చెరువుకట్టపై విహరిస్తూ ప్రమాదవశాత్తు కాలు జారి సమ్మర్ స్టోరేజ్ (చెర్వు)లో పడి ఓ బాలుడు మృతి చెందాడు. ఈ ఘటనతో ఆగ్రహానికి గురైన కుటుంబ సభ్యులు, గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు.

మార్కాపురం జిల్లా త్రిపురాంతకం మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన ఉప్పలపాటి పిచ్చయ్య, జ్యోతి కుమారుడు తిరుమల బాబు (15) స్థానిక చెరువులో పడగా, చెరువు లోతుగా ఉండటం వలన నీటిలో మునిగిపోయాడు. సమాచారం అందుకున్న స్థానికులు వెంటనే చెరువులోకి దిగి బాలుడిని బయటకు తీసినప్పటికీ అప్పటికే అతను మృతి చెందినట్లు గుర్తించారు. బాలుడి మృతితో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన కుటుంబ సభ్యులు, గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. దీంతో కొంతసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వినుకొండ నుంచి శ్రీశైలం వెళ్తున్న ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర శాసన సభ చీఫ్ విప్, వినుకొండ నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే జివి ఆంజినేయులు సంఘటన స్థలం వద్ద ఆగి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడి బంధువులకు అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కలెక్టర్‌కు విషయం తెలిపి ప్రభుత్వం పరంగా ఆ కుటుంబానికి సహాయం చేస్తానని వారితో చెప్పి సంఘటన స్థలం నుండి వెళ్లారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# కురుబలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి

- కర్ణాటక మాజీ మంత్రి రేవన్న
- జబ్బల శ్రీనివాస్‌కు ఎమ్మెల్సీ పదవి కేటాయించాలని సమావేశ తీర్మానం

**తిరుపతి(హెల్త్), జులై 12, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ కురుబ కురుమ కురుబన్ కురువం అండ్ దంగల్ సంఘం ఆత్మీయ సమావేశం స్థానిక లీలా మహల్ సర్కిల్లోని సాయి ఎంజీఎం గార్డెన్‌లో జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథులుగా కర్ణాటక మాజీ ఎమ్మెల్సీ, మాజీ మంత్రి, ఐదు సూత్రల చైర్మన్ హెచ్‌ఎం రేవన్న, మహారాష్ట్ర రాజ్యసభ నూతన ఎంపీ రామ్ రావ్ జాఖరన్, కర్ణాటక, తెలంగాణ, నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రేవన్న మాట్లాడుతూ ఇంత వరకు ఆంధ్రప్రదేశ్లో ఎమ్మెల్సీలుగా కురుబలకు అవకాశం ఇవ్వలేదని, ఈ సారి తప్పకుండా రెండు ఎమ్మెల్సీలు, నామినేటెడ్ పోస్టులు, స్థానిక సంస్థల ఎన్నికలలో తగిన ప్రాతినిధ్యం కల్పించాలని, తిరుపతి పట్టణంలో ఐదు ఎకరాల భూమి, 5 కోట్ల నిధులు మంజూరు చేయాలని, కనక మండపం కనక హాస్టల్ మరియు కనక భవనం నిర్మాణం కోసం నిధులు కేటాయించాలని కోరారు. కురుబ కులం కోసం పోరాడుతున్న సౌత్ ఇండియా కురుబ సంఘం మరియు ఓబిసి సౌత్ ఇండియా అధ్యక్షులు జబ్బల శ్రీనివాసులుకి ఎమ్మెల్సీ పదవి కేటాయింపు కోసం సభ మొత్తం ఏకవాక్య తీర్మానం చేశారు.

జబ్బల శ్రీనివాసులకి ఎమ్మెల్సీ కేటాయింపుపై తొందరలోనే సౌత్ ఇండియా కురుబ సంఘం నాయకులు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని, టిడిపి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్‌ని కలిసి విన్నవించనున్నారని తెలిపారు.




మహారాష్ట్ర ఎంపి రామారావ్ మాట్లాడుతూ బిజెపి జాతీయ అధ్యక్షులు నితిన్ నవీన్‌ని, హోం మంత్రి అమిత్ షాని కలిసి ఎమ్మెల్సీగా జబ్బల శ్రీనివాసులుకి అవకాశం కల్పించాలని విన్నవించు నున్నానని తెలిపారు. సౌత్ ఇండియా కురుబ సంఘం అధ్యక్షులు జెబ్బల శ్రీనివాసులు మాట్లాడుతూ సౌత్ ఇండియా కురువ సంఘం ఆధ్వర్యంలో త్వరలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని కలిసి కుప్పంలో ఇచ్చిన హామీ ప్రకారం రెండు ఎంఎల్సి స్థానాలు కేటాయించాలని, ప్రతి గుడిలోనూ మెంబెర్స్‌గా, డైరెక్టర్లుగా అవకాశాలు కల్పించాలని, స్థానిక సంస్థలలో రాజకీయ ప్రాముఖ్యత ఇవ్వాలని, అలాగే కురువులకు నామినేటెడ్ పదవులు కేటాయించాలని, కురుబల అభివృద్ధి కోసం నిత్యం శ్రామిస్తున్న జబ్బల శ్రీనివాసులకి ఎమ్మెల్సీ పదవి కేటాయించాలని, తొందరలో నాయకులు అందరిని కలుపుకొని ముఖ్యమంత్రిని కలవనున్నారని తెలిపారు. అతిథులను సౌత్ ఇండియా కురువ సంఘం అధ్యక్షులు జబ్బల శ్రీనివాసులు ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో కర్ణాటకకు చెందిన షెఫర్డ్ ఇంటర్నేషనల్ సీఎం నాగరాజా, కర్ణాటక కురుబ సంఘం శ్రీకాంత్, తమిళనాడు కురువ సంఘం నారాయణ, తెలంగాణ కురుమ సంఘం వెంకట్, గోవా దంగల్ సమాజం కట్టన్న,సౌత్ ఇండియా ఉపాధ్యక్షులు కొల్లే రెడ్డి కుమార్ గౌడ్, కోటే రవిశంకర్, గుంటూరుకు చెందిన పరమేష్, ధనుంజయ్, సుబ్బయ్య, ఉమ్మడి చిత్తూరు జిల్లా కురుబ సంఘం మహిళా నాయకురాలు కొల్లే భాగ్యలక్ష్మి, లక్ష్మిదేవి, రాజకుమారి, మీనాక్షి, కామాక్షి, తదితరులు పాల్గొన్నారు.

# కారు ఢీకొని వ్యక్తి దుర్మరణం

**నెల్లూరు క్రైమ్, జులై 12, ప్రభాతవార్త:** నెల్లూరు రూరల్ మండలం, ఆకుతోట సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి ప్రాణాలు కోల్పోయారు. అతివేగంగా దూసుకొచ్చిన కారు, ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి బలంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం సంభవించింది. ఈ ఘటనపై నెల్లూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసులు తెలిపిన వివరాల మేరకు, నెల్లూరు సిటీ, జెండా వీధికి చెందిన షేక్ నవాజ్ (34) తన ద్విచక్ర వాహనంపై ఆదివారం తెల్లవారుజామున ఆసుపత్రిలో ఉన్న తన బిడ్డను చూసేందుకు బయలుదేరారు. అదే సమయంలో, నవాజ్ సోదరుడు షేక్ పర్వేజ్ తన స్నేహితుడితో కలిసి మరో మోటార్ సైకిల్ పై వెనుక వస్తున్నారు. ఆకుతోటలోని పిఎస్‌ఆర్ కల్యాణ మండపం, రాక్స్ బ్రూవరీ కిచెన్ ఎదురుగా, నెల్లూరు ముత్తుకూరు రోడ్డుపై నవాజ్ వెళ్తుండగా నెల్లూరు - ముత్తుకూరు వైపు నుండి అతివేగంగా, అజాగ్రత్తగా దూసుకొచ్చిన కారు నవాజ్ ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నవాజ్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు అతడిని ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలోనే మరణించారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ వాహనాన్ని అక్కడే వదిలేసి పరారయ్యాడు. సమాచారం అందుకున్న నెల్లూరు రూరల్ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. మృతుడి సోదరుడు షేక్ పర్వేజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు, కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి, పరారీలో ఉన్న నిందితుడి కోసం పోలీసులు గాలింపు చేపట్టారు.

## రాష్ట్రస్థాయి వైద్య విద్యార్థుల క్రికెట్ టోర్నమెంట్

# విజేతగా శ్రీవెంకటేశ్వర వైద్య కళాశాల విద్యార్థుల జట్టు

**తిరుపతి హెల్త్, జులై 12, ప్రభాతవార్త:** డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ పి చంద్రశేఖర్, ఎస్వీ వైద్య కళాశాల మైదానంలో రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్లను ఈ నెల 7న ప్రారంభించినారు. ఐదు రోజులుగా కొనసాగిన ఈ హోరాహూరిగా రాష్ట్రస్థాయి వైద్యకళాశాలలు, దంత కళాశాలలు, వైద్య విద్యార్థులు ఈ క్రికెట్ టోర్నమెంట్లో పాల్గొన్నారు. దాదాపు 48 జట్లు తిరుపతిలోని నాలుగు క్రికెట్ మైదానంలో క్రికెట్ క్రీడలు నిర్వహించిన, అదనపు వైద్య విద్య సంచాలకులు, ప్రిన్సిపాల్ డాక్టర్ జి రవి ప్రభు, ఈ క్రికెట్ మ్యాచ్లు ఆయన పర్యవేక్షణలో నిర్వహించారు. శనివారం సాయంత్రం జరిగిన ఫైనల్ మ్యాచ్ కర్నూల్ వైద్య కళాశాల వైద్య విద్యార్థులకు, ఎస్వీ వైద్య కళాశాల వైద్య విద్యార్థులకు హోరా హోరీగా జరిగిన మ్యాచ్ సాయంత్రం 6:30 గంటలకు ముగిసిన టోర్నమెంట్ మ్యాచ్, ఎస్‌వి వైద్య కళాశాల వైద్య విద్యార్థులు ఫైనల్ విజేతలుగా నిలిచారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా విచ్చేసిన డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయం రిజిస్టర్ డాక్టర్ టి.సాయి సుధీర్ మాట్లాడుతూ వైద్య విద్యార్థులకి ఇదొక ఆటవిడుపుగా ఉండాలే కాని, ఓడిన వారు గెలిచిన వారిని వేరువేరుగా చూడకూడదు ఇది డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం విజేతలుగా నిర్ణయించుకోవాలని ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు తెలిపారు. ఈ సందర్భంగా అదనపు వైద్య విద్య సంచాలకులు, డాక్టర్ జి రవి ప్రభు మాట్లాడుతూ ఫైనల్ విజేతగా నిలిచిన ఎస్‌వి వైద్య కళాశాల వైద్య విద్యార్థులకు కప్పులు, ప్రశంస పత్రాలు, గోల్డ్ మెడల్స్ అందించి, వారిని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్యం విశ్వావిద్యాలం రిజిస్టర్ డాక్టర్ టి. సాయి సుధీర్ ద్వారా వైద్య విద్యార్థులను సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసారు. రుయా ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ బి మనోహర్, డాక్టర్ తులసి రామ్, డాక్టర్ సురేష్ బాబు, డాక్టర్ వెంకట రమణ, డాక్టర్ రోజా రమణి, డాక్టర్ శ్రీనివాస్ యాదవ్, డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం క్రీడల విభాగం డాక్టర్ త్రిమూర్తులు, డాక్టర్ శరవణ, ఎస్ వి వైద్య కళాశాల వైద్య విద్యార్థులు, పిఆర్‌ఓ వీర కిరణ్ పాల్గొన్నారు.

# ఎక్స్‌ట్రా టైమ్‌లో అర్జెంటీనా క్లాస్

## స్విట్జర్లాండ్‌పై 3-1 తేడాతో విజయం * రెండో కప్ వేటలో సెమీస్



**కాన్సాస్ సిటీ, జులై 12 :** డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా వరుసగా రెండో కప్ వేటలో దూసుకుపోతోంది. అద్భుత ఆటతీరుతో సెమీఫైనల్ బెర్త్ ఖాయం చేసుకుంది. కాన్సాస్ సిటీ వేదికగా జరిగిన చివరి, నాలుగో క్వార్టర్‌ఫైనల్లో స్విట్జర్లాండ్‌పై 3-1 గోల్స్‌తో అద్భుత విజయం అందుకుంది. ఆరంభంలో వెనకబడ్డా, లియోనెల్ మెస్సి నేతృత్వంలోని అర్జెంటీనా అదనపు సమయంలో ఆధిపత్యాన్ని చాటుకుంది. సెమీఫైనల్ పోరులో ఇంగ్లాండ్‌తో అర్జెంటీనా తలపడనుంది.

నాలుగో క్వార్టర్ ఫైనల్ ఆరంభంలోనే అర్జెంటీనా ఆధిక్యం చాటింది. ప్రారంభం నుంచి అర్జెంటీనా దూకుడు కొనసాగించింది. పదే పదే స్విట్జర్లాండ్ గోల్ పోస్ట్‌పై దాడులకు దిగింది. ఇది పదో నిమిషంలో ఫలించింది. మాక్ అలిస్టర్ గోల్ కొట్టి అర్జెంటీనాకు ఆధిక్యాన్ని అందించాడు. తొలి అర్ధభాగం వరకు అర్జెంటీనా ఆధిపత్యంలో ఉన్నా మరో గోల్ సాధ్యం కాలేదు. మరోవైపు స్విట్జర్లాండ్‌కు లభించిన కొన్ని అవకాశాలను అర్జెంటీనా గోల్‌కీపర్ ఎమిలియానో మార్టినెజ్ సమర్థంగా అడ్డుకున్నాడు. రెండో అర్ధభాగంలో స్విట్జర్లాండ్ రక్షణాత్మక ఆటతీరుకు బదులు అటాకింగ్ గేమ్‌కు దిగింది. 67వ నిమిషంలో స్విస్ ప్లేయర్ డాన్ ఎండోయె, రికార్డో రోడ్రిగ్జ్‌తో చక్కటి సమన్వయం ప్రదర్శనతో గోల్ కొట్టి స్కోరు 1-1తో సమమైంది. ఈ గోల్‌తో మ్యాచ్ మరింత ఉత్కంఠకు చేరింది. 72వ నిమిషంలో స్విట్జర్లాండ్‌కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. బ్రీల్ ఎంబోలో సిమ్యులేషన్ కారణంగా రెండో పసుపు కార్డు అందుకుని మైదానం నుంచి బయటకు వెళ్లాడు. దీంతో స్విట్జర్లాండ్ 10 మంది ఆటగాళ్లతోనే మ్యాచ్ కొనసాగించాల్సి వచ్చింది. దీన్ని అడ్వాంటేజ్‌గా తీసుకుని అర్జెంటీనా వరుస అవకాశాలు సృష్టించుకున్నా ఫలితం లేకపోయింది. నిర్ణీత సమయంలో ఇరు జట్లు 1-1 గోల్స్‌తో సమంగా నిలిచింది.

అదనపు సమయంలో మాత్రం అర్జెంటీనా ఆధిపత్యం ప్రదర్శించింది. మ్యాచ్ స్వరూపాన్నే మార్చేసింది. ఏకంగా రెండు గోల్స్ సాధించింది. 112వ నిమిషంలో జూలియన్ అల్వారెజ్ దాదాపు 25 గజాల దూరం నుంచి అద్భుతమైన షాట్‌తో బంతిని నేరుగా గోల్‌పోస్ట్‌లోకి పంపించి అర్జెంటీనాకు 2-1 ఆధిక్యం అందించాడు. ఆ తర్వాత సమం చేయాలని స్విట్జర్లాండ్ ప్రయత్నించగా, చివరి నిమిషాల్లో లౌటారో మార్టినెజ్ రీబౌండ్‌ను గోల్‌గా మలిచి అర్జెంటానా ఆధిక్యాన్ని 3-1కు చేర్చాడు. డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో బరిలోకి దిగిన అర్జెంటీనా రెండో ప్రపంచ కప్ వేటలో మరో అడుగు వేసింది. ఈనెల 16న అట్లాంటాలో జరిగే రెండో సెమీఫైనల్‌లో ఇంగ్లాండ్‌తో తలపడనుంది.

### రిఫరీ నిర్ణయంపై స్విట్జర్లాండ్ ఫైర్

రిఫరీ నిర్ణయాలపై స్విట్జర్లాండ్ జట్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ముఖ్యంగా వీడియో అసిస్టెంట్ రిఫరీ జోక్యంతో ఫార్వర్డ్ బ్రీల్ ఎంబోలోకు రెండో ఎల్లో కార్డు చూపించడం మ్యాచ్ ఫలితాన్నే మార్చేసిందని స్విట్జర్లాండ్ ప్రధాన కోచ్ యురాత్ యూకిన్ విమర్శించారు. అదే తమ ఆటను పూర్తిగా దెబ్బతీసిందని వాపోయారు.

# లార్డ్స్ టెస్ట్‌లో గెలుపు దిశగా భారత్ ఉమన్స్




**లండన్, జులై 12:** లార్డ్స్‌లో జరుగుతున్న చారిత్రక టెస్ట్‌లో టీమిండియా అమ్మాయిలు పట్టు బిగించారు. బ్యాటింగ్‌లో, బౌలింగ్‌లో రాణిస్తూ గెలుపు దిశగా దూసుకుపోతున్నారు. మూడో రోజు ఆటముగిసే సరికి ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్‌లో 6 వికెట్ల నష్టానికి 130 రన్స్ చేయాలి. ఇంగ్లాండ్ గెలుపొందాలంటే 327 రన్స్ చేయాల్సి ఉంటుంది. భారత్ గెలుపుకు నాలుగు వికెట్లు పడగొడితే చాలు.

మూడో రోజు ఆటలోనే టీమిండియా అమ్మాయిలు జోరు చూపారు. ఒక వికెట్ నష్టానికి 154 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్... ఏడు వికెట్లకు 341 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఫస్ట్‌డౌన్ బ్యాట్స్‌విమెన్ యాష్టికా భాటియా సెంచరీతో మెరిసింది. 158 బంతుల్లో 14 ఫోర్లతో 113 పరుగులు సాధించింది. భాటియాకు టెస్ట్‌ల్లో ఇది తొలి సెంచరీ. లోయర్ ఆర్డర్‌లో రిచా ఘోష్(52 బంతుల్లో 50) మెరుపులు మెరిపించింది. అర్ధసెంచరీతో అజేయంగా నిలిచింది.

457 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ మొదలుపెట్టిన ఇంగ్లాండ్‌ను క్రాంతి మరోసారి దెబ్బతీసింది. ఆమెకు తోడుగా సయాలి, స్నేహ రాణా కూడా రెండేసి వికెట్లతో రాణించడంతో ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్‌లోనూ తడబడింది. ఓపెనర్లు బౌచెర్, టామీ సింగిల్ డిజిట్‌కు అవుట్ కాగా... అమీ జోన్స్ 52 పరుగులతో అజేయంగా నిలిచింది. దీంతో మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్‌లో 6 వికెట్ల నష్టానికి 130 రన్స్‌తో ఓటమి దిశలో కొనసాగుతోంది. మధ్యప్రదేశ్‌కు చెందిన క్రాంతి తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు, రెండో ఇన్నింగ్స్‌లో 2 వికెట్లు... ఇప్పటివరకు మొత్తం ఏడు వికెట్లు పడగొట్టింది. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 285 రన్స్ చేయగా, ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 170 రన్స్‌కు ఆలౌటైంది.

# బెల్లింగ్‌హామ్ డబుల్ సెమీస్‌లో ఇంగ్లాండ్





**మియామి, జులై 12:** నార్వే ఆశలకు చెక్ పెడుతూ ఇంగ్లాండ్..సాకర్ ప్రపంచకప్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. మియామిలో జరిగిన మూడో క్వార్టర్ ఫైనల్లో ఇంగ్లాండ్ 2-1 గోల్స్ తేడాతో నార్వేపై విజయం సాధించింది. ఇంగ్లాండ్ స్టార్ మిడ్‌ఫీల్డర్ జూడ్ బెల్లింగ్‌హామ్ అద్భుతమైన డబుల్ గోల్స్‌తో చెలరేగాడు. ఎక్స్‌ట్రా టైమ్‌లో చేసిన గోల్‌తో ఇంగ్లాండ్ సెమీస్ బెర్త్ ఖాయం చేసుకుంది.

మ్యాచ్ ప్రారంభం నుంచే నార్వే జట్టు ఇంగ్లాండ్‌పై తీవ్ర ఒత్తిడి పెంచింది. నార్వే స్టార్ స్ట్రైకర్ ఎర్లింగ్ హాలాండ్ మ్యాచ్ ఆరంభంలోనే ఇంగ్లాండ్ గోల్‌కీపర్ జోర్డాన్ పిక్‌ఫోర్డ్‌ను తన పవర్‌ఫుల్ హెడ్డర్‌తో గోల్ చేసినంత పనిచేశాడు. ఆ తర్వాత కూడా ఇంగ్లాండ్ డిఫెన్స్‌ను ఇబ్బంది పెడుతూ నార్వేఆటగాళ్లు వరుసగా ఇంగ్లాండ్ గోల్ పోస్ట్‌పై దాడులు చేశారు. ఈక్రమంలో 36వ నిమిషంలో ఆండ్రియాస్ షెల్డెరుప్‌కు లభించిన పాస్‌ను గోల్ పోస్ట్‌లోకి పంపి నార్వేకు 1-0 ఆధిక్యం అందించాడు. ఈఆనందం నార్వేకు ఎక్కువ సేపు నిలవలేదు. ఫస్టాఫ్ ముగియడానికి కొన్ని నిమిషాల ముందు ఇంగ్లాండ్ పుంజుకుంది. రియల్ మాడ్రిడ్ స్టార్ జూడ్ బెల్లింగ్‌హామ్ మైదానం మధ్య నుంచి బంతిని మెరుపు వేగంతో ముందుకు తీసుకెళ్లి గోల్ సాధించాడు. దీంతో స్కోరు 1-1తో సమమైంది.

### రివ్యూలో నార్వేకు షాక్

రెండో అర్ధ భాగంలో ఇరు జట్లు గోల్ కోసం తీవ్రంగా శ్రమించాయి. 60వ నిమిషంలో నార్వే ఆటగాడు తోర్బ్‌జోర్న్ హెగ్గెమ్ బంతిని గోల్ పోస్ట్‌లోకి పంపాడు. ఈ గోల్‌పై ఇంగ్లాండ్ ఆటగాళ్లు రెఫరీ రివ్యూ కోరారు. ఈ రివ్యూలో, గోల్ చేసే క్రమంలో నార్వే స్టార్ హాలాండ్, ఇంగ్లాండ్ ఆటగాడు ఇలియట్ ఆండర్సన్‌పై ఫౌల్ చేసినట్లు స్పష్టమైంది. దీంతో ఆగోల్‌ను రెఫరీ రద్దు చేశారు. ఈ క్రమంలో నిర్ణీత 90 నిమిషాల సమయం ముగిసేసరికి ఇరు జట్లు 1-1తో సమంగా నిలవడంతో మ్యాచ్ ఫలితం కోసం ఎక్స్‌ట్రా టైమ్ కేటాయించారు.

### బెల్లింగ్‌హామ్ డబుల్

ఎక్స్‌ట్రా టైమ్‌లో సబ్‌స్టిట్యూట్‌గా వచ్చిన ఇంగ్లాండ్ ప్లేయర్ మోర్గాన్ రోజర్స్ బాక్స్ వెలుపల నుంచి ఒక పవర్‌ఫుల్ షాట్ కొట్టాడు. నార్వే కీపర్ నైలాండ్ ఆ బంతిని సరిగ్గా నియంత్రించలేకపోయాడు. అక్కడే సిద్ధంగా ఉన్న బెల్లింగ్‌హామ్ ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఆ బంతిని అతి సమీపం నుంచి గోల్ పోస్ట్‌లోకి పంపి ఇంగ్లాండ్‌కు 2-1తో తిరుగులేని విజయాన్ని అందించాడు. దీంతో ఇంగ్లాండ్ సెమీస్‌లోకి దూసుకెళ్లింది. మ్యాచ్‌లో రెండు కీలక గోల్స్ చేసి జట్టును సెమీస్‌కు చేర్చిన జూడ్ బెల్లింగ్‌హామ్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. ఈ ప్రపంచ కప్‌లో బెల్లింగ్‌హామ్, కెప్టెన్ హ్యారీ కేన్ చెరో 6 గోల్స్ సాధించారు. ఈ ఓటమితో నార్వే జట్టు ప్రపంచకప్ ప్రస్థానం ముగిసింది.

ఇక ఇంగ్లాండ్ జట్టు జులై 15న అట్లాంటా స్టేడియంలో జరగబోయే హైవోల్టేజ్ సెమీఫైనల్ మ్యాచ్‌లో అర్జెంటీనాతో తలపడనుంది.

## ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్‌కు రెండు మార్పులతో టీమిండియా

**ముంబై, జులై 12:** ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్, జింబాబ్వేతో టీ20 సిరీస్‌ను టీమ్‌ఇండియాలో బీసీసీఐ రెండు మార్పులు చేసింది. గాయంపడ్డ హర్షిత్ రాణా, వరుణ్ చక్రవర్తి స్థానంలో ప్రిన్స్ యాదవ్, రవి బిష్ణోయ్‌కు అవకాశం కల్పించింది. ప్రస్తుతం ఈ ఇద్దరు ఇంగ్లాండ్‌లోనే టీ20 జట్టుతో ఉన్నారు. ఇంగ్లాండ్‌తో వన్డేలకు ప్రిన్స్ యాదవ్.. జింబాబ్వేతో టీ20 సిరీస్‌కు స్క్వాడ్ లోకి రవి బిష్ణోయ్ వచ్చారు. ఇంగ్లాండ్‌తో మూడో టీ20 సందర్భంగా హర్షిత్ రాణా కుడి తొడ కండరం సమస్యతో బాధపడ్డాడు. అలాగే వరుణ్ చక్రవర్తి కూడా గాయంతో ఔటయ్యాడు.

మంగళవారం నుంచి ఇంగ్లాండ్‌తో మూడు వన్డేల సిరీస్ మొదలుకానుంది. తొలి వన్డే జులై 14న ఎడ్జ్‌బాస్టన్‌లో, రెండో వన్డే జులై 16న సోఫియా గార్డెన్స్‌లో, మూడో వన్డే19న లార్డ్‌లో జరగనుంది. ఆ తర్వాత టీమిండియా జింబాబ్వేలో పర్యటిస్తుది. జింబాబ్వేతో మూడు టీ20ల సిరీస్ ఆడనుది. జులై 23న తొలి టీ20, 25న రెండో టీ20, 26న మూడో టీ20 జరగనుంది. ఈ మ్యాచ్‌లన్నీన హరారే వేదికగా జరుగుతాయి.

స్కాట్లాండ్, ఇంగ్లాండ్‌లతో టీ20 సిరీస్‌లను కోల్పోయిన టీమిండియా.. శుభ్‌మన్ గిల్ నేతృత్వంలో వన్డేలకు సిద్ధమైంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ జట్టులో చేరడంతో టీమిడియా బ్యాటింగ్‌లో పటిష్టంగా మారనుంది.

# విదేశీ పెట్టుబడుల జోరు: భారత్‌కు 7బిలియన్ డాలర్ల ఎఫ్‌ఐఐ నిధులు

**న్యూఢిల్లీ,జులై 12:** విదేశీ పెట్టుబడులను ప్రోత్సహిస్తూ, భారత్ రూపాయి మరింత బలపడే విధంగా రిజర్వుబ్యాంకు చేపట్టిన కార్యాచరణ వల్ల భారత్‌కు ఇప్పటివరకు 7 బిలియన్ డాలర్ల విదేశీ సంస్థాగత పెట్టుబడులు వచ్చినట్లు ఎస్‌బీఐ రీసెర్చ్ వెల్లడించింది. ఈ ఏడాది మే 20న అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ రూ.96.8 వద్ద కనిష్ట స్థాయికి చేరగా, జూన్ నెలాఖరు నాటికి దాదాపు 2.2 శాతం మేర పుంజుకుని రూపాయి బలపడింది. మధ్యప్రాచ్య ఉద్రిక్తతలకారణంగా ముడిచమురు ధరలు పెరగడంతో విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం, రూపాయికి మద్దతు కల్పించడం లక్ష్యంగా గత నెల కేంద్ర ప్రభుత్వం, ఆర్‌బీఐ పలు కీలక నిర్ణయాలు తీసుకున్నాయి.

ఇందులో సావరిన్ బాండ్లపై ఎఫ్‌ఐఐలు, ఎఫ్‌పీఐలకు పన్ను మినహాయింపు, ఎఫ్‌సీఎన్ఆర్(బి) డిపాజిట్లకు హెడ్జింగ్ వ్యయంపై సబ్సిడీ, ప్రభుత్వ రంగ సంస్థల రుణాల కోసం రాయితీ డాలర్ స్వాప్ విండో వంటి చర్యలు ఉన్నాయి. తాజా భౌగోళిక రాజకీయ పరిణామాలు మరోసారి రూపాయిపై ఒత్తిడిని పెంచాయి. అమెరికా అధ్యక్షుడు అమెరికాఇరాన్ కాల్పుల విరమణ ముగిసినట్లు ప్రకటించడంతో బ్రెంట్ క్రూడ్ ధరలు మళ్లీ పెరగగా, రూపాయి విలువ కూడా 0.4 శాతం మేర క్షీణించింది. భారత ఆర్థిక వ్యవస్థపై దీర్ఘకాలిక దృక్పథం సానుకూలంగానే ఉందని ఎస్‌బీఐ రీసెర్చ్ అభిప్రాయపడింది.




సగటు ముడిచమురు ధర బ్యారెల్‌కు 80 డాలర్లలోపు ఉండే అవకాశముండటంతో, గతంలో చమురు ధరలు బ్యారెల్‌కు 130 డాలర్లు దాటినప్పుడు చేసిన అంచనాలతో పోలిస్తే, దేశానికి చమురు దిగుమతి బిల్లులో 30 నుంచి 35 బిలియన్ డాలర్ల వరకు ఆదా అయ్యే అవకాశం ఉందని పేర్కొంది. ఇదిలా ఉండగా, జూన్ 30తో ముగిసిన పక్షంలో బ్యాంకింగ్ వ్యవస్థలో డిపాజిట్లు సుమారు రూ.7 లక్షల కోట్లు పెరిగాయి. గత 29 ఏళ్లలో ఇది మూడో అతిపెద్ద పక్షవారపు వృద్ధిగా ఎస్‌బీఐ రీసెర్చ్ పేర్కొంది. ప్రధానంగా ఎఫ్‌సీఎన్ఆర్(బి) డిపాజిట్లు, పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు, బాహ్య వాణిజ్య రుణాలు (నిదితీలు) కారణమని, మొత్తం పెట్టుబడుల రాక సుమారు 15 బిలియన్ డాలర్లుగా అంచనా వేసింది. ఆర్‌బీఐ విదేశీ మారక నిల్వలు 4.4 బిలియన్ డాలర్లు పెరిగాయి. జూన్ నెలలో సీపీ జారీలు గత 55 నెలల్లో అత్యధిక స్థాయికి చేరగా, తొలి త్రైమాసికంలో బ్యాంకుల అదనపు రుణాల పరిమాణం రూ.5.6 లక్షల కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే కాలంలో ఇది రూ.2.4లక్షల కోట్లు మాత్రమే ఉంది. అధిక స్థాయిలో కమర్షియల్ పేపర్లు జారీ చేసిన రంగాల్లోనే బ్యాంకు రుణాల వృద్ధి కూడా బలంగా నమోదైందని ఎస్‌బీఐ రీసెర్చ్ తెలిపింది. ముఖ్యంగా జూన్ 30తో ముగిసిన పక్షంలో రికార్డు స్థాయిలో రూ.7 లక్షల కోట్ల డిపాజిట్లు పెరగడం వల్ల బ్యాంకింగ్ వ్యవస్థలో ద్రవ్య లభ్యత సౌకర్యవంతంగా మారుతుందనిఎస్‌బీఐ రీసెర్చ్ పేర్కొంది.

## రెండు కంపెనీల్లో నారాయణమూర్తి వాటా



**బెంగళూరు, జులై 12:**ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి చెందిన క్యాటమరన్ వెంచర్స్ తాజాగా మరో రెండు కంపెనీల్లో పెట్టుబడి పెట్టింది. ఇందులో టీడీ పవర్ సిస్టమ్స్, వర్ధమాన్ స్పెషల్ స్టీల్స్ కంపెనీలు ఉన్నాయి. టీడీ పవర్ సిస్టమ్స్‌లో 1.46శాతం వాటా కొనుగోలు చేసింది. ఇందుకు గానూ రూ.262 కోట్ల పెట్టుబడి పెట్టింది. వర్ధమాన్ స్పెషల్ స్టీల్స్‌లో 1.02శాతం వాటాను రూ.28 కోట్లతో కొనుగోలుచేసింది. టీడీ పవర్ సిస్టమ్స్ 1999లో స్థాపించారు. ఇది బెంగళూరుకు చెందిన ఏసీ జనరేటర్లు, ఎలక్ట్రిక్ మోటార్ల తయారీ కంపెనీ. కంపెనీలో తయారు చేసిన యంత్రాలను ప్రపంచవ్యాప్తంగా ఉన్న స్టీమ్, గ్యాస్, హైడ్రో, విండ్, డీజిల్ పవర్ ప్లాంట్లలో వాడుతున్నారు. 17,969 కోట్ల మార్కెట్ క్యాప్‌తో ఈ కంపెనీ 100కు పైగా దేశాలకు ఎగుమతి యంత్రాలను చేస్తుంది. రూ.1000 కోట్ల రిజర్వు నిధి ఉంది. 2026 ఆర్థిక సంవత్సరంలో అమ్మకాలు దాదాపు 45 శాతం పెరిగాయి. నికర లాభం రూ. 239 కోట్లకు పెరిగింది. మార్జిన్లు కూడా డబుల్ డిజిట్ చేరుకున్నాయి. ప్రస్తుతం మార్జిన్లు 18 శాతానికి పెరిగాయి. ఈక్విటీపై రాబడి 25 శాతానికి దగ్గరలో ఉంది. కొత్త విద్యుత్ ప్రాజెక్టులు, ఉక్కు పరిశ్రమ, విస్తృత ఫ్యాక్టరీ నిర్మాణ కారణంగా పెద్ద జనరేటర్లకు బలమైన డిమాండ్ వచ్చింది. గత సంవత్సరంలో ఈ స్టాక్ విలువ రెట్టింపు కంటే ఎక్కువ పెరిగింది. 2021 జూలైలో టీడీ పవర్ షేరు ధర దాదాపు రూ. 40 ఉండగా అది 2026 జూలై 10 నాటికి అది రూ. 1,150కి చేరింది. అంటే 5 సంవత్సరాలలో ఇది 2,775 పెరిగింది. ప్రస్తుతం పీఈ రేషియో 75 గా ఉంది.

# టాప్-4 కంపెనీల్లో 93వేల కోట్ల ఎంక్యాప్ పెరుగుదల



**ముంబై,జులై 12:** దేశంలోని అత్యధిక మార్కెట్ విలువ కలిగిన టాప్ 10 కంపెనీల్లో నాలుగు సంస్థల మూలధన మార్కెట్ విలువలు గత వారం రూ.92,995.48 కోట్లు పెరిగాయి. ఇందులో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మరియు భారతి ఎయిర్‌టెల్ అత్యధిక లాభాలు నమోదు చేసి అగ్రస్థానంలో నిలిచాయి. గత వారం టాప్-10 కంపెనీల్లో రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, ఎల్ఐసీ మార్కెట్ విలువలు పెరగగా, ఐసీఐసీఐ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), బజాజ్ ఫైనాన్స్, లార్సెన్ అండ్ టుబ్రో (ఎల్అండ్‌టీ), హిందుస్తాన్ యూనిలీవర్ సంస్థల మార్కెట్ విలువ కలిపి రూ.49,294.13 కోట్లు తగ్గింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మార్కెట్ విలువ రూ.35,808.09 కోట్లు పెరిగి రూ.12,69,454.42 కోట్లకు చేరగా, ఇది టాప్10 కంపెనీల్లో అత్యధిక పెరుగుదలగా నిలిచింది. భారతి ఎయిర్‌టెల్ మార్కెట్ విలువ రూ.34,896.92 కోట్లు పెరిగి రూ.11,98,774.22 కోట్లకు చేరింది. ఎల్ఐసీ మార్కెట్ విలువ 16,065.50కోట్లు పెరిగి రూ.5,60,205.05 కోట్లకు చేరగా, రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ విలువ రూ.6,224.97 కోట్లు పెరిగి రూ.17,71,206.33 కోట్లకు చేరుకుంది.

మరోవైపు, హిందుస్తాన్ యూనిలీవర్ మార్కెట్ విలువ రూ.12,088.65 కోట్లు తగ్గి రూ.5,04,997.65 కోట్లకు పడిపోయింది. లార్సెన్ అండ్ టుబ్రో మార్కెట్ విలువ 11,040.23కోట్లు క్షీణించి రూ.5,42,938.40 కోట్లకు చేరగా, టీసీఎస్ మార్కెట్ విలువ రూ.8,574.87 కోట్లు తగ్గి రూ.7,48,600.40 కోట్లకు చేరింది. బజాజ్ ఫైనాన్స్ మార్కెట్ విలువ రూ.7,813.58 కోట్లు తగ్గి రూ.6,35,327.78 కోట్లకు చేరింది. ఐసీఐసీఐ బ్యాంక్ మార్కెట్ విలువ 6,315.32 కోట్లు తగ్గి రూ.10,05,379.71 కోట్లకు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్కెట్ విలువ రూ.3,461.48 కోట్లు తగ్గి రూ.9,56,430.44 కోట్లకు పరిమితమైంది. మార్కెట్ విలువ పరంగా రిలయన్స్ ఇండస్ట్రీస్ అగ్రస్థానాన్ని కొనసాగించగా, ఆ తర్వాత వరుసగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టీసీఎస్, బజాజ్ ఫైనాన్స్, ఎల్ఐసీ, లార్సెన్ అండ్ టుబ్రో, హిందుస్తాన్ యూనిలీవర్ సంస్థలు నిలిచాయి.

# బ్యాంకుల్లో 265 లక్షల కోట్ల డిపాజిట్లు



**ముంబయి,జులై 12:** దేశంలోని వాణిజ్య బ్యాంకుల్లో ఉన్న మొత్తం డిపాజిట్లు రూ.265.4 లక్షల కోట్లకు పెరిగాయి. టైమ్ డిపాజిట్లు, టర్మ్ డిపాజిట్లు రెండింటిలోనూ పెరుగుదల నమోదు చేసింది. గత రెండు వారాల వ్యవధిలోనే వ్యవస్థలో సుమారు రూ. 7 లక్షల కోట్లు మేర పెరుగుదల నమోదైంది. ఈ తాజా పెరుగుదలతో 2026-27 ఆర్థిక సంవత్సరంలో మొదటి త్రైమాసికానికి డిపాజిట్ల వృద్ధి రేటు 13.3 కి పెరిగింది. 29 ఏళ్లలో ఇది మూడో అత్యధిక వృద్ధి. ఇది ఏడాది క్రితం 10.1 శాతంగా ఉంది. రెండు వారాల వ్యవధిలో ఈ పెరుగుదల ఉన్నప్పటికీ డిపాజిట్ల వృద్ధి రేటు రుణాల వృద్ధి రేటు కంటే తక్కువగా ఉంది. గతనెలాఖరునాటికి బ్యాంక్ రుణాలు రూ. 219.3 లక్షల కోట్లుగా ఉన్నాయి.

ఈ రెండు వారాల కాలంలో రుణాలు రూ. 3.8 లక్షల కోట్లకు పెరిగాయి. వార్షికంగా రుణాల వృద్ధి రేటు 18.6 శాతంగా నమోదు అయింది. మొదటి మూడు నెలల్లో నమోదైన వృద్ధి ఆ రెండు వారాల వృద్ధి కంటే తక్కువగా ఉంది. విదేశీ నిధుల రాబట్టడానికి, రూపాయి విలువను బలోపేతం చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దీంతో భారత్ కు 7 బిలియన్ డాలర్ల విదేశీ సంస్థాగత పెట్టుబడులు వచ్చాయిని ఎస్బీఐ చీఫ్ ఎకనామిస్ట్ సౌమ్య కాంతి ఘోష్ తెలిపారు. ఆ సంఖ్య 15 బిలియన్ డాలర్లుగా ఉండవచ్చని తెలుస్తోంది. డిపాజిట్ల వృద్ధి కంటే రుణాల వృద్ధి ఎక్కువగా కొనసాగుతుండటంతో ప్రధానంగా ప్రభుత్వ సెక్యూరిటీలలో ఉండే తమ పెట్టుబడుల విషయంలో బ్యాంకులు నెమ్మదిగా వ్యవహరిస్తున్నాయి. మొదటి త్రైమాసికం ముగిసే సమయానికి బ్యాంకుల పెట్టుబడులు రూ. 70.9 లక్షల కోట్లుగా నమోదయ్యాయి.

ఇక డెట్ ఎఫ్ఏఆర్ నిధుల విలువలు 2.7 బిలియన్ డాలర్లకు పెరిగింది. గత ఏడాది రూ.2.4 లక్షల కోట్లుగా ఉన్న బ్యాంక్ క్రెడిట్ ఈ ఏడాది 5.6 లక్షల కోట్లకు పెరిగింది. ఈ భారీ డిపాజిట్ల వల్ల బ్యాంకుల్లో లిక్విడిటీ మరింత మెరుగయ్యే అవకాశం ఉంది. బ్యాంకులు ఎక్కువగా హోం లోన్, బంగారంపై లోన్లు ఇస్తున్నాయి. దేశంలో బంగారంపై రుణాలు క్రమంగా పెరుగుతున్నాయి. బంగారం ధర పెరుగడం కూడా ఇందుకు కారణంగా చెబుతున్నారు. 2026 ఆర్థిక సంవత్సరంలో బంగారం రుణాలు దాదాపు 84 శాతం పెరిగాయి. బంగారం ధర పెరగడం వల్ల రుణం కూడా ఎక్కువ వస్తున్న తరుణంలో చాలా మంది బంగారం తాకట్టు పెట్టి లోన్లు తీసుకుంటున్నారు.

## ఐదేళ్లకే పెన్నీస్టాక్ క్యూపిడ్ షేర్ అనూహ్య రాబడి

**ముంబయి,జులై 12:**ఐదేళ్ల క్రితం కేవలం ఒక సాధారణ పెన్నీ స్టాక్స్‌గా ఉన్న హెల్త్ కేర్ ప్రొడక్ట్స్ కంపెనీ క్యూపిడ్ షేర్లు ఇపుడు దూసుకెళుతున్నాయి. మార్కెట్లో ఒడుదొడుకులు ఉన్నా ఈ స్మాల్ క్యాప్ స్టాక్ తన ఇన్వెస్టర్లకు లాభాలు కురిపించింది. లక్ష రూపాయల పెట్టుబడి ఐదేళ్లలోనే రూ. 87 లక్షలు చేసింది. ఐదేళ్లక్రితం ఎన్ఎస్ఈలో ఈ స్టాక్ కేవలం రూ.2.45స్థాయిలో ట్రేడయింది. ప్రస్తుతం క్యూపిడ్ లిమిటెడ్ షేరు ధర రూ.213 స్థాయికి చేరుకుంది. గత 5 సంవత్సరాల కాలంలో ఈ స్టాక్ ఏకంగా 8600 శాతం పైగా అద్భుతమైన వృద్ధిని నమోదు చేసింది. ఎవరైనా ఒక ఇన్వెస్టర్ ఐదేళ్ల క్రితం ఈ షేరుపై రూ.1 లక్ష ఇన్వెస్ట్ చేసి అలాగే ఉంచుకుని ఉంటే నేడు దాని విలువ ఏకగా రూ. 87 లక్షలకు చేరి ఉంటుంది. కేవలం ఏడాది క్రితం పెట్టిన రూ.1 లక్ష విలువ కూడా ఇప్పుడు రూ. 8.40 లక్షలుగా మారడం గమనార్హం. కంపెనీ త్వరలోనే ప్రకటించబోయే తొలిత్రైమాసిక ఆదాయం రికార్డ్ స్థాయిలో రూ.150 కోట్లు దాటుతుందని అంచనా. పూర్తి ఆర్థిక సంవత్సరానికి రెవెన్యూ గైడెన్స్ 10 శాతం నుంచి రూ. 660 కోట్లుగా కంపెనీ మేనేజ్మెంట్ సవరించింది. ప్రపంచ వ్యాప్తంగా ప్రభుత్వ టెండర్లు, హెల్త్ కేర్ ప్రొక్యూర్మెంట్ సంస్థలతో కుదుర్చుకున్న వ్యూహాత్మక ఒప్పందాలు కంపెనీ ఆర్డర్ బుక్ ను బలోపేతం చేశాయి. క్యూపిడ్ లిమిటెడ్ షేరు ధర చివరి ట్రేడింగ్ సెషన్లో 1.41 శాతం లాభంతో ముగిసిం

# వారాంతంలో స్వల్ప నష్టాలతో ముగిసిన సూచీలు



**ముంబై, జులై 12:** భారతీయ స్టాక్ మార్కెట్ వరుసగా నాలుగు వారాల లాభాల పరంపరకు ముగింపు పలికిన నేపథ్యంలో, వచ్చే వారం మార్కెట్ దిశను నిర్ణయించే కీలక అంశాలపై పెట్టుబడిదారులు దృష్టి సారించారు. తొలి త్రైమాసికం కంపెనీల ఆర్థిక ఫలితాలు, అంతర్జాతీయ ముడి చమురుధరల కదలికలు, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల నిధులరాక, పశ్చిమాసియా పరిణామాలు మార్కెట్‌ను ప్రభావితం చేసే ప్రధాన అంశాలుగా నిలవనున్నాయి. పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తపరిస్థితులు నెలకొనడం, ముడి చమురు ధరలు పెరగడం వల్ల పెట్టుబడిదారుల సెంటిమెంట్ దెబ్బతినడంతో బెంచ్‌మార్క్ సూచీలు వారాంతంలో స్వల్ప నష్టాలతో ముగిశాయి. వారంలోని చివరి రెండు ట్రేడింగ్ సెషన్లలో ప్రపంచ మార్కెట్ల ఆందోళనలు కొంత తగ్గడం, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) అంచనాలకు మించిన ఆర్థిక ఫలితాలు ప్రకటించడం వల్ల మార్కెట్ బలంగా కోలుకుని నష్టాలను గణనీయంగా తగ్గించుకుంది. వారాంతానికి బీఎస్ఈ సెన్సెక్స్ 0.25 శాతం క్షీణించి 77,569.39 వద్ద ముగియగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 0.26 శాతం తగ్గి 24,206.90 వద్ద స్థిరపడింది. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు ఒక్కోటి ఒక శాతానికి పైగా లాభపడడం గమనార్హం. జూన్ త్రైమాసిక ఫలితాల సీజన్ టీసీఎస్ మెరుగైన ఫలితాలతో సానుకూలంగా ప్రారంభమైన నేపథ్యంలో, వచ్చే రోజుల్లో ప్రధాన కంపెనీలు ప్రకటించే ఆర్థిక ఫలితాలపై ట్రేడర్ల దృష్టి కేంద్రీకృతం కానుంది. ఈ ఫలితాలే ఈవారంలో మార్కెట్ దిశను నిర్దేశిస్తాయని నిపుణుల అంచనా. అమెరికా తాజాగా ఇరాన్‌పై జరిపినదాడులతోప్రాంతీయ స్థిరత్వంపై, ప్రపంచ ఇంధనసరఫరాలపై ఆందోళనలు మళ్లీపెరిగాయి. ఉద్రిక్తతలు మరింత పెరిగినా, తగ్గినా ప్రపంచ మార్కెట్లలో పెట్టుబడిదారుల రిస్క్ తీసుకునే ధోరణిపై ప్రత్యక్ష ప్రభావం చూపే అవకాశం ఉంది. మరోవైపు అంతర్జాతీయ ముడి చమురు ధరల కదలికలు కూడా అత్యంత కీలకంగా మారనున్నాయి. భారత్ ముడి చమురును అధికంగా దిగుమతి చేసుకునే దేశం కావడంతో లాభదాయకతపై కూడా ప్రతికూల ప్రభావం పడనుంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం,
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

రాజమహేంద్రవరం | సోమవారం 13 జులై 2026 | I



## ఘనంగా స్వామి వారి రథసేవ

**అన్నవరం జూలై 12(ప్రభాతవార్త)** కాకినాడ జిల్లా అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి ఆలయంలో స్వామి వారి రథ సేవ ఆదివారం ఉదయం వైభవంగానిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామి అమ్మవారు ఉత్సవ మూర్తులకు వివిధ రకాల సుగంధ పుష్పాలతో అలంకరించారు. అనంతరం స్వామి అమ్మవారు ఉత్సవమూర్తులను రథం పై మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ సత్యదేవుని ఆలయం చుట్టూ మూడుసార్లు ప్రదక్షిణ చేయించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు భాస్కరరావు, పాలకమండ సభ్యులు, ఆలయ ప్రధాన అర్చకులు, అర్చకులు, వ్రతపురోహితులు, భక్తులు పాల్గొన్నారు.

# ఏకలవ్య పాఠశాలల వద్ద కరువైన కనీస వసతులు

- నీడ లేక అల్లాడుతున్న తల్లిదండ్రులు
- వెయిటింగ్ హాల్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి

**అడ్డతీగల, జూలై 12, ప్రభాతవార్త** అడ్డతీగలలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను పరామర్శించేందుకు సుదూర గిరిజన ప్రాంతాల నుంచి వచ్చే తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాల ఆవరణలో కనీస వసతులు లేకపోవడంతో ఎండ తీవ్రత మధ్య గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. తల్లిదండ్రులు వేచి ఉండేందుకు ప్రత్యేక వెయిటింగ్ హాల్ లేదా షెడ్డు లేకపోవడంతో చెట్ల నీడనే ఆశ్రయించాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల యాజమాన్యం నిర్దేశించిన సమయాల్లో మాత్రమే విద్యార్థులను కలిసే అవకాశం ఉండటంతో, అప్పటి వరకు ఎండలోనే వేచి ఉండాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. అదనంగా, తాగునీటి వంటి ప్రాథమిక సౌకర్యాలు కూడా తగిన స్థాయిలో అందుబాటులో లేవని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. వృద్ధులు, మహిళలు, చిన్నారులతో వచ్చే కుటుంబాలు మరింత ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. గిరిజన ప్రాంతాల నుంచి వచ్చే కుటుంబాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, పాఠశాల ఆవరణలో శాశ్వత వెయిటింగ్ హాల్, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు వంటి కనీస వసతులను వెంటనే ఏర్పాటు చేయాలని ఐటీడీఏ అధికారులు, పాఠశాల యాజమాన్యాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. విద్యార్థుల సంక్షేమంతో పాటు వారి కుటుంబ సభ్యుల సౌకర్యాలపైనా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని వారు విజ్ఞప్తి చేశారు.






### పాపికొండల విహారయాత్రకు

## 245 మంది పర్యాటకులు

### మద్యం సేవించిన 16 మందిని వెనక్కి పంపిన అధికారులు



**దేవీపట్నం, జూలై 12 (ప్రభాతవార్త):** ప్రకృతి సోయగాలకు నిలయమైన పాపికొండల విహారయాత్రకు ఆదివారం విశేష స్పందన లభించింది. గోదావరి నదీ తీర ప్రాంతాల అందాలను ఆస్వాదించేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మొత్తం 245 మంది పర్యాటకులు విహారయాత్రలో పాల్గొన్నారు. దేవీపట్నం సమీపంలోని గండి పోచమ్మ ఘాట్ వద్ద నుంచి ప్రత్యేక బోట్లలో పర్యాటకులు పాపికొండల వైపు ప్రయాణించారు. గోదావరి నదీ పరీవాహక ప్రాంతంలో విరాజిల్లుతున్న పచ్చని కొండలు, సహజసిద్ధమైన ప్రకృతి దృశ్యాలు, ఆహ్లాదకర వాతావరణం పర్యాటకులను ఆకట్టుకున్నాయి. కుటుంబ సభ్యులు, యువత, చిన్నారులు పెద్ద సంఖ్యలో విహారయాత్రలో పాల్గొని ఆనందాన్ని వ్యక్తం చేశారు. పర్యాటకుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అధికారులు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకున్నారు. బోట్లలో ప్రయాణించే ప్రతి పర్యాటకుడికి లైఫ్ జాకెట్లు తప్పనిసరి చేశారు. బోట్ల సామర్థ్యం, భద్రతా ప్రమాణాలు, ప్రయాణికుల వివరాలను అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ శాఖ ఏఈ భాస్కర్ ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో 16 మంది మద్యం సేవించి ఉన్నట్లు గుర్తించారు. భద్రతా కారణాల దృష్ట్యా వారిని విహారయాత్రకు అనుమతించకుండా వెనక్కి పంపినట్లు అధికారులు తెలిపారు. పర్యాటకుల ప్రాణ భద్రతే ప్రధాన లక్ష్యమని, మద్యం సేవించి బోటు ప్రయాణాలకు రావద్దని అధికారులు సూచించారు. ఇటీవల గోదావరి నది మధ్యలో బోటు నిలిచిపోవడంతో ఆగిన విహారయాత్ర మరల పాపికొండల విహారయాత్రలకు మళ్లీ ఊపందిందని పర్యాటక శాఖ అధికారులు తెలిపారు. రానున్న రోజుల్లో మరింత మంది పర్యాటకులు ఈ ప్రకృతి విహారయాత్రను సందర్శించే అవకాశం ఉందని పేర్కొన్నారు.

## సీఎం సభను విజయవంతం చేయాలి: రిష్వంత్ రాయ్



**రామచంద్రపురం జులై 12 (ప్రభాతవార్త ):** జిల్లాలో ఆదివారం జరగనున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటనను విజయవంతం చేయాలని ఏఎంసీ చైర్మన్ అక్కల రిష్వంత్ రాయ్ పిలుపునిచ్చారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదేశాల మేరకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ధవళేశ్వరం బ్యారేజీ ఆధునీకరణతో డెల్టా రైతులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. పిచ్చుకలంకలో జరిగే రైతులతో సీఎం ముఖాముఖి కార్యక్రమంలో రైతులు తమ సమస్యలను నేరుగా వివరించవచ్చన్నారు. రైతులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## కాటన్ బ్యారేజీకి మహర్దశ

### నేడు సీఎం చంద్రబాబు తూర్పుగోదావరి జిల్లా పర్యటన



**రాజమహేంద్రవరంఅర్బన్,జూలై 12(ప్రభాతవార్త)** ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల జీవనాడి ధవలేశ్వరం కాటన్ బ్యారేజ్ మరో చారిత్రిక ఘట్టానికి సిద్ధమవుతుంది లక్షలాది ఎకరాలకు సాగునీరు త్రాగునీరు అందిస్తున్న బ్యారేజ్ ప్రతిష్టకు ప్రతిష్టతకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది బ్యారేజీ కి కొత్త వరద గేట్లు ఏర్పాటుకు అధికార యంత్రాంగం రంగం సిద్ధం చేసింది బ్యారేజీ భద్రత ఆధునికరణ లో భాగంగా ఈనెల 13వ తేదీ సోమవారం నాడు కొత్త గేట్లు ఏర్పాట్లు పనులకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారికంగా అంకురార్పణ చేయనున్నారు ఇందుకోసం సుమారు 150 కోట్ల రూపాయల భారీ వ్యయంతో కేటాయించ గా దీని ద్వారా బ్యారేజికి సంబంధించి మొత్తం 117 కొత్త గేట్లు ఏర్పాటు పనులకు శ్రీకారం చుట్టనున్నారు . ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ఈనెల 13వ తేదీ ఉదయం 10 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హెలిపాడ్ ద్వారా ధవళేశ్వరం చేరుకుంటారు అక్కడి నుండి నేరుగా కాటన్ బ్యారేజ్ వద్దకు చేరుకుని 10:25 నిమిషాలకు ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తారు గేట్లు పునర్నిర్మాణ పనులు ప్రారంభించిన అనంతరం స్థానిక రైతాంగం తో ముఖ్యమంత్రి ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తారు ఈ సందర్భంగా సాగునీటి సరఫరా బ్యారేజ్ ఆధునీకరణ వల్ల రైతులకు ప్రయోజనాలపై వారితో చర్చిస్తారు ఈ కార్యక్రమశీ ముగిసిన తర్వాత సీఎం చంద్రబాబు నాయుడు అక్కడ నుండి నేరుగా పోలవరం ప్రాజెక్టు పనులు పరిశీలన నిమిత్తం బయలుదేరి వెళ్తారు ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యం లో తూర్పుగోదావరి జిల్లా ఉన్నతాధికారాలు నీటిపారుదల శాఖ సిబ్బంది ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద భారీ ఏర్పాటులు చేశారు సీఎం రాక కోసం హెలిఫెడ్,నిర్మాణం శిలాఫలక ఆవిష్కరణ,వేదిక భద్రతా చర్యలు మరియు సమావేశ ప్రాంగణాన్ని అధికారులు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు

## ట్రైనీ పోలీసులకు మడ అడవులపై అవగాహన



**తాళ్ళరేవు, జూలై 12 (ప్రభాతవార్త):** కాకినాడ మూడవ బెటాలియన్ లో శిక్షణ పొందుతున్న ఏపీఎస్పీ కానిస్టేబుల్ లకు కోరంగి ఫారెస్ట్ రేంజర్ ఎస్ ఎస్ ఆర్ వరప్రసాద్ ఆధ్వర్యంలో మడ అడవుల పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రేంజర్ మడ అడవుల ప్రయోజనాలు ఎకో టూరిజం అభివృద్ధి వంటి విషయాలను తెలియజేశారు. ఎఫ్ బి ఓ మహేష్ మాట్లాడుతూ కాకినాడ తీరం, గోదావరి పరివాహక ప్రాంతం లో సహజసిద్ధంగా అభివృద్ధి చెందిన మడ అడవులు, ఫారెస్ట్ డిపార్ట్మెంట్ అభివృద్ధి చేసిన మడ నర్సరీ వాటిలో ఉండే రకాలను తెలియజేశారు. మడ అడవులు తీరప్రాంతాన్ని ప్రకృతి విపత్తుల నుండి రక్షిస్తున్నాయని తెలిపారు. శ్వాసించే వేళ్ళు కలిగిన మడ అడవులు నదీ ప్రాంతాన్ని కోతకు గురికాకుండా రక్షిస్తున్నాయని తెలిపారు. మడ చెట్లు 5 నుంచి 6 రెట్ల కార్బన్ డయాక్సైడ్ ను పీల్చుకుని మనకు ఆక్సిజన్ అందిస్తాయన్నారు. సుందర్బన్ అడవుల్లో ఉండే పులులను ఏ విధంగా రక్షిస్తామో ఆ విధంగానే ఈ ప్రాంతంలో సంచరించే ఫిషింగ్ క్యాట్ (నీటి పిల్లి లను) సంరక్షించాల్సిన బాధ్యత అందరి పైన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో థర్డ్ బెటాలియన్ డిఎస్పి గంగరాజు, సెక్షన్ అధికారి కె. సిద్దార్థ, ఎఫ్. బి. ఓ. లు జి. గోపినాగేంద్ర కుమార్, కె. మహేష్, కె. ధనుంజయరావు, సి.బి.ఇ.టి. సిబ్బంది పాల్గొన్నారు.

## పార్కిన్సన్స్ వ్యాధిపై అవగాహన

### యశోద హైటెక్ సిటీ నిపుణుల బృందం వెల్లడించిన కీలక వాస్తవాలు




**కాకినాడ రూరల్ , జూలై 12(ప్రభాతవార్త):** ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మందిని వేధిస్తున్న తీవ్రమైన నరాల క్షీణత రుగ్మత పార్కిన్సన్స్ పై యశోద హైటెక్ సిటీ నిపుణుల బృందం కాకినాడ వేదికగా ఒక ప్రముఖ హోటల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో యశోద హైటెక్ సిటీ పార్కిన్సన్స్ డిసీజ్ అండ్ మూవ్‌మెంట్ డిజార్డర్ రీసెర్చ్ సెంటర్ కోర్స్ డైరెక్టర్, ప్రముఖ న్యూరాలజిస్ట్ రూపమ్ బొర్గోహైన్ నాయకత్వంలోని వైద్యుల బృందం సభ్యులు రుక్మిణి మృదుల, శృతి కోలా ఈ వ్యాధికి అందుబాటులో ఉన్న అత్యాధునిక చికిత్సలపై స్పష్టతనిచ్చారు. వ్యాధి ప్రారంభ దశలో మందుల ద్వారా నియంత్రించినప్పటికీ, ముదిరిన దశలో మందుల ప్రభావం తగ్గినప్పుడు 'డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్' (డీబీఎస్) శస్త్రచికిత్స రోగులలో కొత్త ఆశలు చిగురింపజేస్తోందని వారు పేర్కొన్నారు. మెదడులో కదలికలను నియంత్రించే డోపమైన్ రసాయన ఉత్పత్తి సామర్థ్యం దెబ్బతినడం వల్లే ఈ సమస్య తలెత్తుతుంది. బాధితుల్లో విశ్రాంతి సమయంలో చేతులు, కాళ్లు వణకడం, కండరాలు బిగుసుకుపోవడం, నడక మారడం వంటి శారీరక ఇబ్బందులతో పాటు నిద్రలేమి, మలబద్ధకం, జ్ఞాపకశక్తి లోపాలు వంటి అనేక రకాల మానసిక, శారీరక సమస్యలు తలెత్తుతాయి. అవగాహనా లోపంతో అత్యాధునిక వైద్య సేవలకు దూరమవుతున్న వందలాది మంది బాధితులకుసరైన సమయంలో యశోద హైటెక్ సిటీ వంటి నిపుణుల సంరక్షణ తీసుకుంటే పార్కిన్సన్స్ బాధితులు కూడా సాధారణ, సంతోషకరమైన జీవితాన్ని గడపవచ్చని నిపుణులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో యశోద హైటెక్ సిటీ మార్కెటింగ్ హెడ్ డీజీఎం జీ సంతోష్ కుమార్, కోస్టల్ ఆంధ్రప్రదేశ్ ఎగ్జిక్యూటివ్ సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## కోనసీమ గోవిందుడి అశేష భక్తజనం...

### నిత్యాన్న పథకానికి రూ,100116,/- విరాళం...





**ఆత్రేయపురం , జూలై 12,(ప్రభాత వార్త)** ఏడువారాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయం ఆదివారం కావడంతో అశేష సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఏడు వారాల నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర శతనామావళి, నిత్య కళ్యాణం, గోపూజ, బాల భోగం, నివేదన, తదితర కార్యక్రమాలు కనుల పండువగా జరిగాయి. అనంతరం శ్రీ స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. మండపేట చెందిన మేక ఏసు దాసు, శిరీష దంపతులు, వారి కుమారుడు కాశి వినయ్, వారి కుమార్తె నవ్య వెంకట సుభాషిత, వారి కుటుంబ సభ్యులు, నిత్యాన్నదాన పథకానికి రూ. 100116/- విరాళంగా అందించారు. వారికి ఆలయ అర్చకులు శ్రీ స్వామివారి దర్శనం చేయించి వేద ఆశీర్వచనం అందించగా. ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు శ్రీ స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు. వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు ఏర్పాట్లు చేశారు.

## పంచాయతీల నిధులు గోల్ మాల్?

**యు.కొత్తపల్లి, జూలై 12 (ప్రభాతవార్త) :** మండలంలోని పలు గ్రామ పంచాయతీలకు సంబంధించి నిధులు గోల్ మాల్ అయ్యాయని ఆదివారం సామాజిక మాధ్యమాల్లో హల్ చల్ చేసాయి. ఎండపల్లి, పొన్నాడ, అమీనాబాద్ గ్రామాలకు సంబంధించి మండల పరిషత్తు కార్యాలయంలో ఒప్పంద ప్రాతిపదికన విధులు నిర్వహించే కంప్యూటర్ ఆపరేటర్ ఎకౌంటుకు 2023-24, 2024-25, 2025-26 సంవత్సరాలలో పలుమార్లు నగదు జమయినట్లుగా ఉండడంతో నిధులు గోల్ మాల్ అయ్యాయని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దీనిపై డిప్యూటీ ఎంపీడీఓ బి.గోవిందరాజులను వివరణ కోరగా ఆయా గ్రామ పంచాయతీల్లో పనులు చేసిన, పారిశుధ్య కార్మికులకు బ్యాంక్ ఎకౌంట్ లు లేకపోవడంతో కంప్యూటర్ ఆపరేటర్ ఎకౌంటుకు నగదు బదిలీ చేసి ఉండొచ్చని, దీనిపై పూర్తి విచారణ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

## అక్రమ అరెస్టులపై ప్రజాసంఘాల ఖండన

### ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండా పరిశ్రమ ఏర్పాటు చేయడం తగదు. విశ్వజన కళామండలి రాష్ట్ర అధ్యక్షులు: కుటుంబరావు.




**తాళ్లరేవు, జూలై 12 (ప్రభాతవార్త):** తాళ్లరేవు మండలం పోలేకుర్రు పంచాయతీ తూర్పుపేట వివాదాస్పద స్థలంలో యానాం ఎస్టిపి ప్లాంట్ ఏర్పాటు పై ప్రజలు వ్యతిరేకించగా, ఆ ప్రాంతానికి సంబంధంలేని వేరొక చోట ఉన్న అఖిలపక్ష నాయకులను ఆంధ్రా పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం అ ప్రజాస్వామికమని, అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. ఈ మేరకు తాళ్ళరేవు ప్రజాసంఘాల కార్యాలయంలో విశ్వజన కళామండలి రాష్ట్ర అధ్యక్షులు, ప్రముఖ న్యాయవాది యడ్ల కుటుంబరావు మాట్లాడారు. ఒక పరిశ్రమ ఏర్పాటు చేయడానికి తప్పనిసరిగా ప్రజాభిప్రాయ సేకరణ చేయాలని, ఎటువంటి ప్రజాభిప్రాయం సేకరించకుండా ఆంధ్ర ప్రాంతంలో యానం యొక్క ఎస్ టి పి ప్లాంట్, డంపింగ్ యార్డ్ ఏ విధంగా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. యానంలోని కనకాల పేటలో ఆ ప్రాంత ప్రజలు వ్యతిరేకించగా దానిని గోపాల్ నగర్ లో ఏర్పాటు చేయడానికి ప్రయత్నించారని, అక్కడి ప్రజలు వ్యతిరేకించడంతో ఆంధ్రాలో ఏర్పాటు చేయడం ఎంతవరకు సమంజసం అన్నారు. ఆంధ్రాలో ఉన్న ప్రజలకు ఆరోగ్య సమస్యలు రావా ఇక్కడి వారు ప్రజలు కాదా అని ప్రశ్నించారు. ఆ ప్రాంతం వివాదాస్పద భూమని, హైకోర్టు పరిధిలో ఉందని కాకినాడ ఆర్. డి . ఓ. మల్లిబాబు స్పష్టం చేశారన్నారు. ఎస్ టి పి ప్లాంట్ ఏర్పాటు చేసే స్థలం ఏ ప్రాంతానికి చెందిందో ముందుగా నిర్ధారణ చేయాలన్నారు. యానం ఎస్టిపి ప్లాంట్ కోసం ఆంధ్ర పోలీసులు ఆంధ్ర అఖిలపక్ష నాయకులను అరెస్టు చేయడం ఎంతవరకు న్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు టేకుమూడి ఈశ్వరరావు, ఎండియూడబ్ల్యూఏ అధ్యక్షులు కన్నీడి వెంకటరమణ, కెవిపిఎస్ మండల అధ్యక్షులు విప్పర్తి శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు దుప్పి అదృష్టదీపుడు, గోడి భాస్కర రావు, తణుకు రాంబాబు, గంధం రాంబాబు, శీలి రాజు తదితరులు పాల్గొన్నారు.

# ధవళేశ్వరం బ్యారేజీకి నూతన జీవం..

### 117 వరద గేట్ల మార్పిడికి ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు శ్రీకారం....

### గోదావరి డెల్టా భద్రత, సాగునీటి భవిష్యత్తుకు చారిత్రాత్మక అడుగు...



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి.....ప్రభాతవార్త.** ఉభయ గోదావరి జిల్లాల వ్యవసాయ, తాగునీటి అవసరాలకు దాదాపు రెండు శతాబ్దాలుగా జీవనాడిగా నిలిచిన ధవళేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ మరో చారిత్రాత్మక ఘట్టానికి వేదిక కానుంది. సుమారు రూ152.95 కోట్ల వ్యయంతో 117 పాత వరద గేట్ల స్థానంలో అత్యాధునిక వరద గేట్ల ఏర్పాటు పనులకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిధిలో పిచ్చుకలంక గేట్ నెంబర్ ఒకటి వద్ద సోమవారం శంకుస్థాపన చేయనున్నారు. గోదావరి డెల్టా సాగునీటి భద్రత, ఆనకట్ట దీర్ఘకాలిక సంరక్షణ దిశగా ఇది అత్యంత కీలకమైన మైలురాయిగా అధికారులు పేర్కొంటున్నారు. 1847లో ప్రారంభమై 1852లో పూర్తయిన ధవళేశ్వరం ఆనకట్టతో గోదావరి జలాలను సక్రమంగా వినియోగించేందుకు మార్గం సుగమమైంది. అప్పటి వరకు సముద్రంలో కలిసిపోయే వరద జలాలను వ్యవసాయానికి మళ్లించి,గోదావరి డెల్టాను దేశంలోనే అత్యంత సారవంతమైన ప్రాంతాల్లో ఒకటిగా తీర్చిదిద్దడంలో సర్ ఆర్థర్ కాటన్ పాత్ర చారిత్రాత్మకం గా నిలిచింది. ఈ కృషికి గుర్తింపు గా గోదావరి ప్రాంత రైతులు నేటికీ ఆయనను కృతజ్ఞతాభావంతో స్మరిస్తుంటారు. కాలక్రమేణా పాత ఆనకట్ట వయోభారానికి లోనవడంతో, 1963 వరదల అనంతరం ఆధునిక బ్యారేజీ నిర్మాణ అవసరం ఏర్పడింది. 1969లో ప్రారంభమైన సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ నిర్మాణం 1984లో పూర్తయింది. దాదాపు 5.837 కిలోమీటర్ల పొడవున్న ఈ బ్యారేజీ ప్రస్తుతం 10.13 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించడంతో పాటు లక్షలాది మంది ప్రజలకు తాగునీటి ప్రధాన ఆధారంగా కొనసాగుతోంది. వరద నియంత్రణ, డెల్టా వ్యవసాయ పరిరక్షణలోనూ ఇది కీలక పాత్ర పోషిస్తోంది. నాలుగు దశాబ్దాలుగా నిరంతర వినియోగం, భారీ వరదల ఒత్తిడి, యాంత్రిక భాగాల సహజ శిథిలీకరణ నేపథ్యంలో బ్యారేజీ భద్రతపై కేంద్ర జల సంఘం, డ్యామ్ సేఫ్టీ రివ్యూ ప్యానెల్, హైడ్రో-మెకానికల్ నిపుణుల కమిటీలు పలు దఫాలు పరిశీలనలు నిర్వహించాయి. వాటి సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం బ్యారేజీ ఆధునీకరణకు శ్రీకారం చుట్టింది. 2014-15లో తొలి దశలో 175 వరద గేట్లలో 58 గేట్లను రూ.31.77 కోట్లతో మార్చగా, ఇప్పుడు మిగిలిన 117 గేట్ల మార్పిడి, అన్ని 175 గేట్లకు కొత్త రబ్బర్ సీల్స్, రోలర్ అసెంబ్లీలు, వైర్ రోపులు, మాస్టర్ కంట్రోల్ ప్యానెల్స్, విద్యుత్ కేబుళ్ల మార్పిడి, శాండ్ బ్లాస్టింగ్, పెయింటింగ్ వంటి సమగ్ర పనులు చేపట్టనున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే బ్యారేజీ భద్రత, వరద నిర్వహణ సామర్థ్యం మరింత మెరుగుపడుతుందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ప్రభుత్వం 2025లో ఈ పనులకు పరిపాలనా అనుమతి మంజూరు చేయగా, సాంకేతిక ఆమోదం అనంతరం ఎంఎస్ బికెం ఇన్ ఫ్రా ప్రాజెక్టుస్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ సంస్థకు పనులు అప్పగించారు. రెండు సంవత్సరాల్లో పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రాజెక్టు అమలవుతోంది. ఈ కార్యక్రమం కేవలం గేట్ల మార్పిడితో పరిమితం కాకుండా, గోదావరి డెల్టా భవిష్యత్తుకు భద్రత కల్పించే దీర్ఘకాలిక పెట్టుబడిగా భావిస్తున్నారు. ముఖ్యంగా తూర్పు, పశ్చిమ గోదావరి, కోనసీమ జిల్లాల రైతాంగంతో పాటు మత్స్యకారులు, గ్రామీణ ప్రజల జీవనోపాధి మరింత స్థిరపడే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఇటీవల ఐక్యరాజ్య సమితి గుర్తింపు పొందిన గోదావరి ప్రాంత వారసత్వ సంపద సంరక్షణ దిశగా కూడా ఈ ఆధునీకరణ కార్యక్రమం ప్రాధాన్యం సంతరించుకుంది. చారిత్రక విలువ కలిగిన బ్యారేజీ నిర్మాణ వారసత్వాన్ని పరిరక్షిస్తూనే, ఆధునిక సాంకేతికతతో భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దే ప్రయత్నంగా దీనిని భావిస్తున్నారు. సర్ ఆర్థర్ కాటన్ సృష్టించిన జలవనరుల వారసత్వాన్ని సంరక్షిస్తూ, భవిష్యత్ తరాలకు సురక్షితమైన సాగునీటి వ్యవస్థను అందించాలనే లక్ష్యంతో చేపడుతున్న ఈ కార్యక్రమం గోదావరి డెల్టా చరిత్రలో మరో సువర్ణ అధ్యాయంగా నిలవనుందని అధికారులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

# మరిడమ్మ జాతరకు చురుగ్గా ఏర్పాట్లు

- రేపటి నుంచి ఆగస్టు 19' వరకు ఉత్సవాలు
- నేడు అమ్మ వారి జాగరణ ఉత్సవం.
- పటిష్ట ఏర్పాట్లలో అధికారులు నిమగ్నం



**పెద్దాపురం జూలై 12(ప్రభాత వార్త )** కోరిన కోరికలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం పట్టణంలో కొలువైన మరి దమ్మ అమ్మవారి జాతర ఏటా ఆషాఢ మాసం అమావాస్య నుంచి ప్రారంభమవుతాయి. ఆషాఢ మాసంలో వర్షాల కారణంగా మందులు లేని రోజుల్లో అంటు వ్యాధులు ప్రబలి అనేక మంది మృతి చెందడంతో వారికి రక్షణగా మరిడమ్మ వెలిశారని భక్తుల విశ్వా సం. ఆషాఢ మాసంలో నిర్వహించే అమ్మవారి ఉత్సవాలను తిలకించడానికి ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా అనేక ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులు తరలివస్తారు. పెద్దాపురంలోని ముఖ్య కూడలి ప్రదేశంలో మరిడమ్మ ఆలయాన్ని సామర్లకోటకు చెందిన చింతపల్లి వంశస్తులు నిర్మించారు. అమ్మవారిని చింతపల్లి వారి ఆడపడుచుగా చెబుతారు. ఆలయానికి భక్తుల సంఖ్య క్రమేపీ పెర గడంతో 1952లో ఆలయాన్ని దేవదాయశాఖ స్వాదీనం చేసుకొంది. ప్రస్తుతం దేవదాయశాఖ అసి స్టెంట్ కమిషనర్ కె. విజయలక్ష్మి కార్యనిర్వాహణాధి కారిగా, చింతపల్లి శ్రీహర్ష వంశపారంపర్య ధర్మక ర్తగా వ్యవహరిస్తున్నారు. కాకినాడ నుంచి సామర్ల కోట మీదుగా 20 కిలోమీటర్ల దూరంలో, రాజమ హేంద్రవరం నుంచి 45 కిలోమీటర్ల దూరంలో అమ్మవారి ఆలయం ఉంది.



**ఆషాఢ మాసం అమావాస్య నుంచి జాతర**

ఆషాఢ మాసం అమావాస్య నుంచి జాతర ప్రారం భమవుతుంది. ఈనెల 14 నుంచి ఆగస్టు 19 వరకు పెద్దాపురంలోని మరిడమ్మ ఆలయం37 రోజుల పాటు జాతర కొనసాగుతుంది. జాతర ప్రారంభానికి ముందు రోజు 13న జాగరణ ఉత్సవం జరుగుతుంది. ఈ ఉత్సవాల్లో ఉమ్మడి రాష్ట్ర నలుమూల నుంచి లక్షలాది మంది భక్తులు తరలి వస్తారు. ఆదివారం భక్తుల సంఖ్య ఎక్కువగాఉంటుంది. భక్తుల రద్దీ అధికంగా ఉండే రోజుల్లో ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయడానికి నిర్ణ యించారు. క్యూలు ఏర్పాటు, ఆలయానికి రంగులు, విద్యుద్దీపాలంకరణ, చలువ పందిర్లు, భక్తులకు తాగు నీటి సదుపాయం, ఆలయం వద్ద జరిగే తిరునాళ్లకు షాపుల నిర్మాణం వంటి ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. పోలీసు బందోబస్తుతో పాటు భక్తులకు సేవలు అందించడానికి వివిద సేవా సంస్థల ప్రతినిధులు ముందుకు వస్తున్నారు. సేవా సంస్థల నిర్వాహకులు భక్తులకు ప్రసాద వితరణ చేయడానికి ముందుకు వస్తున్నారు. మరి డమ్మ జాతరలో భాగంగా తొలి జాతర పాత పెద్దా పురం కోట ముందు గ్రామస్తులే నిర్వహించడం అనవాయితీ.

## 37 రోజుల పాటు జాతర



ఆలయంలో కొలువైన మరిడమ్మ తల్లి మరిడమ్మ జాతర సందర్భంగా 37 రోజుల పాటు కొనసాగే ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నాం. ఐదు ఆదివారాల్లో భక్తుల సం ఖ్య ఎక్కువగా ఉంటుంది. ప్రతి ఆదివారం లక్ష మంది భక్తులువచ్చే అవకాశం ఉంది. లయన్స్ క్లబ్, రోటరీ క్లబ్లతో పాటు వివిధసేవా సంస్థలు భక్తులకు పాలు, రొట్టె, పులిహోర పంపిణీకి ముం దుకు వచ్చాయి. ఉచిత దర్శనంతో పాటు రూ.10, రూ.50, రూ.100 దర్శనాలకు క్యూలైన్లు ఏర్పాటు చేశాం. ఆలయం సంబరం తరువాత చేపల వీధి సంబరం ఉంటుంది. పట్టణ పరిధిలో ఆయా వీధుల్లో సంబరాలు చేస్తారు.

**కే విజయలక్ష్మి, మరిడమ్మ ఆలయ ఈఓ, పెద్దాపురం**

## భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు



భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా గతంలో గుర్తించిన లోపాలను సరి చేస్తాం. భక్తులు బయటకు వెళ్ళ మార్గం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేస్తాం. వీఐపీ దర్శనాలకు ప్రత్యేక ఏర్పాట్లపై చర్చిస్తున్నాం. క్యూలలో భక్తులు ఇబ్బంది పడకుండా గతంలో గుర్తించిన లోపాలను సరిచేస్తాం. మొదటి ఆదివారం భక్తులు సౌకర్యవంతంగా అమ్మవారిని దర్శించుకునేలా మార్పులు చేస్తాం. బోర్డు సభ్యులు, అధికారుల సహకారంతో ఉత్సవాలు ఘనంగా ఎటువంటి ఇబ్బంది లేకుండా నిర్వహిస్తాం..

**- చింతపల్లి శ్రీహర్ష, వంశపారంపర్య ధర్మకర్త, సామర్లకోట**

## అన్నదానానికి రూ 1,1,116-/ విరాళం



**అన్నవరం జూలై 12 (ప్రభాత వార్త)** సత్య దేవుని నిత్య అన్నదాన పథకంకు రూ 1,1,116-/విరాళం హైదరాబాద్ చెందిన డి రాధా రుక్మిణి దంపతులు ఏఈఓ బలువు వాసు చెక్కును అందచేశారు. శ్రావణ బహుళ తదియ రోజున అన్నదానం చేయాలని ఆ దంపతులు అధికారులకు తెలియజేశారు. అన్నదానానికి విరాళము ఇచ్చిన దంపతులను ఏఈఓ వాసు అభినందించారు..

## మాల మహానాడు సమావేశం



**మామిడికుదురు.జూలై 12(ప్రభాతవార్త)** అంబేద్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురులో ఉన్న అంబేద్కర్ భవనము నందు మాల మహానాడు రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గుండె నగేష్ బాబు అధ్యక్షతన మాల మహానాడు సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు 100 శాతం దళితుల అభివృద్ధికి వినియోగించాలని క్రైస్తవ మతం స్వీకరించిన దళితులకు ఎస్సీ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఎస్సీ మాలలకు అన్యాయం జరిగే విధంగా నిర్ణయాలు తీసుకోవడం దురదృష్టకరం అన్నారు. దళితుల పై జరుగుతున్న దాడులను నాయకులు తీవ్రంగా ఖండించారు. అటువంటి ఘటనలకు పాల్పడిన వారిపై ప్రభుత్వం చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో గెడ్డం రమేష్ ను అంబేద్కర్ కోనసీమ జిల్లా యువజన అధ్యక్షులుగా నల్లి రాజేష్ నియమించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి కర్ని జాగయ్య, విప్పర్తి ప్రభాకర్, కోశాధికారి ఏనుగుపల్లి చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి మర్రి శామ్యూల్, విప్పర్తి నవీన్, గెడ్డం వెంకటేశ్వరరావు, కలిగితి పల్లంరాజు, మట్టా సత్తిబాబు, నీతిపూడి మహేష్, మందపాటి సత్యనారాయణ,నక్కా బాలకృష్ణ,గెడ్డం రాంబాబు,తాడి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## వేగంగా కుండలేశ్వర ఆలయ అభివృద్ధి పనులు



**కాట్రేనికోన జూలై 12 (ప్రభాతవార్త)** కుండలేశ్వరంలో వృద్ధ గౌతమి నదీ తీరాన స్వయంభువుగా వెలసిన శ్రీ కుండలేశ్వర స్వామివారి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం భక్తుల సౌకర్యార్థం రూ.2.50 కోట్లతో ప్రత్యేక అభివృద్ధి పనులు చేపట్టింది. ఆలయ అభివృద్ధితో పాటు రానున్న పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని చేపట్టిన ఈ ప్రాజెక్టులో భాగంగా ఆలయం వెనుక భాగంలో భక్తుల కోసం విశ్రాంతి వసతి గదులు, అన్నదాన వితరణ భవనం, ఆధునిక మరుగుదొడ్ల నిర్మాణం వేగంగా కొనసాగుతోంది. రానున్న పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఈ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. భవిష్యత్తు లో నిర్మాణ పనుల్లో ఎక్కడా నాణ్యత విషయంలో రాజీ పడకుండా ఉత్తమ ప్రమాణాలు కలిగిన మెటీరియల్ వినియోగించాలని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు ఎప్పటికప్పుడు అధికారులకు సూచనలు చేస్తున్నట్లు వారు వెల్లడించారు. ఇటీవలి కాలంలో కుండలేశ్వర స్వామి ఆలయానికి భక్తుల రద్దీ గణనీయంగా పెరగడంతో వసతి, పారిశుద్ధ్య సౌకర్యాల కొరత ఏర్పడింది. ఈ నేపథ్యంలో భక్తుల అవసరాలను గుర్తించిన ప్రభుత్వం రూ.2.50 కోట్ల నిధులు కేటాయించి వసతి గదులు, మరుగుదొడ్లు, అన్నదాన వితరణ భవనం నిర్మాణానికి శ్రీకారం చుట్టడం శు భపరిణామమని భక్తులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న అసిస్టెంట్ ఇంజనీర్లు మాట్లాడుతూ,పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. నిర్మాణంలో నాణ్యత లోపిస్తే సంబంధిత ఉన్నతాధికారులు దృష్టికి వెంటనే తీసుకెల్తామని అధికారులు స్పష్టం చేశారు. ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ఈ పనులను ఎప్పటికపుడు పర్యవేక్షిస్తున్నారన్నారు.

## పాఠశాల సమస్యలపై విద్యార్థులతో సోళ్ల బొజ్జిరెడ్డి ముఖాముఖి



**అడ్డతీగల, జులై 12, ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్.టి. కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డి అడ్డతీగల మండలంలోని విరవరం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులను సందర్శించిన ఆయన, విద్యార్థులతో నేరుగా మాట్లాడి పాఠశాల పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రోజువారీ పరిపాలనా రికార్డులు, విద్యార్థుల హాజరు పట్టికలను పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతం తక్కువగా ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, దీనిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే, ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. ఈ తనిఖీల్లో వసతి గృహంలో మంచాలు లేకపోవడం, శిథిలావస్థకు చేరిన బాత్రూమ్‌లు, అస్తవ్యస్త డ్రైనేజ్ వ్యవస్థ, పనిచేయని ఆర్.ఓ.వాటర్ ప్లాంట్, దెబ్బతిన్న హ్యాండ్ పంప్ వంటి మౌల...

## గురుపూజోత్సవం... స్వయం సేవక్



**సఖినేటిల్లి జూలై 12, ప్రభాత వార్త:**

కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి ఆలయ ప్రాంగణంలో జరిగిన గురుపూజోత్సవం నకు ముఖ్య అతిథిగా ఆలయ అసిస్టెంట్ కమిషనర్ మోకా నాగవర ప్రసాదు, ముఖ్య వక్త గా నల్లా సత్య కృష్ణ ప్రసాదు లు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుచూ గురుపూజోత్సవం అనేది వ్యక్తి పూజ కాదు భారతీయ సంస్కృతి, త్యాగం, సేవ, దేశభక్తికి ప్రతీక అయిన భగవా ధ్వజాన్ని గురువుగా భావించి నమస్కరించే పవిత్ర కార్యక్రమంమే, ఈ ఉత్సవం మనలో క్రమశిక్షణ, సేవాభావం, సమాజం, దేశం పట్ల అంకితభావాన్ని పెంపొందించే స్ఫూర్తినిస్తుంది. ఈ కార్యక్రమంలో దుర్గా ప్రసాద్, పి సురేష్, మోరీ, కెడిపి, అంతర్వేది కర, దేవస్థానం గ్రామాలనుండి స్వయం సేవక్ లు పాల్గొన్నారు.

## రాజవొమ్మంగిలో మోడల్ పరీక్షలకు అనూహ్య స్పందన



**రాజవొమ్మంగి, జూలై 12, ప్రభాతవార్త** రాజవొమ్మంగి ఎంపిపి పాఠశాలలో ఆదివారం నిర్వహించిన మోడల్ పరీక్షలకు అనూహ్య స్పందన వచ్చింది. మన సెవెన్ స్టడీ సెంటర్ ఆధ్వర్యంలో నవోదయ విద్యాలయం, సైనిక్ స్కూల్, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ (ఇ. యం. ఆర్. ఎస్ ), ఏపీఆర్ స్కూల్ ప్రవేశ పరీక్షలు, వివిధ స్కాలర్‌షిప్ పరీక్షలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో నిర్వాహకులు చోడి నరేష్ కుమార్ ఆధ్వర్యంలో మోడల్ టెస్ట్ నిర్వహించారు. మండలంలోని పలు పాఠశాలలకు చెందిన సుమారు 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమ విజయానికి సహకరించిన యం. ఇ. ఓ లు కె. సత్యనారాయణ దొర, టి. సూరయ్య రెడ్డి, సి. ఆర్. పి.లు, ప్రధానో పాధ్యా యులు, ఉపాధ్యాయులకు నిర్వాహకులు నరేష్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

## ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలి: ఎమ్మెల్యే బండారు



**రావులపాలెం, జూలై 12 (ప్రభాతవార్త) :** గోదావరి డెల్టా అభివృద్ధి, రైతాంగ సంక్షేమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేపడుతున్న కార్యక్రమాలు చారిత్రాత్మకమని, నేడు జరగనున్న ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పిలుపునిచ్చారు. ఆదివారం రావులపాలెం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ధవళేశ్వరం బ్యారేజ్‌లో రూ.150 కోట్లతో 117 గేట్ల ఆధునీకరణ, మరమ్మత్తుల పనులను ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారని తెలిపారు. ఈ పనులు పూర్తయితే గోదావరి డెల్టాలోని 10.50 లక్షల ఎకరాలకు సాగునీటి సరఫరా మరింత మెరుగుపడి రైతాంగానికి దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరుతుందన్నారు. వరదల నియంత్రణ, సాగునీటి నిర్వహణలో ధవళేశ్వరం బ్యారేజ్ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. అనంతరం కొత్తపేట నియోజకవర్గంలోని పిచ్చుకలంకలో ముఖ్యమంత్రి రైతులతో ముఖాముఖి నిర్వహించి సాగునీరు, వ్యవసాయ మౌలిక వసతులు, వరదల ప్రభావం, నదీ పరిరక్షణ తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. గోదావరి నదికోత నివారణకు గ్రోయిన్లు, సిఫన్ల నిర్మాణం, ఏటిగట్ల బలోపేతం, కాలువల ఆధునీకరణ వంటి అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానన్నారు. లొల్ల లాకుల పునర్నిర్మాణానికి రూ.74.20 కోట్ల మంజూరుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. పట్టిసీమ, పోలవరం, తుంగభద్ర ప్రాజెక్టుల అభివృద్ధి చర్యలు రైతాంగానికి మేలు చేస్తున్నాయని చెప్పారు. రైతులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు.

## మతాలు, కులాల మధ్య చిచ్చు పెడితే సహించం

**బిజడ శ్రవణ్, ప్రశ్న రావణ్ లపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి**

**డిసిసిబి చైర్మన్ తుమ్మల**



**పెద్దాపురం, జూలై 12(ప్రభాత వార్త )** ఆంధ్రప్రదేశ్‌లో మత సామరస్యాన్ని దెబ్బతీసే విధంగా కులాల మధ్య కుట్రలు పన్నుతు వైసీపీ పార్టీని అడ్డుపెట్టుకుని మాట్లాడుతున్న జడ శ్రావణ్ , ప్రశ్న రావణ్ పై కఠినంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి( బాబు) అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం అయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రావణ్ వెనుకున్నది కచ్చితంగా వైసీపీ పార్టీ నాయకులు రావణ్ తో కలిసి పనిచేసిన శ్రావణ్ సరిపోవడం లేదని నేరుగా వైసిపి వాళ్లే రంగంలో దిగారన్నారు. ఏలూరు దళిత క్రైస్తవ శంఖారావం పేరుతో జడ శ్రావణ సభ ఏర్పాటు చేసి ప్రధాన వ్యక్తులు క్రైస్తవులు గురించి దళిత క్రైస్తవ గురించి గానీ మాట్లాడకుండా ఎటువంటి సంబంధం లేని అధినేత పవన్ కళ్యాణ్ గురించి మాట్లాడటం వెనుక వైసిపి ప్రధాన పాత్ర పోషించిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మత సామరస్యాన్ని దెబ్బతీసే విధంగా కొందరు వ్యక్తులు కుట్రలు చేస్తున్నారనే ఆరోపణలు అత్యంత ఆందోళన కలిగిస్తున్నాయని ఆయన అన్నారు. క్రైస్తవులను రెచ్చగొట్టి మత ఘర్షణలు సృష్టించేందుకు వైసీపీ నాయకులు, వారికి అనుబంధంగా ఉన్న కొందరు వ్యక్తులు ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు జరగాలని ఆయన డిమాండ్ చేశారు. రావణ్, జడ శ్రావణ్ కుమార్, ప్రకాష్ రాజ్‌ల పాత్రపై వస్తున్న ఆరోపణలు, వారి ఆర్థిక సంబంధాలు, అలాగే వీరి వెనుక ఉన్న శక్తులపై నిష్పాక్షిక విచారణ చేపట్టాలని కోరారు. విదేశీ నిధుల కోణంలో కూడా విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. సనాతన ధర్మాన్ని అవమానించేలా సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారంపై కఠిన చర్యలు తీసుకోవాలని, మత విద్వేషాలను రెచ్చగొట్టే వారిని చట్టం ముందు నిలబెట్టాలని అన్నారు. దేశ సమైక్యత, జాతీయ సమగ్రత, సనాతన ధర్మ పరిరక్షణ కోసం కట్టుబడి పనిచేస్తున్న జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ని రాజకీయంగా లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న దుష్ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో శాంతి, సామరస్యం, సామాజిక ఐక్యతను కాపాడేందుకు ప్రభుత్వం, దర్యాప్తు సంస్థలు తక్షణమే సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని తుమ్మల బాబు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఎస్.సి. కార్పోరేషన్ డైరెక్టర్ దానం లాజర్ బాబు, ఉభయ గోదావరి జిల్లలా ఎన్నికలు కో కన్వీనర్ కొప్పిరెడ్డి నాగబాబు, ,జిల్లా కార్యదర్శి పిట్టా జానకి రామారావు, పెద్దాపురం టౌన్ జనసేన పార్టీ అధ్యక్షులు పోలమరశెట్టి సత్తిబాబు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గాధం శెట్టి శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ ఓబిలి శెట్టి గణేష్, గౌరవ అధ్యక్షులు కఠారి శ్రీను, జట్లా విజయ్ బాబు ,పెంకే వెంకటలక్ష్మి, త్రిపరగిరి చంద్రముఖి, సామర్లకోట మండల యూత్ అధ్యక్షులు మలిరెడ్డి బుచ్చిరాజు,బెందులూరి స్వామి, విజ్జుపురెడ్డి రాంబాబు,గుండెపల్లి సుధాకర్,కొయ్యానా ధర్మ,దాకమురి శ్రీ హరి,మాట్టే ప్రదీప్, గురు స్వామి,కొర్ర సతీష్, ధరనికోట యోహాన్, పెన్నాడ అన్నవరం, పెద్దిరెడ్ల రామకృష్ణ,వడ్డీ రాజశేఖర్, శికోటి యేసు,ఉలపల్లి రామకృష్ణ,కొర్ర సతీష్,త్రిపరగిరి పద్దరాజు, స్వప్న,ప్యాసు దేవి, సుబ్బు, తదితరులు పాల్గొన్నారు

## చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపండి

**బిడీ ఎస్పీ తిలక్ ఆదేశం**



**పెద్దాపురం జూలై 12 (ప్రభాత వార్త )** సబ్ డివిజన్ పరిధిలో చట్ట వ్యతిరేక కార్యాకలపాలపై సిబ్బంది ఉక్కు పాదం ఆపాలని పెద్దాపురం ఎస్పీ ఏజీబీ తిలక్ ఆదేశించారు. ?పెద్దాపురం సబ్ డివిజనల్ కార్యాలయంలో ఆదివారం తిలక్ ఆధ్వర్యంలో జూన్ నెల నేర సమీక్షా సమావేశం నిర్వహించిఅత్యంత కీలకమైన ఆదేశాలను జారీ చేశారు. కేసుల త్వరితగతిన పరిష్కారం: లాంగ్ పెండింగ్ (యూ ఐ ) కేసులు, సోషల్ మీడియా, ప్రాపర్టీ కేసుల దర్యాప్తు పురోగతిని సమీక్షించి, వాటిని తక్షణం ఫైనలైజ్ చేయాలని ఆదేశించారు.

**ఎన్ బి డబ్ల్యూ ల అమలు:**

నాన్ బెయిలబుల్ వారంట్లను (ఎన్ బి డబ్ల్యూ ఎస్ ) వెంటనే ఎగ్జిక్యూట్ చేయాలని స్పష్టం చేశారు.

**అక్రమ బాణాసంచాపై నిఘా:**

ఫైర్ క్రాకర్స్ అక్రమ రవాణా, తయారీ, మరియు అమ్మకాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, నిరంతర తనిఖీలు చేపట్టాలని సూచించారు.

**శాంతిభద్రతల పరిరక్షణ:**

రౌడీ షీటర్లు, రిప్రాప్ పర్సన్స్ (సత్ప్రవర్తన లేనివారు) పై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. మిస్సింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలన్నారు.

**మహిళలు, బాలికల భద్రత:**

మహిళల రక్షణకు ప్రత్యేక శ్రద్ధ వహించాలి. స్కూళ్లు, కాలేజీల వద్ద పెట్రోలింగ్ పెంచి ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ రహిత వాతావరణాన్ని సృష్టించాలి.

**రోడ్డు భద్రత ఙ నిబంధనలు:**

రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన చర్యలు చేపట్టాలి. డ్రంక్ అండ్ డ్రైవ్ వాహనదారులపై కేసులు నమోదు చేయాలి. విద్యార్థులను పరిమితికి మించి తీసుకెళ్లే ఓవర్ లోడ్ స్కూల్ ఆటోలపై కఠిన చర్యలు తీసుకోవాలి.

**దొంగతనాల నివారణ:**

ఈ-బీట్ (ఈ బిట్ ) సిస్టమ్‌ను విస్తృతంగా ఉపయోగించాలని, ప్రాపర్టీ కేసుల ఛేదనకు ప్రత్యేక క్రైమ్ టీంలను ఏర్పాటు చేయాలని అధికారులను డీఎస్పీ తిలక్ ఆదేశించారు. ఈ సమావేశం లో ఈ సమావేశంలో పెద్దాపురం సబ్ డివిజన్ సి ఐ లు వై ఆర్ కే శ్రీనివాస్, చెన్నకేశవరావు, సూరి అప్పారావు, తిరుపతి రావు ఆళ్ల కృష్ణ భగవాన్ తుని రూరల్, ప్రత్తిపాడు, జగ్గంపేట, పెద్దాపురం ఎస్ ఐలు, ఐ డబ్ల్యూ లు, డీ ఎస్పీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# వెలుగుల్లేని గొల్లప్రోలు టోల్ ప్లాజా

## పట్టించుకోని కాంట్రాక్టర్ - భయాందోళనలో వాహనదారులు



**గొల్లప్రోలు, జూలై 12,(ప్రభాతవార్త)** గొల్లప్రోలు టోల్ ప్లాజా వద్ద గడచిన కొన్ని నెలలుగా విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టోల్గేట్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లడ్ లైట్లతో పాటు,జాతీయ రహదారి వెంబడి ఉన్న ఇతర వీధి దీపాలు పూర్తిగా అచేతనంగా మారాయి. దీంతో రాత్రి వేళల్లో నిత్యం టోల్ ప్లాజా సమీప ప్రాంతమంతా చీకటి అలుముకోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనదారులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వేలాది వాహనాల నుండి లక్షలాది రూపాయల టోల్ ఫీజు వసూలు చేస్తున్న యాజమాన్యం వాహనదారుల కనీస సౌకర్యాలను గాలికొదిలేసిందని విమర్శలు వినిపిస్తున్నాయి. రహదారి వెంబడి విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసినప్పటికీ బిల్లులు అధికంగా వస్తున్నాయనే నెపంతోనే టోల్గేట్ యాజమాన్యం ఉద్దేశపూర్వకంగా లైట్లు వేయడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. డబ్బులు వసూలు చేయడంపై ఉన్న శ్రద్ధ వాహనదారులకు సౌకర్యాలు కల్పించడంపై లేదని మండిపడుతున్నారు. స్థానికులు లైట్లు వేయమని కోరుతున్నా టోల్ ప్లాజా నిర్వాహకులు తమను లెక్కచేయడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. నెలలు తరబడి లైట్లు వెలగకపోయినా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రయాణికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అర్ధరాత్రి సమయాల్లో ఘోర ప్రమాదాలు జరిగే అవకాశం ఉండటంతో ప్రయాణికుల ప్రాణాలు గాలికి వదిలేసిన గొల్లప్రోలు టోల్ ప్లాజా కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవడంతోపాటు కాంట్రాక్టు రద్దు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

**-డేంజర్ జోన్‌గా మారిన జంక్షన్లు**

బైపాస్ రోడ్డు నుండి గొల్లప్రోలు ఊర్లోకి వెళ్లే ప్రధాన జంక్షన్ వద్ద ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేసినప్పటికీ రాత్రి సమయంలో వెలగకపోవడం తీవ్ర సమస్యగా మారింది. ప్రతిరోజు రాత్రి వేళల్లో ఈ జంక్షన్లో ఏర్పాటుచేసిన ఫ్లడ్ లైట్లు వెలగకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉండడంతో వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. టోల్ ప్లాజా కు అటు,ఇటు పిఠాపురం,గొల్లప్రోలు వైపుగా వెళ్లే దారులన్నీ చీకటిమయంగా మారడంతో రాత్రి వేళల్లో వాహనాలు ఒకదానికొకటి ఢీకొనే ప్రమాదం పొంచి ఉందని తెలిపారు. సౌర విద్యుత్తుతో వెలిగే ఒకటి రెండు దీపాలు మినహా మిగిలినవన్నీ పనిచేయకపోవడంతో ప్రయాణం నరకప్రాయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు,టోల్ ప్లాజా యాజమాన్యం స్పందించి తక్షణమే విద్యుత్ దీపాలను పునరుద్ధరించాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున నిరసనలు చేపడతామని స్థానికులు హెచ్చరిస్తున్నారు.




## డిప్యూటీ సీఎం పవన్ ఆరోగ్యం కోసం సర్పవరంలో పూజలు



**కాకినాడ రూరల్, జూలై 12 (ప్రభాతవార్త):** జనసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సంపూర్ణ ఆరోగ్యం కోసం కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ఆదేశాల మేరకు సర్పవరం శ్రీ రాజ్యలక్ష్మి సమేత శ్రీ భావనారాయణ స్వామి ఆలయంలో జనసేన పార్టీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజాక్షేత్రంలోకి నూతన ఉత్సాహంతో సంపూర్ణ ఆరోగ్యంతో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మళ్లీ ప్రజా సేవలోకి తిరిగి రావాలని జన సైనికులు, వీర మహిళలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో బస్సా చంటిబాబు,మాజీ డిసిఎంఎస్ వైస్ చైర్మన్ మానేపల్లి బాబ్జి, మాజీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ దినవహి పేర్రాజు (పేరుబాబు), ప్రజా సేవకులు ముద్దన ప్రకాష్, కొర్ల ప్రసాద్, మామిడాల ప్రభాకర్ రావు, పుల్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు 6లో

తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం. డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక వార్త



## పిచ్చుక లంకకు సిఎం చంద్రబాబు పర్యటన

### ఏర్పాట్లను పరిశీలించిన కొత్తపేట ఎమ్మెల్యే బండారు

**పిచ్చుకలంకలో రైతులతో ముఖాముఖి కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యాలి... ఎమ్మెల్యే. బండారు.**



**ఆత్రేయపురం జూలై,12,(ప్రభాత వార్త).**ఆత్రేయపురం మండలం పిచ్చుకలంకలో సోమవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటించనున్న నేపథ్యంలో ఏర్పాటు చేస్తున్న రైతులతో ముఖాముఖి కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆదివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమం జరిగే ప్రాంగణాన్ని సందర్శించి అధికారులు చేపడుతున్న ఏర్పాట్లను సమీక్షించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి రైతుల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కార మార్గాలను సూచించే ఉద్దేశంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున రైతులు హాజరయ్యే అవకాశం ఉన్నందున ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. సభా వేదిక, రైతుల కూర్చునే ఏర్పాట్లు, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ సరఫరా, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలు తదితర అంశాలపై అధికారులతో చర్చించి తగిన సూచనలు చేశారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. రైతులతో నిర్వహించే ముఖాముఖి కార్యక్రమం ద్వారా వ్యవసాయ రంగానికి సంబంధించిన సమస్యలు, అభివృద్ధి అంశాలు, రైతుల అభిప్రాయాలు ముఖ్యమంత్రి దృష్టికి చేరే అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ పరిశీలన కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## 250 మంది విద్యార్థులకు రూ.50 వేల విలువైన నోటు పుస్తకాల పంపిణీ



**గోపాలపురం జూలై 12, (ప్రభాతవార్త):** గోపాలపురం మండలంలోని వెల్లచింతలగూడెం విచారణ పరిధిలోని కోమటికుంట, వాదాలకుంట, పెద్దగూడెం, చిట్యాల, ఉప్పరగూడెం ప్రాంతాలకు చెందిన ఎల్‌కేజీ నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న 250 మంది కేథలిక్ విద్యార్థులకు ఆర్‌సీఎం చర్చి ఫాదర్ కాటం బాల్తజార్ ఆధ్వర్యంలో ఉచితంగా నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. సుమారు రూ.50 వేల విలువైన నోటు పుస్తకాలను అందజేశారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పాటుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సెంట్ జోసెఫ్ పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ సిల్బి, సుపీరియర్ సిస్టర్ లిసి, ఎస్‌హెచ్‌ఎం సిస్టర్స్, ఉపదేశులు, సంఘ పెద్దలు, యువత పాల్గొన్నారు.

## మండలంలో 95.13% ఓటర్ల సర్వే పూర్తి..

### తహసీల్దారు ఎస్. స్వామి

**రాజవొమ్మంగి, జూలై 12, ప్రభాతవార్త**



రాజవొమ్మంగి మండలంలో ఓటర్ల వివరాల సేకరణ 95.13 శాతం పూర్తయిందని తహసీల్దారు ఎస్. స్వామి తెలిపారు. మండలంలోని 52 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 32,016 మంది ఓటర్లు ఉండగా, ఇప్పటివరకూ 30,457 మంది వివరాలు నమోదు అయ్యాయని చెప్పారు. ఇంకా 1,559 మంది ఓటర్లు ఈ నెల 15వ తేదీ సాయంత్రంలోపు తమ వివరాలను పూర్తి చేసి సంబంధిత బీఎల్‌ఓలకు అందజేయాలని ఆయన సూచించారు. ఓటు హక్కు విలువైనదని, ప్రతి ఓటరు సకాలంలో వివరాలు సమర్పించాలని కోరారు.

## జాతీయ రహదారిపై ప్రమాదంలో గేదె మృతి



**రాజవొమ్మంగి, జూలై 12, ప్రభాతవార్త** రాజవొమ్మంగి గ్రామ శివారున ఆదివారం రాత్రి 516 ఈ జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో సూడు గేదె అక్కడికక్కడే మృతి చెందింది. రాజవొమ్మంగి నుండి కాకరపాడు వైపు వెళ్లే ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. రహదారిపై పశువుల సంచారం కారణంగా వరుస ప్రమాదాలు జరుగుతున్నాయి. మనుషులతో పాటు మూగజీవాల ప్రాణాలు కోల్పోతున్నాయి.

## ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణలో 3వ స్థానం సాధించిన తహసీల్దార్ వై.సరస్వతి

**వి.ఆర్.పురం,జూలై 12, ప్రభాతవార్త**



వి.ఆర్.పురం తహసీల్దార్ వై.సరస్వతి 2026 జూన్ 22 నుండి దేశవ్యాప్తంగా ప్రారంభమైన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ(సర్) కార్యక్రమంలో జిల్లాలో 3 వ స్థానం సాధించారు. వి.ఆర్.పురం మండలంలోని 11 గ్రామ పంచాయతీల పరిధిలో 29 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మొత్తం ఓటర్లు 13,323 మంది కాగా, ముగ్గురు సూపర్ వైజర్లు ఆర్ఐ ఎం.రామకృష్ణ, జెవి ఎ.కన్నారావు, ఎస్ ఎ ఎం.రామయ్య ల పర్యవేక్షణలో 11,590 మంది ఓటర్లను ఆదివారం నాటికి డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. దీంతో మండలంలో (సర్) 99,92% పూర్తి అయినట్లైంది. ఇక మిగిలిన వారివి సైతం రానున్న రెండు రోజుల్లో పూర్తి చేస్తామని అధికారులు చెప్తున్నారు. ఈ ఘనత వెనుక అధికారుల పట్టుదలతోపాటుగా, బిఎల్ఓ ల కృషి, శ్రమ దాగి ఉంది.

# సీలేరు నదిలో కొట్టుకుపోయిన యువకుడు మృతి



**మోతుగూడెం జూలై:11 ప్రభాతవార్త** వారంతపు శెలవుల్లో భాగంగా ప్రకృతి అందాలను ఆస్వాదించేందుకు ప్రకృతి ప్రేమికులు పర్యటక ప్రదేశాలను సందర్శిస్తున్నా క్రమంలో మోతుగూడెం పొల్లూరు సీలేరు నది మరియు పోల్లూరు జలపాతానికి పోటెత్తున్నారు. ఆదివారం నాడు వేల మంది పర్యటకులతో పాటు పశ్చిమగోదావరి జిల్లా గణపవరానికి చెందిన ఏడుగురు యువకులు కుడా విచ్చేసారు. ఈ సందర్భంలో పోల్లూరు దారలమ్మా ఆలయం ప్రక్కనున్నా పిక్నిక్ స్పాట్ వద్ద సీలేరు నదిలో ఆ యువకులు స్నానం చేస్తుండగా రోజువారి సరఫరాలో భాగంగానే సంస్థా ఆదేశాలతో విద్యుత్ సరఫరా కోసం నీటిని విడుదల చేసారు. అప్పటి వరకు నదిలో నీటి ప్రవాహం తక్కువ గా ఉన్నా నది ప్రదేశంలో ఉండి స్నానాలు చేస్తున్న వారు,విద్యుత్ వినియోగం కొసం నీటిని దిగువకు వదలినట్లు కొత్తవారికి తెలియకపోవటంతో సీలేరు నది ప్రవాహం పూర్తి స్థాయిలో పెరగటంతో ఆ నీటి ప్రవాహంలో ఏడుగురు యువకులు చిక్కుకున్నారు.ఈ యువకుల్లో ఒక యువకుడు గల్లంత కాగా ఆరుగురుని జెన్ కొ సిబ్బంది మోతుగూడెం స్థానికుల సహాయంతో పోలీసులు ఒడ్డుకు చేర్చారు.అయితే గల్లంతైన యువకుడి కోసం మోతుగూడెం పోలీసులు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు.నీట మునిగిన యువకుడు కొసం గాలింపు చర్యలు చేపట్టిన సర్కిల్ ఇన్స్పెక్టర్ గోపాలకృష్ణ డ్రోన్ టెక్నాలజీని ఉపయోగించటంతో గల్లంతైన ప్రదేశం నుండి సుమారు 500 మీటర్ల దూరం వరకు కొట్టుకువచ్చిన నిటిలో మునిగి ఉన్న ఆకారాన్ని గుర్తించటంతో కొద్ది గంటల సమయంలోనే మృతదేహాన్ని బయటకు వెలికితీయటంతొ సర్కిల్ ఇన్స్పెక్టర్ గోపాలకృష్ణ సమయస్ఫూర్తికి సిబ్బంది అడిషనల్ ఎస్సై కృష్ణ చింతూరు ఎస్సై సంతొష్,డొంకరాయి ఎస్సై చరణ్ నాయక్ స్థానికులు అభినందనలు తెలిపారు. గల్లంతైన యువకుడు మహంకాళి ఉదయ్ కిరణ్(23) భీమవరంలో అశోక్ కిడ్నీ సెంటర్ లో డాక్టర్ గా పని చేస్తున్నాడు అని పోలీసులు తెలిపారు.కేసు నమోదు చేసి పంచనామా కోసం చింతూరు ఏరియా ఆసుపత్రికి పోలీసులు తరలించారు.గత సంవత్సర కాలం లొ ఈ ప్రదేశంలో ఇది రెండవ కేసుగా నమోదైంది కారణం!! సేఫ్టీ మెజర్స్ లొ పోలీసుల హెచ్చరిక బోర్డులు ఆ ప్రదేశంలో ఉన్నా!! పోల్లూరు జలవిద్యుత్ ప్రాజెక్టు లొ నీటి విడుదల సమయాన్నీ తెలియచేస్తూ లోతట్టు ప్రాంతాల లో ఉండే వారికి హెచ్చరిక లాంటీ సిగ్నల్స్ ని" సుదూర ప్రాంతంలో ఉండేవారికి సైతం వినిపించేలా సౌండ్ అలారం సిస్టమ్ లాంటీ యంత్రపరికరాన్ని వినియోగించక పోవడంతో!! ఇలాంటి సందర్భాలు నెలకొంటున్నయని పర్యటకులు వాపోతున్నారు.అదే సౌండ్ అలారం సిస్టం ఏర్పాటు చేసినట్లైతే అప్రమత్తంగా ఉన్నావారికి ఎలార్ట్ అవటానికి సైరన్ అందరిని అలార్ట్ చేస్తు ప్రమాదాలు జరగకుండా ప్రాణాలు కాపాడువకోచ్చు కధ!!

## అంగరంగ వైభవంగా సత్యనారాయణస్వామివారి కల్యాణం



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,జూలై12,ప్రభాతవార్త.** అమలాపురంలో శ్రీ సత్యసాయి కళ్యాణమండపంలో లోకా స్సమస్తా సుఖినో భవంతు ఆధ్యాత్మిక సేవా సంస్థ వారిచే, ప్రముఖ వాస్తు, జ్యోతిష్య, ఆధ్యాత్మిక వేత్త రేలంగి కుమార్ శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో లోక కళ్యాణార్థం భారతదేశ ఆర్థికాభివృద్ధి, ఉభయ తెలుగు రాష్ట్రాల దినదినాభివృద్ధి, ప్రజలందరికీ ధన, ధాన్య, ఆరోగ్య సిద్ధి సంకల్పంగా శ్రీ అనంత లక్ష్మీ సత్యవతీ దేవి సమేత శ్రీ వీర వేంకట సత్యనారాయణమూర్తి స్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవోపేతంగా జరిగింది. వేద పండితుల వేద మంత్రోచ్ఛరణ, కన్యాదానం, జీలకర్ర బెల్లంతో దేవతా మూర్తుల వివాహ ఘట్టం, మంగళ సూత్ర ధారణ, తలంబ్రాల సన్నివేశాలకు భక్తులు భక్తి తన్మయత్వం పొందారు. శ్రీ సత్యదేవుని నామ ప్రాధాన్యత, కల్యాణ మహోత్సవంలో వివిధ ఘట్టాల అంతరార్థాలను కుమార్ శంకర్ గౌడ్ వివరించారు. ఏవిధమైన టికెట్ రుసుము, దక్షిణలు, హుండీలు లేకుండా భక్తులకు ఉచితంగా అవకాశం కల్పించారు. స్వామివారి కల్యాణం వీక్షించుటకు అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసారు. టి.డి.పి నాయకులు,డిసిఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి విచ్చేసి పూజాధికాలలో పాల్గొన్నారు.గోరుగంతు సీతారామం, వక్కలంక నాని శర్మ, రామేశ్వరపు మణికంఠ, అయినవిల్లి నాగేంద్రకుమార్, గువ్వాల అచ్యుతరామయ్య, పలివెల అప్పారావు, దంగేటి అప్పారావు,పితాని నాని,జి. తిరుపతి రావు, దంగేటి మహేష్, నల్లా వేణుగోపాలరావు,శ్రీ విజయ త్రిముఖ గణపతి ఆలయ కమిటీ సభ్యులు సేవలు అందించారు. చివరగా భారీ అన్న సమారాధన నిర్వహించారు.

## ధర్మవరం లో పేకాట శిబిరంపై దాడి 8 అరెస్ట్

### రూ. 9,700 నగదు స్వాధీనం పోలీసులు



**ప్రత్తిపాడు, జూలై 11 ( ప్రభాతవార్త)** మండలంలో ధర్మవరం గ్రామ శివారులో రహస్యంగా పేకాట ఆడుతున్న వారి పై ఆదివారం పోలీసులు దాడి నిర్వహించారు. ఈ దాడిలో ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుండి రూ. 9,700 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ప్రత్తిపాడు ఎస్సై లక్ష్మీకాంతం తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం ధర్మవరం గ్రామ శివారు ప్రాంతంలో కొందరు వ్యక్తులు గుంపుగా చేరి పేకాట ఆడుతున్నట్లు ఎస్సైకి ముందస్తు సమాచారం అందింది. తన సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న నగదుతో పాటు పేక ముక్కలను స్వాధీనం చేసుకుని, స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు. ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా ఉపేక్షించేది లేదు. గ్రామీణ ప్రాంతాల్లో పేకాట, బొమ్మ–బోకు, గుండాట, కోడిపందాలు వంటి జూదాలు ఆడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. ఎక్కడైనా ఇలాంటి చట్టవ్యతిరేక పనులు జరుగుతుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

## బ్రాహ్మణ స్నేహ సేవా సమితి ఆర్థిక సహాయం



**కొత్తపేట, జూలై12,(ప్రభాతవార్త)** వైద్య సేవల ఖర్చు నిమిత్తం ఎదురుచూస్తున్న యువకుని ఆరోగ్య సేవల నిమిత్తం బ్రాహ్మణ స్నేహ సేవా సమితి వారు ఆర్థిక సహాయం అందించారు వివరాల్లోకి వెళితే మండల పరిధిలోని కొత్తపేట శివారు చినగూళ్లపాలెం కు చెందిన యువకుడు వాసంశెట్టి మనోహర్ చిన్న నాటి నుండి బీటా థాలసీమియా మేజర్ వ్యాధితో బాధపడుతున్నాడు వైద్యులు బోన్ మ్యారో అప్లో ఐడెంటికల్ స్టెమ్ సెల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయించాలని సూచించారు ఇప్పటివరకు సుమారు కోటి రూపాయల వరకు ఖర్చు చేశారు ఇంకా ఈ చికిత్సకు సుమారు రూ30 లక్షల వరకు ఖర్చు అవుతుందనీ తెలిసింది కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమ ఈ విషయం తమ దృష్టికి ఆజాద్ ఫౌండేషన్ సభ్యులు కుడుపూడి శాంతిభూషణ్ ద్వారా తెలిసినట్లు ఫౌండేషన్ సభ్యులు తెలిపారు ఆ మేరకు ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఆకెళ్ళ వెంకట నారాయణమూర్తి అమలాపురం బ్రాహ్మణ స్నేహ సేవా సమితి సభ్యులు కలిసి వెళ్లి ఆ కుటుంబానికి చిరు సహాయం 7వేల రూపాయలు అందించారు ఈ కార్యక్రమంలో మంత్రి ప్రగఢ సత్రం చైర్మన్ గొర్తి పవన్ రేమెళ్ళ శ్రీనివాస్ విశాల కన్నబాబు పెయ్యేటి వీరభద్ర రావు బులుసు శ్రీనివాస్ కొల్లూరి శివ పాల్గొన్నారు

## ప్రాథమిక వైద్య సేవలు అందించడంలో ఆర్ఎంపీ, పీఎంపీల పాత్ర కీలకం...

### ఎంఎల్‌ఏ ఆనందరావు

### ప్రజా సంక్షేమ పాలన అద్భుతం...వైద్యుల సంఘం



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూలై12, ప్రభాతవార్త.** అమలాపురం పట్టణం హౌసింగ్ బోర్డు కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద అమలాపురం నియోజకవర్గ శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు ని ఆర్ఎంపీ, పీఎంపీ డాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యే కి ఘనంగా శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలియజేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఎమ్మెల్యే ఆనందరావు చేస్తున్న వినూత్న అభివృద్ధి పనులను, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను వారు ఈ సందర్భంగా ప్రత్యేకంగా కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు అందించడంలో ఆర్ఎంపీ, పీఎంపీల పాత్ర కీలకమన్నారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ప్రజా సేవలో అందరి భాగస్వామ్యం అవసరమని స్పష్టం చేశారు. తమను ఆదరించి, సమస్యల పట్ల సానుకూలంగా స్పందించినందుకు అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే కి కృతజ్ఞతలు చాటారు.అధ్యక్షుడు కుడుపూడి రమణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ముఖ్య నాయకులు, ప్రతినిధులు,కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే నానాజీను మర్యాదపూర్వకంగా కలిసిన టీడీపీ రూరల్ ఇన్‌ఛార్జ్ పిల్లి దంపతులు



**కాకినాడ రూరల్, జూలై 12 (ప్రభాతవార్త):** కాకినాడ రూరల్ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నూతన ఇన్‌ఛార్జ్‌గా ఇటీవల నియమితులు అయిన కూటమి నాయకులు పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి దంపతులు ఆదివారం కాకినాడ రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ ను గోడారిగుంట క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు, ఈ సందర్భంగా ఎమ్మెల్యే పంతం నానాజీ , పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణ మూర్తి దంపతులకు దుశ్శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వంలో కాకినాడ రూరల్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పదంలో నడిపేందుకు సమన్వయంతో ముందుకు సాగాలని , స్థానిక సంస్థల దృష్టిలో ఉంచుకొని పనిచేయాలన్నారు. అనంతరంఎమ్మెల్యే తనయుడు సందీప్ పిల్లి దంపతులకు పుష్పగుచ్ఛం తో శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, జనసేన పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ సమీపంలోనే అక్రమ చెరువు తవ్వకం

### గ్రామస్తుల ఆగ్రహం



**అనపర్తి జూలై12(ప్రభాతవార్త)** అనపర్తి మండలం పెదపర్తి గ్రామంలో హరిజనపేటకు సమీపంలో కుతుకులూరు కు చెందిన వెంకట సుబ్బారెడ్డి అనే వ్యక్తి తన పొలాన్ని చెరువుగా మార్చడానికి తవ్వుతుండగా గ్రామస్తులు వెళ్ళి అడ్డుకున్నారు గతంలో ఇదే ప్రాంతంలో మిషనుతీసుకొచ్చి అక్రమ చెరువు అక్రమంగా జరుగుతుండగా గ్రామస్తులు అడ్డుకోవడంతో తవ్వకాలు నిలిపివేశారు మరల ఆదివారం గుట్టు కాకుండా తవ్వకాలు మొదలు పెట్టడంతో ఆగ్రహంతో గ్రామస్తులు వెళ్లి అడ్డుకున్నారు దీనిపై ఉన్నత అధికారులు పై ఫిర్యాదు చేయడానికి గ్రామస్తులు సోమవారం జిల్లా కలెక్టర్ ను కలిసి ఫిర్యాదు చేయనున్నారు .గ్రామానికి అతి సమీపంలో చెరువు తవ్వడం వల్ల చిన్న పిల్లలు చెరువులో పడేప్రమాదం ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. చెరువు తవ్వకాలు నిలపకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని గ్రామస్తులు హెచ్చరించారు.

## ర్యాలి శ్రీ జగన్మోహినీ కేశవస్వామి ఆలయంలో భక్తులు సందడి.

### నిత్యాన్నపథకానికి రూ.10,116 విరాళం...







**ఆత్రేయపురం, జూలై,12,(ప్రభాత వార్త)** ప్రముఖ పుణ్యక్షేత్రం ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవ స్వామి వారి ఆలయం ఆదివారం కావడంతో వేలాది మంది భక్తులతో సందడిగా మారింది.సుదూర ప్రాంతాలనుండి వచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి..శ్రీ స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు అనపర్తి మండలం, రామవరం గ్రామానికి చెందిన కె. వీర్రాఘవరెడ్డి, లక్ష్మి మాధవి దంపతులు, శ్రీ స్వామి వారిని దర్శించుకుని శ్రీస్వామి వారి నిత్యాన్నదాన పథకానికి రూ. 10,116/- వేలు విరాళంగా అందించారు. దాతలకు ఆలయ అర్చకులు వేదమంత్రాలతో శ్రీ స్వామివారి దర్శనం చేయించి వేద ఆశీర్వచనం అందించగా, ఆలయ చైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ కార్యనిర్వాహణాధికారి దారపు రెడ్డి సురేష్ బాబు, జూనియర్ అసిస్టెంట్లు మేడిద శ్రీను, దత్తు లు శ్రీ స్వామివారి చిత్రపటం తీర్థప్రసాదాలు అందజేశారు. వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు ఏర్పాట్లు చేశారు.

## రామస్వామితోటలో తాగునీటి కష్టాలు



**కాట్రేనికోన జూలై 12 (ప్రభాతవార్త)** కాట్రేనికోన పంచాయతీ పరిధి రామస్వామితోటలో తాగునీరు సక్రమంగా అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఇక్కడ కొంతమంది తమ కుళాయిలకు విద్యుత్ మోటార్ల బిగించి ట్యాంక్ ల్లోకి నీటిని నింపుకోవడంతో శివారున ఉన్న వారికి తాగునీరు రావడం లేదంటున్నారు. ఇదే ప్రాంతంలో కొన్ని ఇళ్లకు రెండేసి పైపులైన్లు వేసారు. వారు ఇక్కడున్న రెండు ఓహెచ్ ట్యాంక్ , రెండు కుళాయిల ద్వారా నీరు పట్టుకుంటున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శికి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత మూడు నెలలుగా ఇదే పరిస్థితి. అధికారుల నిర్లక్ష్యం తమకు శాపంగా మారిందని వాపోతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి కుళాయిలకు విద్యుత్ మోటార్ల ను తొలగించి తాగునీరు ఇప్పించాలని వారు కోరుతున్నారు.

## హిందూ మతం కాదు.. సనాతన ధర్మం..

**కలిసి ఉండాలనే బలమైన సంకల్పం.. ఇదే ఆర్ఎస్ఎస్ సిద్ధాంతం.. ఆర్ఎస్ఎస్ విభాగ వ్యవస్థ ప్రముఖ్ అమ్మిరాజు..**



**అంబాజీపేట,జూలై 12 (ప్రభాతవార్త):** హిందూ అనేది మతం కాదని, సనాతన ధర్మమని,సమాజంలో మార్పు తీసుకువచ్చి కుటుంబ వ్యవస్థను బలంగా తీర్చిదిద్ది, దేశ ప్రజలు కలిసి ఉండాలనే సంకల్పంతో రాష్ట్రీయ స్వయం సేవక్ (ఆర్ఎస్ఎస్) నిర్మితమైందని ఆర్ఎస్ఎస్ విభాగ వ్యవస్థ ప్రముఖ్ గన్నవరపు అమ్మిరాజు తెలిపారు. అంబాజీపేట కొర్లపాటివారి పాలెంలో వేంచేసి ఉన్న శ్రీ భూ సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయ ప్రాంగణంలో భారతీయ కిసాన్ సంఘ్ (బికేఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షులు ముత్యాల జమ్మిలు ఆధ్వర్యంలో ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలపై అవగాహన సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మిరాజు మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ ఏర్పడి 100 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ నెల 29న జరగబోయే గురుపూజోత్సవంను పురస్కరించుకొని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని 253 గ్రామాల్లో 27 సెప్టెంబర్ నుండి 4 అక్టోబర్ వరకు ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలపై ప్రచారం నిర్వహిస్తామన్నారు. 100 ఏళ్ల క్రితం 30 కోట్ల జనాభా ఉన్న భారతదేశాన్ని విదేశీయులు ఎందుకు పాలించాలనే ప్రశ్న తలెత్తడంతో విద్యార్థిగా ఉన్న కేశవరావు బలేరామ్ హెగ్డే వార్ ఆర్ఎస్ఎస్ ను స్థాపించారన్నారు.1927 లో త్యాగానికి గుర్తుగా "కాషాయం"జెండాను రూపొందించి దేశ ప్రజలను చైతన్యం చేసేందుకు ఉపక్రమించారన్నారు. చదువుకునే రోజుల్లో నుండే దేశభక్తి మెండుగా ఉన్న కేశవరావు భలేరాం హెగ్డే వార్ ఎంతోమందిని ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాల వైపు ఆకర్షించగలిగారన్నారు. మాతృ సంస్థ ఆర్ఎస్ఎస్ నుండి 44 విభాగాలుగా వివిధ వ్యవస్థలను నడుపుతున్నాయన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద సేవా సంస్థ అయిన ఆర్ఎస్ఎస్ 1.26లక్షలకు పైగా సేవా కార్యక్రమాలు నిర్వహించిందన్నారు. ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా 32 వేల విద్యా పాఠశాలలు నిర్వహిస్తున్నారని తెలిపారు. దేశంలోని 29 రాష్ట్రాలకు గాను 22 రాష్ట్రాలలో ఆర్ఎస్ఎస్ బలంగా పనిచేస్తుందని, అభివృద్ధిలో మూడవ స్థానంలో ఉన్న భారతదేశం వైపు ప్రపంచ దేశాలు చూస్తున్నాయని, దానికి కారణం భారతీయులంతా కుల, మత, వర్గాలకు అతీతంగా అందరూ కలిసి ఉంటారనే సంకేతం వెల్లడమేనన్నారు. సనాతన ధర్మం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని, రోజులోని 23 గంటలు మీకోసం కేటాయించుకుని, ఒక గంట సమాజం కోసం కేటాయించాలని, ఇదే ఆర్ఎస్ఎస్ ప్రధాన సిద్ధాంతమని అమ్మిరాజు తెలిపారు. అంతకుముందు కాషాయ జెండాను ఎగరవేసి ప్రత్యేక పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు పాణింగపల్లి నరసింహాచార్యులు, గణపతి వీర రాఘవులు,రవణం రాము, కొర్లపాటి రాజగోపాల్, నైనాల ప్రభాకర్, రవణం హరిబాబు, పి.గన్నవరం విభాగం శాఖ ప్రచారక్ గన్నవరపు కేశవ్, శ్రీవారి మహిళా సేవకులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదంలో --ఇద్దరు మృతి



**దేవరపల్లి, జూలై 12 (ప్రభాతవార్త ):** మండలంలోని యర్నగూడెం జాతీయ రహదారి పై ఆర్.కన్వెన్షన్ సమీపంలో ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు వ్యక్తులు మృతి చెందారు.దేవరపల్లి నుండి నల్లజర్ల వైపు పుల్లలు లోడ్ చేసుకుందునేందుకు వెళ్తున్న ట్రాక్టర్ ట్రక్కు వెనుక బాగాన్ని వేగంగా వచ్చిన లారీ బలంగా ఢీకొట్టింది.ట్రాక్టర్ ట్రక్కుకు సైడ్ డోర్లు లేకపోవడంతో వెనుక నుంచి వాహనం ఢీకొన్న ప్రభావానికి ట్రక్కులో ప్రయాణిస్తున్న ముగ్గురిలో ఇద్దరు వ్యక్తులు ఎగిరి రోడ్డుపై పడిపోవడం జరిగింది.ఈ ప్రమాదంలో రోడ్డు తాకిడికి తలలకు తీవ్ర గాయాలు కావడంతో సంఘటనా స్థలంలోనే సదరు ఇద్దరు వ్యక్తులు మృతి చెందడం జరిగింది.అదృష్టవశాత్తు ట్రక్కులోని మరో వ్యక్తి,ట్రాక్టర్ డ్రైవర్ ఈ ప్రమాదం నుండి సురక్షితంగా బయటపడ్డారు.మృతులు దేవరపల్లి గ్రామానికి చెందిన కుక్కల శ్రీను (40) కళ్ళే రాజు (40) గా పోలీసులు గుర్తించారు.సమాచారం అందుకున్న హైవే మొబైల్ పార్టీ,దేవరపల్లి పోలీసు సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి,ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం కలగకుండా రక్షణ చర్యలు చేపట్టారు.ఈ సంఘటనపై కేసు నమోదు చేసి,ప్రమాదానికి కారణభూతుడైన తమిళనాడు కు చెందిన లారీ డ్రైవర్ను అదుపులోకి తీసుకుని,దర్యాప్తు కొనసాగిస్తున్నట్లుగా ఎస్సై పి.మనోహర్ తెలియజేశారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps